
# సాహిత్య ప్రస్థానం





# సాహిత్య ప్రస్థానం


## ఉక్కుస్వరం వినిపించాలి

విశాఖ ఉక్కు కర్మాగారం దేశానికే గర్వకారణమైన ప్రభుత్వరంగ పరిశ్రమ. అది ప్రజల ప్రబలమైన ఆకాంక్షకు, అశేష త్యాగాలకు, అలుపెరగని పోరాటాలకు ప్రతి రూపం. విశాఖపట్నం ఆధునిక విశాఖగా, విశ్వనగరిగా విస్తరిల్లటానికి అదొక ప్రధాన కారకం. అందుకనే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు తెగనమ్మటమే పనిగా పెట్టుకున్న మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ... వైజాగ్ స్టీల్ వాటాలను అమ్మేస్తానని ప్రకటించినప్పుడు ప్రజానీకం నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. అది రోజురోజుకూ విస్తరించి, ప్రజాఉద్యమంగా రూపుదిద్దుకొంది.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా తెలుగు వారి మీద కేంద్ర పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతున్నప్పుడు... యువతకు ఉద్యోగ ఉపాధులకు అవకాశమిచ్చే పరిశ్రమలను నెలకొల్పటానికి మీనమేషాలు లెక్కిస్తున్నప్పుడు ... ఒక బలమైన ఆకాంక్షగా ముందుకొచ్చింది విశాఖలో ఉక్కు కర్మాగార నిర్మాణం. కమిటీలతో, కల్లబొల్లి కబుర్లతో కేంద్ర పాలకులు కాలయాపన చేస్తున్నప్పుడు రాష్ట్రం మొత్తం ఒక్క గొంతుకై మార్మోగింది. “విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు” అని ఢిల్లీ పీఠం దద్దరిల్లేలా నినదించింది. ఆనాడు చట్టసభల్లో బలంగా ఉన్న కమ్యూనిస్టు ప్రతినిధులు, వారిని అనుసరించి ఇతరులు ఒక్కపట్టాన పదవులకు రాజీనామా చేసి, ప్రత్యక్ష పోరాటంలోకి దిగటంతో ఉద్యమం ఉధృతమైంది. పోలీసుల లాఠీలకు, తూటాలకు రాష్ట్రవ్యాప్తంగా 32 మంది బలయ్యారు. ఎందరో జైళ్ల పాలయ్యారు. ఎట్టకేలకు ప్రభుత్వం దిగొచ్చినప్పుడు.. ఉక్కు పరిశ్రమ కోసం వందలాది మంది రైతులు వేలాది ఎకరాలను ప్రభుత్వానికి ఇచ్చారు. ఇలాంటి గొప్ప త్యాగాల పునాది మీద నిర్మితమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఉన్నఫళాన ప్రయివేటు పరం చేయాలనుకోవటం, ప్రజలు ఏకకంఠంతో వ్యతిరేకిస్తుంటే ‘అమ్మి తీరుతాం’ అని ఏకంగా ప్రధానియే ప్రకటించటం దారుణాతిదారుణం.

ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతికపరమైన అభ్యున్నతికి దోహదపడే ప్రభుత్వరంగాన్ని ఇలా కార్పొరేట్ల పరం చేయటాన్ని కవులూ రచయితలూ కళాకారులూ మేధావులూ తీవ్రంగా వ్యతిరేకించాలి. ఇప్పటికే ఈ అన్యాయంపై సదస్సులూ, కవిసమ్మేళనాలూ జరుగుతున్నాయి. ముమ్ముందు ఆ ప్రయత్నం మరింత జరగాలి. కథ కవిత్వం గేయం గానం ఆటా పాటా ... ఇలా అన్ని రూపాల్లోనూ ప్రజాగళం బలంగా ప్రతిధ్వనించాలి. ■


ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్**
**కెంగార మోహన్** ◆ **వొరప్రసాద్**
*మేనేజర్ :* **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


మార్కెట్లో ఉద్యోగం – మొలకలపల్లి కోటేశ్వరరావు .......5
ముసుగు – ఇ శ్రీనివాస రెడ్డి ..................22
గుంటనక్కలు – దొండపాటి కృష్ణ .................32
కళ్ళకు గంతలు – మారిశెట్టి గోవింద్ ............ 44


## కవితలు


ఎదుగుతున్న కూతురు – పేరిశెట్టి శ్రీనివాసరావు ....... 9
మా ఊరికి టవరొచ్చింది – డా.మాటూరి శ్రీనివాస్..... 10
వేడెక్కుతున్న ఉక్కు ... చింతా అప్పలనాయుడు........ 16
బతుకు పాట ... డా.ఎ.ఎ నాగేంద్ర .................... 16
మట్టి మోహరించిన చోటు – దాకరపు బాబూరావు ....15
దు:ఖదీపం – పుట్టి గిరిధర్ .......................... 25
ప్రియమైన చేతులు – డా.పెరుగు రామకృష్ణ.......... 47
ఊరు నిద్ర లేస్తున్నప్పుడు – సాంబమూర్తి లండ..... 48
శేషమే లేని విశేష గ్రంథం – సోంపాక సీత .......... 51
బొమ్మలాట – డాక్టర్ పళని ............................. 52
ప్రశ్న ఎవరికి? – మూని వెంకట చలపతి ............ 55
privatisation@india.com– బంగార్రాజు ......... 56
ప్రశ్నించుకో – సునీత పేరిచర్ల ........................... 57
విచికిత్స– డా.ఎన్. గోపి ............................... 61


## వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం జనవరి 2021 పురస్కారాలు ......... 8
కథాదీప్తి : కథల గూర్చి, గురించి ...
– ఎమ్వీ రామిరెడ్డి ................................. 11
సమకాలీన వాస్తవికతకు దర్పణం
– అలజంగి మురళీధర్ ................................... 17
మట్టి పాదాల వెంట ప్రవహించిన కవిత్వం
– కంచరాన భుజంగరావు ........................19
సామాజిక మాధ్యమంలో సాహితీ సేద్యం
– తుమ్మేటి రఘోత్తమ రెడ్డి .........................26
దంపూరు నరసయ్య : ఆంధ్రభాషా గ్రామ వర్తమాని
– ఆచార్య డివి శ్రవణ్ కుమార్ ........................28
నివాళి : తెలుగుదనపు నిలువెత్తు కథకుడు సింగమనేని 35
ప్రాణం ఉన్నవరకూ .. అదే ఆదర్శం – కవిత శ్రీ ......37
ప్రపంచమే ఒక పెద్ద పరస – డా.కరణం శ్రీనివాస రెడ్డి 40
ప్రమాదంలో మీడియా స్వేచ్ఛ – ఎస్ వెంకట్రావు ...... 49
బుచ్చిబాబు గారు మెచ్చుకుంటే చాలనుకున్నాను
– శివరాజు సుబ్బలక్ష్మి (పున:ప్రచురణ) ............ 53
వ్యవస్థ మార్పునకు వలస భారతం పిలుపు
– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి .....................58
డైరీ ..........................................................62
స్వీకారం ....................................................64



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ



# మార్కెట్లో ఉద్యోగం

- మొలకలపల్లి కోటేశ్వరరావు
99892 24280

**"లే..** లేచి అన్నం తిని చదువుకో నానీ! రెండు అవుతోంది. ఇంతవరకూ పచ్చి మంచినీళ్లు ముట్టుకోకపోతివీ! తినడం ఎప్పుడైనా వుండే ఆలస్యమే కదా?" ముందు గదిలో ఒక్కడే చాపమీద కూర్చుని, ఎదురుగా పుస్తకాలూ, పేపర్లూ వేసుకొని పట్టు వదలకుండా దీక్షగా, శ్రద్ధగా చదువుకుంటున్న కొడుకుతో అమ్మ సరస్వతి అంది.

"ఒక్క అరగంట అమ్మా"

"అరగంట ఏమిటి? టైం ఎంత అవుతుందనుకుంటున్నావ్? ఒంట్లో శక్తి ఉంటేనే మైండ్‌లో కూడా శక్తి ఉండేది. ముందు లేచి తిను. కడుపులో ఏం లేకుండా నీరసంగా వుండి చదువుతుంటే బుర్రకి మాత్రం ఏం ఎక్కుద్ది?"

అమ్మ ఒత్తిడి చేయడంతో లేచి వంటగదిలోకి వెళ్లి పీట వేసుకొని కూర్చున్నాడు శేఖర్. ముందు గది. వెనుక గది. రెండు గదుల ఇల్లు. సరస్వతి కంచంలో అన్నం పెట్టి తెచ్చి కొడుకుముందు పెట్టింది.

"కోచింగ్ సెంటర్లో రోజూ మూడు టెస్టులు పెడతారమ్మా! వాటిలో బాగా మార్కులు వచ్చాయి.

చాలా టెస్టుల్లో నేనే ఫస్ట్ వచ్చాను. ఈసారి ష్యూర్‌గా జాబ్ వస్తుంది"

"మంచిది నానీ! నీకు జాబ్ వస్తేనే మనం గట్టెక్కుతాం. లేకపోతే ఇంకా ఇబ్బందుల్లో పడతాం. చెల్లి పెళ్లి చేయాలి. నువ్వు ఒక ఇంటివాడివి కావాలి. ఇవి జరగాలంటే నీకు జాబ్ రావాలి. జాబ్ లేకపోతే కనీసం ఇవ్వాళ పిల్లని ఇచ్చేవాళ్లు కూడా లేరు. కాలం బాగా మారిపోయింది"

"అందుకే కష్టపడి చదువుతున్నానమ్మా! నా లక్ష్యమూ, గమ్యమూ జాబ్ సాధించడమే! ఈసారి కచ్చితంగా జాబ్ కొడతాను"

"ఆ కాన్ఫిడెన్స్ వుండాలి. ఎన్ని పరీక్షలు రాశావో ఇప్పటివరకూ ఎండమావిగానే ఉంది వ్యవహారం. ఎప్పటికప్పుడు వస్తుందనుకుంటున్నాం. ఒక్కటీ రెండు మార్కులతో మిస్సవుతున్నావు"

"కోచింగ్ సెంటర్లోనేకాకుండా, ఇంటిదగ్గర కూడా ఎక్కడెక్కడో తెచ్చుకొని, నెట్‌లో వెదుకులాడి డౌన్‌లోడ్ చేసుకొని వందకిపైగా పేపర్లకి ఆన్సర్ చేశానమ్మా! అన్నిట్లోనూ నైన్టీ పర్సెంట్ పైగానే మార్కులు వచ్చాయి. ఈసారి గట్టిగా వస్తుందనే అనుకుంటున్నా!" అన్నాడు శేఖర్ ధీమాగా.

"ఈ ఉజ్జోగాలు అనేవి కోచింగ్ సెంటర్ల వాళ్లకి పాడికుండల మాదిరిగా వుంది. వాళ్లకి ఎంతెంత ఫీజులు కడుతున్నాం!"

"అవును. చాలా డబ్బు అయిపోయిందమ్మా కోచింగ్‌లకి!"

"డబ్బు పోతే పోయింది. నీకు జాబ్ వస్తే అవి అన్నీ లెక్కలోనివి కావు"

"నిజానికి ఆ కోచింగ్ సెంటర్లలో పెద్దగా చెప్పేది కూడా ఏం వుండదు. అయితే పరీక్షలు ఎక్కువ పెడతారు. డౌట్స్ క్లియర్ చేస్తారు. ఇక ఎంత? రెండు రోజులు. ఎల్లుండి ఈ పాటికి పరీక్ష అయిపోతుంది!" అన్నాడు శేఖర్.

అతను ఎమ్మెస్సీ చదివాడు. మంచి తెలివిగలిగినవాడు. ఆరేళ్ల నుంచీ జాబ్ కోసం వచ్చిన అన్ని రకాల నోటిఫికేషన్లకీ అప్లయ్ చేసి పరీక్షలు రాస్తున్నాడు. విపరీతంగా శ్రమిస్తున్నాడు. అయినా చివరి వరకూ వచ్చి కటాఫ్ మార్కుల దగ్గర ఆగిపోతున్నాడు. జాబ్‌కి దూరమైపోతున్నాడు.

వాళ్లమ్మ సరస్వతికి చదువుల విలువ బాగా తెలుసు. తను ఇంటర్మీడియట్ చదువుకుంది. ఇంకా చదువుకుని వుండేది కానీ అమ్మానాన్న తొందరపడి పెళ్లి చేశారు. ఒక బరువూ బాధ్యత దించుకుందామని తనకి 17 ఏళ్ల వయస్సులోనే మెడలో మూడుముళ్లు వేయించారు. తను ఏం బరువో వాళ్లకి?

భర్త ప్రైవేట్ బస్సులో కండక్టర్‌గా పనిచేశాడు. పిల్లలు హైస్కూలు చదువుల్లో వుండగా జబ్బున పడ్డాడు. కిడ్నీలు పాడైపోయాయి. తమకి ఆస్తిపాస్తులు కూడా ఏమీ లేవు. ఉన్న కొద్దోగొప్పో డబ్బూ, బంగారం, కొంత అప్పు చేసి భర్త వైద్యానికి ఆస్పత్రులకి పెట్టాల్సి వచ్చింది. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. పోయాడు ఆయన.

పిల్లలు చిన్నవాళ్లు. అబ్బాయి తొమ్మిదీ, అమ్మాయి ఆరూ చదువుతున్నారు. తను కూలీనాలీ చేసి, ఎంత కష్టపడి అయినా పిల్లల్ని గట్టిగా చదివించాలని దృఢంగా నిర్ణయించుకుంది. సరిగ్గా చదువుకుంటే డాక్టర్ కావొచ్చు, ఇంజనీర్ కావొచ్చు, కలెక్టర్ కావొచ్చు, కనీసం క్లర్క్ అయినా కావొచ్చు. చదువుకుంటే చాలు!

పిల్లల చదువుల కోసం తను రేయింబవళ్లూ శ్రమించింది. మిషన్ కుట్టింది. చీరలు అమ్మింది. పచ్చళ్లు చేసి ఇల్లిల్లూ తిరిగి అమ్మింది. కూలీనాలికి వెళ్లింది. తినీ తినకుండా తను పస్తులు పడుకొని పిల్లల కడుపు నింపింది. అయితే అన్నీ అనుకున్నట్లు జరగలేదు. అబ్బాయి బాధ్యతగానే చదువుకుని ఎమ్మెస్సీ పూర్తి చేశాడు. అమ్మాయికి చదువు మీద పెద్ద ఆసక్తి లేకపోయింది. పదితో ఆపేసింది. టౌన్‌లో ఒక బట్టల షాపులో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తోంది. టౌన్‌కీ, ఊరికీ పన్నెండు కిలోమీటర్ల దూరం. రోజూ టౌనికి బస్సులోనో, ఆటోలోనో వెళ్ళి వస్తుంది.

కొడుకు శేఖర్ మొదట్లో కొంతకాలం ప్రైవేటు జాబ్‌చేసి మానుకున్నాడు.

"ఎందుకమ్మా ప్రైవేటు ఉజ్జోగం? ఎదుగూ బదుగూ వుండదు. చీత్తే ఊడిపోయే ముక్కు! యాజమాన్యం మీద మనకి కోపం వచ్చినా, మన మీద యాజమాన్యానికి కోపం వచ్చినా బలయ్యేది మనమే! చేయాలి కానీ, ఇరవై నాలుగ్గంటలూ చాకిరీ చేయించుకుంటారు. మన శ్రమని ఇంకా ఇంకా దోచుకోవాలని చూస్తుంటారు. నామమాత్రపు జీతం ఇస్తారు. స్థిరత్వం వుండదు. గ్యారంటీ వుండదు. జీవితానికి భద్రత వుండదు"

"నిజమేగానీ, గవర్నమెంటు జాబ్ మంచిదే! కాదనడం లేదు. ఈ లోపు ఏదొకటి ప్రైవేటు జాబ్ చేసుకుంటే బాగుంటుంది కదా నానీ! ఊరికే ఖాళీగా కూర్చోకుండా వున్నట్టు వుంటుందీ. ఎంతో కొంత జీతం చేతికి వస్తుంది"

"ఇది పోటీయుగం అమ్మా.. దేశంలో నిరుద్యోగులు కుప్పతెప్పలుగా ఉన్నారు. ఒక ఉజ్జోగం ఖాళీ పడితే ఆ ఒక్క దానికి వందమందికి పైగా పోటీ పడుతున్నారు. ఇలాంటప్పుడు ప్రైవేటు జాబ్ చేసుకుంటూ గవర్నమెంటు జాబ్ సాధించడం అనేది కల్ల. టైం ఏం వుండిద్ది? పూర్తి ఎఫర్ట్ పెట్టలేం!"

"సరే నాన్నా! నువ్వు ఎంత తొందరగా జాబ్ తెచ్చుకుంటే అంత మంచిది. కుటుంబ పరిస్థితులు అంత తొందరగా చక్కబడతాయి" అంది సరస్వతి.

ఆమె కొడుకుని అన్ని రకాలుగా ప్రోత్సహించింది. శేఖర్ పోటీ పరీక్షలు అన్నీ పోటీపడి రాయడం మొదలుపెట్టాడు. ప్రైవేట్ జాబ్ మానుకున్న దగ్గర్నుంచి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాడు. కొత్త ప్రభుత్వం వచ్చింది. గ్రామ సచివాలయాల్లో పెద్ద స్థాయిలో ఉద్యోగ ప్రకటన ఇచ్చింది. ఒకేసారి దాదాపు లక్షన్నర ఉద్యోగాలు. రెండేళ్ల తరువాత రెగ్యులర్ చేస్తామని హామీ కూడా ఇచ్చింది.

ఇక ఏమాత్రం తాత్సారం చేయలేదు శేఖర్. ఈ ఉద్యోగాన్ని కచ్చితంగా సాధించాలనుకున్నాడు. ప్రకటన పడిన నిమిషం నుంచీ అదే ధ్యాస, అదే తపన! నిద్రాహారాలు మరచి నిరంతరం చదవడం మొదలుపెట్టాడు. గత అనుభవాలతో ఒక్క మార్కులోనే తేడా రావొచ్చనే వుద్దేశంతో ముందు జాగ్రత్తగా కోచింగ్ సెంటర్లో చేరాడు.

అన్నం తిన్న తరువాత లేచాడు శేఖర్. ఆ రెండు రోజులూ నిద్ర కూడా మాని బాగా చదివాడు.

పరీక్ష రోజు. ఒక నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు కాబట్టి రెండు గంటలు నిద్రపోయి వేకువనే లేచాడు. స్నానం చేసి దేవుడికి దణ్ణం పెట్టుకొని తనకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి పెందలాడే వెళ్లాడు.

ప్రశ్నాపత్రం కొంచెం కఠినంగానే ఉంది. తికమకపడేలా కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. అది మంచిదే! తెలివి కలిగినవాళ్లూ, కష్టపడి చదివిన వాళ్లూ బాగా రాయగలరు. తను బాగా రాశాడు.

ప్రభుత్వం 'కీ' విడుదల చేసింది. శేఖర్ ఆనందానికి అంతే లేదు. 80 మార్కులు వస్తాయి. కచ్చితంగా తనకి జాబ్ వచ్చినట్లే!

ఊళ్లో 60 మంది పరీక్ష రాశారు. ఇంజినీరింగ్, ఎమ్మెస్సీ చదివిన వాళ్లు, వాళ్లలో చాలామంది వున్నారు. అందరూ తమకు 50కి మించి మార్కులు రావని చెప్పారు.

“మార్కుల సంగతి తర్వాత.. అసలు ఏం క్వాలిఫై అయిందాకా నమ్మకం లేదు” అని కొంతమంది చెప్పారు. బాగా మెరిట్‌గా చదివే నలుగురు మాత్రం తమకి 70 మార్కులు వస్తాయని చెప్పారు.

శేఖర్‌తో పాటు వాళ్ల ఇంట్లోనూ ఆనందం వెల్లివిరిసింది. సరస్వతి అప్పటికప్పుడే చిల్లర కొట్టుకి వెళ్లి పంచదార, పాల ప్యాకెట్టు తీసుకువచ్చి స్వీట్ చేసి పెట్టింది. అమ్మా, చెల్లీ, ఇక తమ కష్టాలు తీరినట్టే అని భావించారు.



జవాబు పత్రాల వాల్యుయేషన్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, వీలైనంత తొందరగా ఫలితాలు ప్రకటిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ఫలితాలు ఆలస్యమయ్యే కొద్దీ అవకతవకలూ, అవినీతీ జరిగి సమర్థులు అవకాశం కోల్పోయి అనర్హులూ, పైరవీదారులూ, నిజాయితీ హీనులూ అవకాశం పొందే వీలుందనీ, ఎంత తొందరగా ఫలితాలు ప్రకటిస్తే అంత మంచిదనీ శేఖర్ భావించాడు. ప్రభుత్వ నిర్ణయానికి సంతోషించాడు. ఫలితాలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూడడం మొదలుపెట్టాడు.

ప్రభుత్వం చాలా వేగంగా అన్ని ప్రక్రియల్నీ పూర్తిచేసి ఫలితాలు ప్రకటించింది. శేఖర్ అనుకున్నట్టే 80 మార్కులు వచ్చాయి. ఉద్యోగం వస్తుందనుకున్నాడు. రెండు రోజులు కాలం గడిచింది. కటాఫ్ 75 అనీ, 76 అనీ పరీక్షలు రాసిన నిరుద్యోగులు రకరకాలుగా లెక్కలు వేసి అంచనాలు వేస్తున్నారు. చివరికి కటాఫ్ 81 అయింది. పేపర్ లీకైంది. ఇంటి దొంగలు! వాళ్లు దొంగిలించి రాయడమే కాకుండా ఊళ్లో ఉన్న బంధువులు అందరికీ స్వీట్లు పంచినట్లు పేపర్ పంచారు. వాళ్లే ఉద్యోగాలు ఎగరేసుకుపోయారు. వాళ్లు తనకంటే కాదు. రాష్ట్రంలో అందరి కంటే ముందున్నారు.

ఆ దొంగల వలనే ఒక్క మార్కులోనే తనకి ఉద్యోగం హుళక్కి అయిపోయింది. ఒక ఇతర ప్రతిభావంతులు ఎంతమందికి అన్యాయం జరిగిందో! ఎంసెట్, ఆసెట్, ఈసెట్, లాసెట్, ఎడ్సెట్, అయినా లీకుల భాగోతమే!

కొద్దిమందితో పని ముగిస్తే గుట్టుగుట్టుగానే గుటుక్కుమంటుంది. దొంగలు దొరలైపోతారు. ప్రభుత్వానికి తెల్సినా పరువు పోతుందనీ, తేనెతుట్టెని కదపడం ఎందుకనీ కదలాడకుండా ఉంటుంది.

అది పరిది మించిపోయి నడివీధిలో పేపర్ల అమ్మకం జరిగి, గొడవలై అసంతృప్తి జ్వాలలు రగిలినప్పుడు అప్పుడు ప్రభుత్వం కదులుతుంది. ఎంక్వయిరీ అంటుంది. న్యాయ విచారణ అంటుంది. తూతూ మంత్రంగా కంటి తుడుపుగా చర్యలు ఏవో తీసుకుంటుంది. ఈలోపు ఎంత మంది అభాగ్యులు ఆక్రందనలూ, ఆర్తనాదాలు చేయాలో!

తను ఎంపిక కాకపోవడంతో బాగా కలత చెందాడు శేఖర్. కళ్లంట నీళ్లు. మనసంతా బాధ! గుండెని పిండేసిన వేదన! ఎవరికీ చెప్పుకోలేని రోదన !

వ్యవస్థ దోషాలకి వ్యక్తులు బలికావడం సహజం! రోగగ్రస్త సమాజ దోషాలకి అవి తమ వ్యక్తిగత అసమర్థతగాను, దురదృష్టంగాను, చేతగానితనంగాను భావించి కలత చెందేవాళు వుంటారు. అదే జరిగింది శేఖర్ విషయంలో. బాగా బాధ పడ్డాడు.

తను ఎంత అసమర్థుడు! ఇక జన్మలో తనకి ఉద్యోగం రాదని నిర్ణయించుకున్నాడు. కన్నతల్లికి భారమే తప్ప తన వల్ల ఏమీ ప్రయోజనం లేదు. చిన్నప్పటి నుంచీ అమ్మకి కష్టాలే! తను ఎన్ని కలలు కన్నాడో! మంచి ఉద్యోగం చేయాలనీ, మంచి స్థాయికి చేరుకోవాలని, అమ్మని సుఖపెట్టాలనీ, చెల్లికి మంచి మనువు చూసి పెళ్లిచేసి, తరువాత తను చేసుకోవాలని... ఎన్ని కలలు!

తన కలలు కల్లలైపోయాయి! తన ఆశల సౌధాలు కూలిపోయాయి! తను బతికి ఏం ఉపయోగం? ఎవరికి లాభం?

అమ్మా, చెల్లీ సంపాదిస్తుంటే కూర్చుని ఇంత కాలమూ తిన్నాడు! ఇక వాళ్ల కష్టమ్మీద, శ్రమమీదా బతకడం అంటే రోత బతుకే అది! చచ్చిపోదామని గట్టిగా నిర్ణయించుకున్నాడు. రెండు రోజులుగా ఇదే ఆలోచన.

# పురస్కారాలు

## సాహిత్య ప్రస్థానం ఫిబ్రవరి 2021 పురస్కారాలు

**పాదాలు**
కవితకు **రూ.500**
కవి : మోకా రత్నరాజు

**దు:ఖాన్ని పోతపోసిన దండ కడియం**
సాహిత్య విమర్శకు **రూ.500**
వ్యాసకర్త : బోల యాదయ్య

■■■

*కవితకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*
*సాహిత్య విమర్శకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*
**- ఎడిటర్**

"సుజాతా వాళ్ల ఇంటిదాకా వెళ్లస్తా నానీ! ఆమెను ఆస్పత్రి నుంచి తీసుకొచ్చారట! వెళ్లి పలకరించి వస్తాను. నేను రావడం ఆలస్యమైతే అన్నం పెట్టుకొని తిను!" కొడుక్కి చెప్పి బయటికి వచ్చింది సరస్వతి.

అమ్మ ఇక ఇప్పుడే రాదు. వాళ్ల ఇల్లు దూరం. ఇదే సమయం. అమ్మ వచ్చేలోగా పని పూర్తి చేసుకొని, తను చచ్చిపోవాలి.

లేచి తలుపువేశాడు. లోపల గడిపెట్టుకున్నాడు. చీర తీసుకొని సీలింగ్ ఫ్యాన్‌కి ముడి వేయడానికి ప్రయత్నించాడు. ముడి వేయడం సరిగ్గా రాలేదు. చివరికి అతి కష్టమ్మీద ఎలాగో ముడి వేశాడు.

దొడ్లో స్టూల్ ఉంటే తెచ్చుకున్నాడు. మెడకి చుట్టుకోవడానికి చీరకి మరోవైపు ఉచ్చు బిగించాడు.

"కాంతమ్మ కుట్టమని జాకెట్టు గుడ్డ ఇచ్చింది. తను కుట్టి కూడా రెండు రోజులైంది. ఎలాగూ అటే వెళ్లేది. దారిలోనే వాళ్ల ఇల్లు. కుట్టిన జాకెట్లు ఇచ్చి డబ్బుతెచ్చుకుంటే సరిపోతుంది" కొంచెం దూరం వెళ్లిన తరువాత ఆ జాకెట్ల విషయం గుర్తొచ్చింది సరస్వతికి. వెనక్కి తిరిగి ఇంటికి వచ్చింది.

దారిలో పక్కింటావిడతో ఒక నిమిషం నిలబడి మాట్లాడింది.

తలుపు వేసి ఉంది.

'ఈ సమయంలో తలుపు వేసుకొని లోపల ఏం చేస్తున్నట్లూ? అనుకొని

"నానీ.. తలుపు తీయి నాన్నా!" అని తలుపు తట్టి పిలిచింది.

ఓటి తలుపులు అవి. ఆకారానికి అవి తలుపులు. ఏం చేస్తున్నాడు అనుకుంటూ తలుపు సందులోంచి లోపలికి చూసింది. లోపల, కొడుకు చేస్తున్న ప్రయత్నానికి నివ్వెరపోయింది.

"నానీ... తలుపు తియ్యి. తలుపు తియ్యరా! ఏం చేస్తున్నావు నువ్వూ!" అంటూ పెద్దగా కేకపెట్టింది.

అప్పుడే స్టూలు మీద నిలబడి గొంతుకి చీర బిగించుకో బోతున్నాడు నాని.

"నానీ... ఆగు.. ఆగు.. ఓరయ్యో.. నాయనో.. నా బిడ్డ అన్యాయమైపోతున్నాడో దేవుడో" అంటూ పెద్దపెద్దగా కేకలు పెట్టింది. సరస్వతి కేకలకి జనం చేరారు.

ఎదురింటి కుర్రాడు వాకిట్లోనే వున్న గడ్డ పలుగు తెచ్చి ఒక్క దెబ్బకి తలుపు గడియ ఊడగొట్టాడు. అప్పుడే శేఖర్ స్టూలు మీద నిలబడి మెడకి చీర ఉచ్చు బిగించుకున్నాడు.

ఇద్దరు వ్యక్తులు ఉరికి వేలాడకుండా శేఖర్‌ని ఎత్తి పట్టుకున్నారు. ఒకరు మెడకి బిగించుకున్న ఉచ్చుని తీసేశారు.

"ఎంత పని చేశావు నానీ! నేను మళ్లీ వెనక్కి రాకపోయినట్ల యితే ఎంత పని జరిగి వుండేది? పాతికేళ్లు నిన్ను కష్టపడి పెంచుకుంది ఇందుకేనా?" అని సరస్వతి కంటికి మింటికి ఏకధారగా విలపించడం మొదలుపెట్టింది.

"ఏం పని నానీ? ఏం ఉజ్జోగం రాకపోతే ఏమైంది? బతకలేవా? దేశంలోఅందరూ వుజ్జోగాలు చేసేనా బతకడం? మీ అమ్మ రావడం ఒక నిముషం ఆలస్యమైతే ఎంత పని జరిగి ఉండేది?" అని వచ్చిన జనం శేఖర్‌ని మందలించారు.

శేఖర్ వంచిన తల ఎత్తలేదు. కళ్లంట నీళ్లు కారుతుండగా మౌనంగా కూర్చున్నాడు. ■

## కవిత

# ఎదుగుతున్న కూతురు


హిందీ మూలం :
**డా. కర్దం**
అనువాదం :
**డా. పేరిశెట్టి శ్రీనివాసరావు**




**ము**నుపటిలా ఉండటం లేదు
నా కూతురు
ఎదుగుతున్నదిప్పుడు
రుచులు, అభిరుచులు, అలవాట్లు, వస్త్రధారణ
అన్నీ మారిపోతున్నాయి
ఆటబొమ్మలు కావాలని అడగటం లేదిప్పుడు
మారాం చేయడం లేదిప్పుడు చందమామకై
బొమ్మలాటలు కూడా విడచి పెట్టిందిప్పుడు
'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్'
పాడే నా కూతురు
ఇప్పుడు మరోలా 'కూనిరాగాలు' తీస్తున్నది
మునుపటిలా చిర్రుబుర్రులాడటం లేదు
నాతో ఆఫీసుకొస్తానని మారాం కూడా చేయడం లేదు
ఎగిరే పక్షులను పట్టుకుని
బంధించాలనే బాల్యపు ఆసక్తి కూడా లేదిప్పుడు
బుడి బుడి అడుగులు వేస్తూ పడుతూ లేస్తూ
టీచర్‌ని చీటరని, టెంపుల్‌ను మెంటలని
పిలిచే నా కూతురు ఎదుగుతున్నదిప్పుడు

ఫ్రాకుల స్థానే జీన్స్ టాప్స్ వేసుకుంటుంది
నిన్నటివరకు అడ్డదిడ్డంగా పిచ్చి గీతలు గీస్తూ
ఇంటి గోడలన్నీ రంగు లేసేది
నన్ను గుర్రంలా మార్చి వీపుపై స్వారీ చేస్తుండేది
అప్పుడప్పుడూ సింగంలా భయపెడుతుండేది
బుడి బుడి అడుగులతో పిల్లిలా వచ్చి
కోమలమైన చేతులను నా కళ్ళకు గంతలుగా గట్టి
'ఎవర్ని నేను?' అని ప్రశ్నించేది
పుస్తకాలను, కాగితాలను చెల్లాచెదురు చేస్తుండేది
'మీ పెళ్లి ఆల్బమ్‌లో నేనెందుకు లేన'ని ప్రశ్నించేది
ఇలాంటివెన్నో పిచ్చి పిచ్చి ప్రశ్నలు లేవిప్పుడు
బాల్యంలో చాటర్ బాక్స్
ఇప్పుడు అతి తక్కువగా మాట్లాడుతుంది
తలుపులు మూసుకొని తన గదిలో
పుస్తకాలతోనే తన సమయమంతా!
మధ్య మధ్యలో కంప్యూటర్‌తో ఆట
తన స్నేహితులతో మాట
అప్పుడప్పుడూ శారీరక సౌందర్యంపై ధ్యాస
ఇంట్లో వస్తువులన్నిటిని
చిందర వందర చేసే నా కూతురుకి
అలా నచ్చడం లేదిప్పుడు
ప్రతి వస్తువుని పద్ధతిగా పెట్టాలని ఉపదేశిస్తుంది
తన ప్రతి పసందుని నాపై రుద్దాలనుకుంటుంది
ఎప్పుడు, ఎలాంటి డ్రెస్సు వేసుకోవాలో తనే చెబుతుంది
చిటికెన వేలు పట్టుకుని నడవడం నేర్చుకున్న
నా కూతురుకిప్పుడు తనతో
నేను నడవడం ఇష్టంగా అనిపించడం లేదు
ఎక్కడికైనా ఒంటరిగానో
లేక తన స్నేహితులతోనో వెళ్ళడానికిష్టపడుతుంది!

ఇది నిజం, నా కూతురు ఎదుగున్నదిప్పుడు
స్కూలు యానివర్సరీకి చీర కట్టుకుని వెళితే
సంపూర్ణ 'స్త్రీ' లాగుంది
నెమ్మది నెమ్మదిగా తను స్త్రీగా మారిపోతున్నది
మారుతున్న ఈ రూపంలో
నా కూతురు కనిపించడం లేదిప్పుడు
రేపో మాపో ఎవరికో భార్య అవుతుంది
తర్వాత తల్లవుతుంది
నా కూతురు నానుంచి దూరమవుతుంది! ■

కవిత

# మా ఊరికి టవరొచ్చింది!

- డాక్టర్ మాటూరి శ్రీనివాస్

98490 00037



**మా** ఊరికి టవరొచ్చేసింది
ఊరు ఊరుని తీగలతో కలిపేసి
మెదలు నులిపేసి రాకపోకల్ని
సిగ్నల్  గోడలు కట్టి బంధించేసింది
పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం సంధించేసింది
బారుగా నిటారుగా గ్రామాల్ని దోచేసి
కార్పొరేట్ మేకులతో
పల్లె బతుకుల వలువలూడదీసి శిలువలేసేసింది

మా ఊరికి టవరొచ్చేసింది!

రింగుటోను ఖంగులతో
ప్రశాంతత గుండె గుభేల్మంది
భూకామందు తన బంధువంది
డోజర్లు డంపర్లు కింద పడ్డ విత్తనం
వాడి పెత్తనాన్ని భరించలేక
మట్టి రేణువుకి ఉరి బిగించుకుని
ఊరితో సంబంధాన్ని తెంచేసుకుంది
వట్టి పోయిన పేగు పొట్టచేత్తో రోడ్డెక్కి
కానరాని తీరానికి అంతులేని దుఃఖంతో
కాలిబాట పట్టేసింది!


మా ఊరికి టవరొచ్చేసింది!
మనిషి మనిషినీ మనీ లాండరింగ్‌లో
పావుగా మార్చి అవినీతిలో కూర్చేసింది
పరాయికరణ పచ్చజెండా ప్రతి గుండెలో
ముళ్ల తోట మొలిపించేసింది
కళ్లాలు తెగిన రేసుగుర్రం
జియో అంటూ చావు డప్పు
గూడాల గుండెల్లో బల్లెంలా దూసుకొచ్చేసింది

మా ఊరికి టవరొచ్చేసింది!
టక్కు టమారీలకు అడ్డగోలుగా
అర్ధరాత్రి పవరొచ్చేసింది
పది వచ్చి ఏడును మింగేసింది
సంచారనిగం లాండు లైను బిక్కచచ్చి
కుక్క చావు చచ్చేసింది
చదువులకి బాండ్ బాజా వాయించి
నిరక్షరాస్యుల డౌన్లోడును పెంచేసింది
నాలుగు రోడ్ల జంక్షన్లలోకి టాపప్ల పోటీ
బలాదూరుగా ఆటల్ని అప్లోడ్ చేసేసింది!

పనికీ పాటకీ శఠగోపం పెట్టేసి
పల్లె వాకిట్లో ముగ్గును ప్రైవేటు
రంగవల్లులతో పటాపంచలు చేసేసింది

మా ఊరికి టవరొచ్చేసింది!

■




# కథాదీప్తి కథల గూర్చి, గురించి ...

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

**తె**లుగు కథాసాహిత్య విమర్శలో పాలపిట్టలాంటి సృజనశీలి గుడిపాటి. అటు జర్నలిస్టుగానూ, ఇటు సాహిత్య పత్రిక సంపాదకుడిగానూ ఎందరో కవులు, రచయితలకు ఊతమిచ్చిన సహృదయుడు. అదే సమయంలో విమర్శకుడిగానూ వారికి తనదైన బాణీలో దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన రాసిన వ్యాసాలతో గతంలో 'ఇతివృత్తం', 'సంవిధానం' సంపుటాలు ప్రకటించారు. ముఖ్యంగా కథాసాహిత్యపు ఆనుపానులను సాహిత్య లోకానికి అందించేందుకు అవిరళ కఅషి చేస్తున్నారు. 2019 సంవత్సరాంతంలో "కథాదీప్తి" పేరిట పుస్తకం వెలువరించారు. ఇందులో ప్రధానంగా తాను కొన్ని కథాసంపుటాలకు రాసిన 'ముందుమాట'ల వ్యాసాలను గుదిగుచ్చారు. ఆయా రచయితల కథలను సాకల్యంగా విశ్లేషించటం ద్వారా ఎన్నో విశేషాంశాలను తెలియజెప్పారు. అవన్నీ కథల రూపలావణ్యాల గురించే. కేవలం ముందుమాటల సమాహారంగానే ఈ పుస్తకం వెలువరించి ఉంటే, దీని గురించి పెద్దగా చెప్పుకోవాల్సిన అవసరం ఉండేది కాదు.

అసలు, కథ ఎలా మొదలైంది? దాని పూర్వాపరాలేమిటి? అది ఎలా ఎదిగి ఎల మీద నిలబడింది? తనకు తాను ఘనమైన సాహిత్య ప్రక్రియగా ఎలా చాటుకోగలిగింది?

భాష, శైలి, శిల్పం, క్లుప్తత, జీవన దృక్పథాలు... ఇవన్నీ కథలో ఎలా అంతర్భాగం కావాలి?

ఇట్లా అనేక అంశాలపై మరికొన్ని వ్యాసాలు రాసి, ముందువెనకల చేర్చటం ద్వారా ఈ పుస్తకం విలువ పెరిగింది. తద్వారా రచయితలకు ఎన్నో మెలకువలు ఎరుక పర్చటంతో పాటు పాఠకుడు కథను ఎలా అర్థం చేసుకోవాలో, ఏ దృష్టికోణం నుంచి ఎలా పరిశీలించాలో కూడా వివరించారు.

♦ ♦ ♦

'అంతిమంగా జీవితం పట్ల ఒక దృక్పథాన్ని ఇవ్వడానికి కథాసాహిత్యం దోహదం చేయా'లంటారు గుడిపాటి. 1980ల దాకా నవల ఒక వెలుగు వెలిగింది. ఆ దశాబ్దపు చివరి నుంచి కథ పుంజుకుంది. కథల ప్రచురణకు ప్రాధాన్యం ఏర్పడింది. కథాసంపుటాలు, సంకలనాలు పాఠకులకు చేరువయ్యాయి. కథారచనలో ప్రయోగాలు మొదలయ్యాయి.

అయితే, విస్తృతంగా ప్రచురితమవుతున్న కథల్లో మేలిమి ఎంత? పాఠకుల్ని ప్రభావితం చేస్తున్న కథలెన్ని? వంటి ప్రశ్నలు సంధించి, వాటికి మూలాలను విశ్లేషించారు. 'మనుషుల మధ్య సంబంధాలు సరళంగా ఉండవని, వైరుధ్యాలు సహజమనే ఎరుక రచయితల్లో కొరవడిం'దని వ్యాఖ్యానించారు. "వాదాలు, సిద్ధాంతాలు సమాజాన్ని, సమస్యల్ని అవగాహన చేసుకోడానికి ఉపకరిస్తాయే తప్ప వాటంతటవే సృజనాత్మక రూపంలోకి అనువాదం కాజాలవనే గ్రహింపు ఉండాలి. వస్తుశిల్పాల సమన్వయం పాటిస్తూ, సమాజంలో ఉండే వైరుధ్యాల్ని చిత్రించినప్పుడే కథకు సమగ్రత చేకూరుతుంది" అని విలువైన

సూత్రీకరణతో ఆకట్టుకున్నారు. కథకు క్లుప్తత ఎంత ప్రధానమో వివరిస్తూ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'సాహిత్య సంచారం'లో ప్రస్తావించిన గొప్ప వాక్యాలను సందర్భానుసారంగా ఉటంకించారు. చాసో 'ఎందుకు పారేస్తాను నాన్నా?', కేతు విశ్వనాథరెడ్డి 'రెక్కలు' వంటి కథలను ఉదహరించారు. ఓ హెన్రీ, మొపాసా, చెకోవ్ వంటి రచయితల కథల్లోనూ కుదురైన క్లుప్తత ఉంటుందని చెప్పారు. 'కథ ఖండకావ్యంలా ఉండాలని' బుచ్చిబాబు చెప్పడంలోనూ ఇదే ఉద్దేశమంటారు.

కథారచనలో ఆత్మవిశ్వాసం అవసరమా? చాలా అవసరమని వ్యాసకర్త గద్దించి మరీ చెబుతారు. రచయిత తనకు తానే తీర్పరిగా ఉండాలి. తాను రాసిన కథను సగటు పాఠకుడి మనసుతో చదవాలి. ఒకటికి నాలుగుసార్లు విమర్శనాత్మక దృక్పథంతో సరి చూసుకోవాలి. కొద్దిరోజులు గుట్టుగా దాచేసుకుని, మళ్లీ చదువుకుంటూ అవసరమైన మార్పుచేర్పులు చేసుకోవాలి. అది సంపూర్ణంగా నచ్చాకే పత్రికకు పంపాలని హితబోధ చేశారు.

పత్రికల్ని బట్టి, ఎడిటర్ల అభిరుచుల్ని బట్టి కథలు రాయటం ఆత్మవిశ్వాస రాహిత్యమేనంటారు. విస్తృత సాహిత్యాధ్యయనం, ఇతివృత్తాల ఎన్నిక, శైలీశిల్పాల పరిణతి, సొంత గొంతు నిర్మాణం, సామాజిక పరిణామాల నిశిత పరిశీలన ఎంత ఆవశ్యకమో వివరించారు. డాక్టర్ వి.చంద్రశేఖర్‌రావు, కాశీభట్ల వేణుగోపాల్, కాట్రగడ్డ దయానంద్, ఓల్గా, స్మైబాబా తదితరులు వైవిధ్యం కోసం ఎంతగా పరితపించారో తెలిపారు. ఇన్నిటికీ ముందు భాషకుండే ప్రాధాన్యం ఏమిటో విశ్లేషించారు.

కథారచనలో సొంతముద్ర సాధించాలంటే ఎలాంటి సాధన చెయ్యాలి? ఎత్తుగడ, నడక, భాష, వాతావరణ చిత్రణ, శైలి, శిల్పం... ఇలా అనేక అంశాలపై పట్టు సాధించాలి. చలం, కొడవటిగంటి, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, వాకాటి పాండురంగారావు, ముళ్లపూడి, కె.ఎన్.వై.పతంజలి, రంగ నాయకమ్మ, ఆర్.వసుంధరాదేవిల కథలు చదవగానే వారి శైలి ఏమిటో తెలిసిపోతుంది. కొద్ది కథలు మాత్రమే రాసిన త్రిపుర, వడ్డెర చండీదాస్, స్మైల్‌లు పాఠకులకు గుర్తుండి పోయారు. ఇంకా కల్యాణ సుందరీ జగన్నాథ్, జలంధర, కొలకలూరి ఇనాక్, నాగప్పగారి సుందర్రాజు వంటి రచయితలు విభిన్న ఇతివృత్తాల కారణంగా పాఠకుల మనసుల్లో తిష్ఠ వేశారు. ఈ రచయితలందరినీ అధ్యయనం చెయ్యాల్సిన అవసరాన్ని గుడిపాటి నొక్కి చెప్పారు.

వెంటాడే కథలు ఎన్నో ఆరా తీశారు. కులమతాల ప్రస్తావనలో సున్నితత్వాన్ని పరామర్శించారు. 1990 తర్వాత కథారచనలో ప్రాంతీయ స్పృహ కూడా పెరిగింది. ఆ క్రమంలో ఒక ప్రాంతానికి సంబంధించిన కథల్ని సంకలనాలుగా ప్రచురించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. కళింగ కథానికలు (చాసో), సీమ కథ (కేతు విశ్వనాథరెడ్డి), కరీంనగర్ జిల్లా కథలు, కర్నూలు కథ (ఎం.హరికిషన్), కడప కథ, గోదావరి జిల్లా కథలు, నల్లగొండ కథలు, కథా పార్వతీపురం, కథాపురి (చీరాల ప్రాంతం) వంటి సంకలనాల నేపథ్యాన్ని, కథా సాహిత్యానికి అవి అందించిన మేలిమి భాగస్వామ్యాన్నీ ఆసక్తికరంగా వివరించారు గుడిపాటి. 'ఏది మంచి కథ?' అవుతుందో ఓ వ్యాసంలో చర్చించారు. కొన్ని కథల పేర్లు ప్రస్తావించి, వాటిని భిన్న పార్శ్వాల్లో విశదీకరించారు. మొత్తం మీద "పఠిత ఆలోచనా ప్రపంచంలో అలజడికీ, సంఘర్షణకీ, అంతిమంగా మానవీయ విలువల దిశగా పాఠకుని మానసిక ప్రపంచం మొగ్గు చూపేలా ఉండేదే మంచి కథ" అని మంచి నిర్వచనమిచ్చారు.

కథలో 'కాలం' ఎలా ఒదిగి ఉండాలో, మౌఖిక కథకూ లిఖిత కథకూ తేడాలేమిటో రెండు వ్యాసాల్లో వివరించారు. నాస్టాల్జియా ఇతివృత్తంగా పెద్ద ఎత్తునే కథాసాహిత్యం వెలువడింది. 'వర్తమానంలో మానవీయ విలువలు పతనమవుతున్నప్పుడు గతాన్ని తలపోయడం అలవాటు. ఒకనాటి రోజుల మంచితనాన్ని, మనుషుల్లోని సుగుణాల్ని తలచుకుంటూ' రాసిన కథల్లో పాఠకులు తమను తాము చూసుకున్నారు. నామిని సుబ్రహ్మణ్యం నాయుడు 'పచ్చనాకు సాక్షిగా' కథల ద్వారా ఈ ఒరవడి మొదలయిందని గుడిపాటి నిర్ధారించారు. 'మిట్టూరోడి కథలు', 'సినబ్బ కథలు' కూడా అదే కోవలోనివి.

కొత్త శతాబ్దితోపాటు కొత్త సమస్యలూ జీవితాల్ని చుట్టుముట్టాయి. ముఖ్యంగా గ్లోబలైజేషన్ దేశం తలుపులు తెరుచుకుని, నగరాల్ని చుట్టుముట్టి, పల్లెల్లోకీ ప్రవేశించింది. మనిషి తనను తాను కోల్పోతున్న సందర్భంలో చాలామంది రచయితలు గతం తాలూకు విలువల్ని కథావస్తువులుగా స్వీకరించారు. ఖదీర్ బాబు 'దర్గామిట్ట కథలు', బత్తుల ప్రసాద్ 'సగిలేటి కథలు', జింబో 'వేములవాడ కథలు', గోపిని 'దీపం చెప్పిన కథలు', పెద్దింటి 'మా వూరి భాగోతం', డాక్టర్ నక్కా

విజయ రామరాజు 'భట్టిప్రోలు కథలు', ఎలికట్టె శంకరరావు 'పరిగెసేను' కథలు నాస్టాల్జియా వృక్షపు కొమ్మలే. "తమ జ్ఞాపకాల్ని కథలుగా రాసిన రచయితల్లో ఎక్కువమంది ఇతరేతర కథలు రాయలేదు. నామిని సైతం నాస్టాల్జియా కథలకే పరిమితమయ్యారు. సంక్లిష్టమైన మానవ సంబంధాల మీద కథలు రాసిన వారు అరుదు" అని గుడిపాటి విలువైన వ్యాఖ్యానం చేశారు. నాస్టాల్జియా సంకెళ్లు తెంచుకుని, వర్తమాన మానవజీవన సంక్షోభానికి అక్షరరూపమివ్వాలని ఆకాంక్షించారు. 'ముందుమాట'ల్లోనూ సాహిత్య చర్చ దాదాపు యాభై మంది కథకులు ఒకే పట్టణం నుంచి రావటం నిజంగా విశేషమే. ఆ విశేషంతో వినుతికెక్కిన స్థలం పార్వతీపురం. ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ 1903లో రాసిన కథ "లలిత" మొదలు వర్ధమాన రచయిత్రి బెలగాం గాయత్రి రాసిన కథ వరకూ సంకలనం చేసి, ప్రచురించిన "కథా పార్వతీ పురం"కు గుడిపాటి రాసిన ముందుమాటలో అరుదైన విషయాలను ప్రస్తావించారు. వడలి రాధాకృష్ణ కథల్లో జీవన వైవిధ్యం, సి.ఎస్.రాంబాబు కథల్లో సంయమన దృష్టి, ఎల్.ఆర్.స్వామి కథల్లో ఆకర్షించే కథన కౌశలం, మల్లిపురం జగదీష్ కథల్లో కఠోర వాస్తవాల చిత్రణ, అర్నాద్ కథల్లో సౌందర్య పరిమళం, విద్వాన్ చొప్ప వీరభద్రప్ప కథల్లో నైతిక సంస్కారం, దోరవేటి కథల్లో ఉపాధ్యాయ జీవన సౌరభం, బుర్రా లక్ష్మీనారాయణ కథల్లో మానవోద్వేగాల ప్రతిఫలనం, గన్నవరపు నరసింహమూర్తి కథల్లో ఏజెన్సీ జీవనం, అమ్జద్ కథల్లో పాత్రచిత్రణ నైపుణ్యం.. వెరసి ఆయా రచయితల కథలు సామాజిక సంక్షోభాలకు ఎలా దర్పణం పట్టాయో అద్భుతంగా విశ్లేషించారు.

**హాస్యమూ కల్లోలమూ ప్రయోగమూ...**

కథలో మిళితమై ఉండే హాస్యం పాఠకుణ్ని ఉత్తేజపరుస్తుంది. మనసును రంజింపజేస్తుంది. కానీ, హాస్యాన్ని లేదా అధిక్షేపాన్ని భావస్ఫోరకంగా వ్యక్తీకరించే సన్నివేశాలు ఇవాళ్టి కథల్లో తక్కువగా కనిపిస్తున్నాయి. చలం కథల్లో హాస్యం అంతర్భాగమై ఉంటుంది. భమిడిపాటి కామేశ్వరరావు, మునిమాణిక్యం, మొక్కపాటి నరసింహశాస్త్రి, చిలకమర్తి వంటి ఉద్దండులు హాస్యానికీ అధిక్షేపానికీ పట్టం కట్టారు. అయితే, హాస్యానికీ అధిక్షేపానికీ తేడా గమనించాల్సిన అవసరం ఉంది. భానుమతి రాసిన అత్తగారి కథల్లో మనోరంజకమైన హాస్యముంటే– కె.ఎన్.వై.పతంజలి కథల్లో పదునైన వ్యంగ్యం ఉంటుందని గుడిపాటి విశ్లేషించారు.

"కథల్లో శ్రీశ్రీ ప్రయోగాలు" మరో మంచి వ్యాసం. 'సాంప్రదాయక కథలకు అలవాటు పడ్డవారిని దిగ్భ్రమకు గురి చేస్తాయనీ, సకల ఛట్రాల్ని ధిక్కరిస్తూ తనదైన పద్ధతిలో శ్రీశ్రీ రాసుకుంటూ పోయా'రని వ్యాసకర్త కితాబునిచ్చారు. కవిత్వంలో చెప్పలేని అంశాలను మాత్రమే శ్రీశ్రీ కథలుగా రాశారని, ఆయన శీర్షికలు కూడా విభిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో కథ తీరుతెన్నులను విడివిడి వ్యాసాల్లో సమర్థంగా సమీక్షించారు. తాజాగా జనజీవనాన్ని కలవరపరుస్తున్న కల్లోలం కథల్లోకి ఎలా తర్జుమా అవుతుందో చెప్పారు. ప్రయోగాత్మక శైలితో పాఠకులను మోహపరవశుల్ని చేసిన డాక్టర్ వి.చంద్రశేఖరరావును స్మరించుకుంటూ రాసిన వ్యాసం ఒక అక్షర నివాళి. "ఒక మోహపరవశం జయకాంతన్" అంటూ పుస్తకానికే హైలైట్ అనదగ్గ మరో వ్యాసం బోనస్. త్రిపుర కథల ప్రాశస్త్యపు వివరణ అదనపు ఆకర్షణ.

ఓ పువ్వు పూసింది (చలం), నన్ను గురించి కథ రాయవూ (బుచ్చిబాబు), చిట్టచివరి రేడియో నాటకం, హెచ్.నరసింహం ఆత్మహత్య (డా. వి.చంద్రశేఖర్‌రావు), చావు విందు (తుమ్మేటి రఘోత్తమరెడ్డి), పక్షులెగిరిపోయిన తోట (కాసుల ప్రతాపరెడ్డి), విసుర్రాయి (ముదిగంటి సుజాతారెడ్డి), చలివేంద్రం (జాతశ్రీ), ఊరబావి (ఇనాక్), మాయిముంత (పెద్దింటి అశోక్ కుమార్), లోయ (అజయ్ ప్రసాద్), మృణ్మయనాదం (ఓల్గా), విధ్వంసదృశ్యం (ఆడెపు లక్ష్మీపతి), చీకటి (అల్లం శేషగిరిరావు), బారతం బొమ్మలు (గోపిని కరుణాకర్), నిత్యగాయాల నది (బెజ్జారపు రవీందర్), వియద్గంగ (జలంధర), మధుర మీనాక్షి (ఆర్.ఎస్.సుదర్శనం)... ఇట్లా మరెన్నో తప్పక చదివి తీరాల్సిన కథలను తన పుస్తకం ద్వారా గుడిపాటి మనకు గుర్తు చేస్తారు.

దాదాపు వ్యాసాలన్నీ చిన్నవే. రెండు మూడు పేజీల్లోనే కథాప్రపంచాన్ని సమగ్ర స్పృహతో ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. వర్తమాన తెలుగు కథ మరింత తేజోవంతం కావటానికి గుడిపాటి అందించిన అద్భుతమైన కరదీపిక 'కథాదీప్తి'. తప్పక చదివి తీరాల్సిన పుస్తకం.

■

కవిత

# వేడెక్కుతున్న 'ఉక్కు'

- చింతా అప్పలనాయుడు
94417 13185

**అ**మ్మండి నాయనా
అమ్మ ఒంటిమీద మెరుస్తున్న సమస్త వస్తువుల్ని అమ్మండి
అమ్మను అనాధను చేసి ఆడుకొండి
అమ్మ ముక్కుమీద చుక్కలా మెరిసే ముక్కుపుల్ల
ఉక్కు కర్మాగారాన్ని అమ్ముకోండి
మెడలో మెరిసే హారాలెందుకు
చేతులకు బంగారు గాజులెందుకు
కాళ్ళకు వెండి కడియాలెందుకు
అమ్ముకొని ఆనందించండి!

జనం అలాగే గోల పెడుతుంటారు
ఎన్నికలు వచ్చేసరికి నమ్మి నట్టేట్లో పడతారు
అన్ని రోజులు గోవు పాలివ్వదని
పాలివ్వని గోవుకు పచ్చికెందుకని
సంతలో ఎంతోకొంతకు అమ్మండి
అమ్మినాక పాలచుక్కలు లేక
జాతి పాలిపోయిందని జావగారిపోనివ్వండి
జనం చేతుల్లో ఇప్పుడు ఏమీ లేదని మీకు తెలుసుకదండి
ఓట్లేసిన జనం ఒట్టి పోయిన గోవులే సుమండి
అమ్ముకోండి పండగ చేసుకోండి
సెలగలు తినేసి చేతులు కడుక్కోండి
అడవి తినేసి ఆకులు తుడిచేయండి!

ఆకలి తీరడానికి ఇప్పుడు ఉక్కు కనబడుతుంది
మెక్కడానికి మరేటి దొరకనంతంది
వెలుతురుని వంతులేసుకొని
సీకట్ని దోసిల్లతో కడుపునింపుకోండి
అసలు ఉక్కును అమ్ముకోవాలన్న ఊసు
మీ ఊహల్లోకి ఎలా పొడుచుకొచ్చింది?
తినవలసినవన్నీ తిన్నారు కదా
ఉక్కును ఎలా బుక్కుతారో చెప్పండి
ఉక్కే దిక్కని అనుకున్నవాళ్ళంతా మళ్లా ఒక్కటౌతున్నారు
నిన్నటి గాయాలను ఒంటిమీద తడుముకొని తర్లి వస్తున్నారు

తరాల ఆకలిని తరిమికొట్టడానికి
గాల్లో కలిసిపోయిన ప్రాణవాయువుల్ని
బతుకు దారం కండితో కలిపి ముడేసుకోడానికి
ఉక్కు సంకల్పంతో ఊగిపోతున్నారు
తూరుతున్న తూరుపుతో కలిసి నడవడానికి
కొత్త నెత్తురుతో నడుముకు నార కట్టుకొని
నగువెయ్యబోతున్నారు
ఇప్పటికే మరిగి మంచి ఉడుకు మీద
కాకెక్కి పోయింది ఉక్కు
పొద్దును మింగబోతున్న తిమింగళాలు
సముద్రంలో దాగున్నాయని ఒడ్డున ఒదిలేసి
రోడ్డు మీద పడుతున్నారు జనం
చెట్టుకు పిట్టల్ని దూరం చేయబోతే
ఆకుకొక కాకై అల్లరి చేయడానికి
అగ్గి మీద గుగ్గిలమౌతున్నారు
వేనవేల ఎకరాల్లో మహావృక్షమై ఆదుకొని  పాదుకొని
నీడనిచ్చి కడుపు నింపే కట్టడాలను అమ్మబోతుంటే
తాడోపేడో  చావోరేవో తేల్చుకోడానికి
పొద్దుతో కలిసి పోటెత్తబోతున్నారు
కంటికి నిద్దరేలని కదిలిపోతున్నారు

ఉక్కు ఫ్యాక్టరీ అంటే ఏటెనుకున్నావో ఏటో!
పోరాటాల పొయ్యిలో కాలి కాకతీరిన నక్కు
అదే కదా మాకున్న ఒకే ఒక హక్కు
పట్టుకుపోతావో ముట్టకోడానికి వస్తావో
అక్కడ మేకులు మొలిపించినప్పుడు
ఇక్కడ బాకులో తుపాకులో పేలవని ఎలా నమ్ముతాము?
తిన్నింటి వాసాలు లెక్కపెడుతున్నావు
తిన్నకూటిలో బుగ్గి పోస్తున్నావు
ఒడ్డుకు చేరిపోయి తెప్ప తగలేస్తున్నావు
ఎక్కడ పడితే అక్కడ వయ్యారిభామలా
తయారు పడతున్నావు?
సల్లబడినప్పుడల్లా నొల్లుకోడానికి సతాయిస్తున్నావు
మల్లా మల్లా నీకు మనివి చేసిందొకటే ....
వేడెక్కిన ఉక్కు
చల్లారిపోడానికి సచ్చినా ఒప్పుకోదు!

■

## మట్టిమోహరించిన చోటు



- దాకరపు బాబూరావు
98489 93599

జాగ్రత్త...!
ఆ దేహాలకు
దుక్కిదున్నిన చేలల్లో
పచ్చని పైరై నాటు కోవడమే కాదు
వేళ్లనే వేట కొడవళ్లుగా చేసి
పనికిరాని తాలు కంకుల్ని
మొదళ్ళకంటా తెగనరకడమూ తెలుసు
జాగ్రత్త...!
ఆ దేహాలకు
నాగేటి చాళ్ళల్లో విరగ పండిన పనల ముందు
వినమ్రంగా వంగి ధరణికి
ప్రణమిల్లడమే కాదు;
శత్రు నాశనానికి ఎక్కుపెట్టిన
ఆవేశపూరిత బాణాలై తెగింపుతో
దూసుకెళ్లడమూ తెలుసు, జాగ్రత్త...!
ఆ దేహాలకు
సాగు మంత్రోచ్చాటనతో
కఠిన బీడుభూముల్ని సైతం
పచ్చని సేద్య సంగీతాలుగా శృతి చేయడమే కాదు;
పూజించే మట్టి గడ్డనే డాలర్ వేలం పాట
పాడాలనుకుంటున్న
సాగు చట్టాల వాణిజ్య పెత్తందార్లపై విప్లవ శంఖం
పూరించటమూ తెలుసు
జాగ్రత్త...!
ఆ దేహాలకు
చీడపీడలు సోకిన పంట పొలాల్లో కడగండ్ల
ఎరువు మందులు చల్లి సస్య రక్షణ చేయడమే కాదు
అన్నపూర్ణను అనాథను చేసి కాటేయాలని
పడగలెత్తుతున్న కార్పొరేట్ కంపెనీ వ్యాపార
విషనాగుల్ని మట్టు పెట్టటానికి
మట్టే మోహరించిన యుద్ధానికి
తెగించిన నినాదమై ఎలుగెత్తడమూ తెలుసు! ■

## నాసాకు శోష

*నాసా వాడికి శోషొచ్చింది*
*అసలు నిజం తెలిసొచ్చింది*
*మార్స్ అందుకున్నానని మురిసిపోయాడు*
*మన సంగతి మర్చిపోయాడు*
*జనులంతా లబో దిబోమనగా*
*నభో వీధి పైనున్న గ్యాసు ధరకి*
*మూర్ఛపోయాడు!*

*'అందాకా మరి ఎగరలేనంటూ'*
*కన్నీరు కార్చిపోయాడు*
*ఎగిరే రాకెట్ స్పీడు మించి*
*పెరిగే పెట్రోలు రేటు గాంచి*
*తొట్రు పడ్డాడు!*
*మన మార్కెట్‌కి సెల్యూట్ చేసి పోయాడు!*

- డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,
94408 36931 ■

# బతుకు పాట

- డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర
94901 88263



గది

నిశ్శబ్దంగా

'చీకటి'ని చప్పరిస్తుంటుంది
రాత్రంతా
ఆకలితో సంభాషిస్తూ
నేను కాసిన్ని
'కన్నీళ్ళు' తాగి పడుకుంటాను

ఉదయం
ఎవరి పనుల్లోకి వారు
విసిరి వేయబడతారు
'పొయ్యి'
మొండికేసి
మూలన కూర్చుంటుంది
నిప్పు
'కన్నీరు' తుడుచుకుంటూ
బయటకెళుతుంది
బియ్యం లేక
కుండ
ఎండ కాసుకుంటూ
ఆరుబయట ఆవలిస్తుంటుంది

ముసల్ది
ఏమి చేయలేక
తన గాథల్ని
తానే తవ్వి
'నెత్తిన పోసుకుంటుంది'

పాపం
పిల్లి ఒకటి
పాల కోసం వస్తుంది
పాత్ర తలకిందుల
తపస్సులో ఉంటే చూసి
'నీళ్ళు నములుతూ'
వెళ్ళిపోతుంది
బడికి పోవాల్సిన బుడ్డోడు
తెలివిగా
'సెలవులోకి
జారుకుంటాడు'
చేలో విత్తనం
ముఖం చాటేసి
'మట్టిలోనే దాక్కుంటుంది'

కొట్టంలో ఆవు
పిడికెడు గడ్డికోసం
'జల్లు కారుస్తుంది'
ఊయలలో ఉన్న
పాపను
'ఆకలి'
సన్నగా గిల్లి వెళ్ళిపోతుంది
గోడ దెబ్బలు తిన్న
కిటికీ
నీరసంగా
ఊగుతుంటది!

నాన్న
అప్పుకోసం బజారుకెళ్ళి
'ఎవరి మాటలకో'
కట్టివేయబడతాడు
ఎదురుచూపుల
తోరణం
దిగేసుకుని
ఇల్లు తన 'కడుపు తడుముకుంటుంది'

హృదయమున్న
'రెండు చేతులు'
నాలుగు గింజల్ని
దోసిట్లోకి పోస్తాయి
వాడిపోయిన
'అమ్మ నవ్వు'
తటాలున
విచ్చుకుంటుంది
నిప్పును
రాజేసిన అమ్మ
'కొన్ని వేడి వేడి
మెతుకుల్ని'
నాలుకపై రాస్తుంది

విద్యాలయం
'బోధించని పాఠం'
ఇప్పుడు
'నా జీవిత పాటవుతుంది'

■






# సమకాలీన వాస్తవికతకు దర్పణం

అలజంగి మురళీధర్
94403 35461

ఉత్తరాంధ్ర నుంచి దూసుకువస్తున్న వినూత్న కథాకలం దాసరి రామచంద్రరావు. ఈ మధ్యనే శ్రీ కాళీపట్నం రామారావు గారి చేతుల మీదుగా ఆవిష్కరణ జరుపుకున్న ఈ సంపుటిలోని కథలు మన మనోసాగరంలో 'అలజడే' కాదు 'తుపాను' రేపుతాయనడంలో అతిశయోక్తి లేదు. 1998 నుంచి కథలు రాస్తున్న ఈ రచయిత ఇన్నాళ్ళూ మౌనంగా ఉండిపోయా దేమిటా...!? అని అనుకుంటున్న మనబోటి వాల్లందరకీ తనది మౌనం కాదనీ, కేవలం తుపాను ముందర నిశ్శబ్దం అని తన కథల సంపుటి ద్వారా ఎరుకపరిచాడేమో అనిపిస్తుంది, ఈ కథలను చదువుతున్నప్పుడు. అల్పజీవుల దైన్యపు బతుకునూ, ఆ బతుకుల్లోని బీభత్సాన్ని వీడియో తీసి చూపిస్తున్నట్టుగా ఉంటాయి ఈ కథలు.

ప్రముఖ రచయిత అట్టాడ అప్పల్నాయుడు ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో 'రామచంద్రరావు తనచుట్టూ ఉన్న జీవితాన్ని కేవలం చూడడమో, వినడమో కాదు; ఆ జీవితాన్ని తన అనుభవంలోకి తెచ్చుకున్నాడు.' అంటారు. నిజమే! చాలా కథలు అలా అనుభవంలోకి తెచ్చుకొని రాసినవే. ఉత్తరాంధ్ర జనం యాసను, వారి జీవన ఘోషను తన కథల్లో ఆర్తితో పలికిస్తాడు. వెతలను అనుభవిస్తున్నట్టు, ఆయా పాత్రల్లో ఒక పాత్రగా లీనమైపోతూ మనల్నీ లీనం చేయిస్తాడు. ఇవి చదువున్నంతసేపు మనలో కూడా అన్వేషణ సాగుతుంది. మనం గమనించని అసంగత సంగతుల్ని ఈ కథల్లో గోచరింపజేస్తాడు. ఈ కథల్లో తనదీ, తన పాత్రలదీ అయిన రెండు స్వరాలూ ఏకమై ఒకే జీవనరాగమై వినిపిస్తాయి. రచయిత సాధించిన ఈ అద్వైత స్థితినుంచి చిందిన ఈ కథలు, పాఠకుల మనసుల్నీ తాకుతాయి. కనిపించని కొన్ని జీవితాల్లోని అంతః సంఘర్షణ దర్శించగల జ్ఞానం ఇస్తాయి ఈ కథలు.

ఈ సంపుటిలోని మొదటి కథ 'అల్పపీడనం'. ఒక సన్నకారు రైతు ఇంటిలో జరిగిన 'సమర్త' (రజస్వల) ప్రస్తుతం అందరూ పిలుచుకునే ఫంక్షన్ చుట్టూ అల్లుకున్న వాస్తవ జీవన చిత్రణ ఈ కథ. కథలోకి వస్తే "ఫంక్షన్ మొదటి నుంచీ కారుమబ్బులు కమ్మి ఫంక్షన్ సమయంలో సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఆగని వర్షం... పొంగిన వాగులు... ఇదొక సంకటస్థితి. ఈ సమయంలో వంటలెక్కడ? వడ్డనలెక్కడ? 'బోజీ' ఎలా...? కాలు చాపుకోడానికే సరిపోని ఇరుకింటిలో "వచ్చి వెల్లిపోతారనుకున్న" చుట్టాలు వర్షానికి ఉండిపోతే ఏమి చెయ్యాలి? ఇవీ ప్రధాన పాత్రలైన తులసోడు, గారమ్మ, సిమ్మాద్రి, సత్యవతిలలో కురుస్తున్న ప్రశ్నల వడగళ్ళు. అల్పుల ఇంట్లో ఫంక్షన్ అంటే "పీడించబడడమే...". ఆఖరికి సమర్తకి వచ్చిన ఈళ్ళు డబ్బులే పంచుకోవాల్సిన దుర్భర స్థితి. ఇలాంటి మానసిక కల్లోలాల్ని పట్టుకొని అత్యంత సహజంగా దృశ్యమానం చేస్తాడు రచయిత. ఈ కథ చదువుతున్నంతసేపూ రష్యన్ రచయిత ఫ్యాదోర్ దోస్తోవ్ స్కీ 'పేదజనం' నవల గుర్తుకొస్తుంది. రెండింటిలోనూ కల్లోలమే ప్రధానాంశం. లునాశార్కీ, మయకోవిస్కీ లాంటి సాహిత్య విమర్శకులు ఒక కళారూపాన్ని

– ఏఏ ప్రమాణాలు ఒక శిల్పస్థాయికి తీసుకుపోగలవని చెప్పారో ఆ కిటుకులన్నీ రచయిత రామచంద్రరావుకి తెలుసేమో మరి… ఈ కథలో ఉపమలు ప్రతిభావంతంగా ఉపయోగించారు. 'టెంటు తడిచి, నానబెట్టిన తెలగపిండి మూటలా వేలబడ్తోంద'నీ, 'గాలివానకు వెన్నుపట్టి దగ్గర రేగిపోయిన చొప్పకట్టలా తులసోడూ, చీల్చి పడేసిన పనసపోట్టులా గారమ్మా…' లాంటివి.

మరో మంచికథ 'పిడికిట్లో ఇసక'. 1998లో రాసిన కథ. ఇసుక నేడొక చర్చనీయాంశం. వర్తమానంలో ఇసుక చుట్టూ ఉన్న మాఫియాలు, రాజకీయాలు మనకు తెలియనివి కావు. తెల్లవారితే ఇసుకాసురుల గురించి వింటూనే ఉన్నాం. ప్రకృతి విధ్వంసం, వనరుల దోపిడీ – ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల మిలాఖత్‌తో ఎంత గరిష్టంగా జరుగుతున్నాయో చూస్తూనే ఉన్నాం. సూక్ష్మస్థాయిలో 'ఇసుక' ఒక పెద్ద దోపిడీ వనరు ఐపోయింది. "అంతా బాగుంది కదా" అని అనుకునే ప్రగతి వెనక "కుట్ర" విప్పిచెప్తాడు, రచయిత. బహుశా ఇసుక మాఫియా మీద వచ్చిన మొదటి కథ ఇదేనేమో. కథకునిగా రామచంద్రరావుని ఒక మెట్టు పైకి తీసుకుపోయే కథ 'పిడికిట్లో ఇసక'.

'ఆయుధపాణి' కథలో రచయిత తడిమిన అంశం విశిష్టమైనది. కమర్షియల్ సినిమాలు పిల్లల మనసులపై చూపిస్తున్న వికృత ప్రభావాన్ని చెప్పే కథ. అన్ని వైపులనుంచి సమాజంలోని పసి హృదయాలను కలుషితం చేస్తున్న సర్వ దుష్టశక్తులను అవి ప్రసరిస్తున్న దుష్ప్రభావాన్ని ప్రశ్నిస్తాడు.

'సొద' వినూత్నమైన కథ. ఒక నిరాధారమైన తల్లి – కన్నకూతురు ఆకలి తీర్చడానికి ఏ దారి ఎంచుకుందో, ఆ కూతురు పెళ్లి తనకు అనివార్యమైనప్పుడు, తాను ప్రయత్నించిన దారులన్నీ మూసుకుపోయినప్పుడు తెలిసిన దారిలోనే వెళ్లాల్సి వస్తుంది. ఈ కథ మనందరినీ ఒకింత ఆలోచనల్లోకి నెట్టేస్తుంది.

ఇవి మచ్చుకు నేను తడిమిన కథలు మాత్రమే! ఇంకా ఈ సంపుటిలో వాన, చోటు, కూలి, ఇంటికప్పు, మొదళ్ళు – చిగుళ్ళు, ఇంటికప్పు, ఉసురు … మొదలైన కథలు దేనికవే వస్తువైవిధ్యం ఉన్న కథలు. వీటిని తప్పక చదవమనే చెప్తాను. పాఠకుల మూడ్ చెదరగొట్టకుండా నడిపించే కథలెన్నో ఉన్నాయి ఈ సంపుటిలో.

ఎంఏ సోషియాలజీ చదివిన రచయిత .. పెనుగొండ గారు మరో ముందుమాటలో చెప్పినట్టు ఈ సంపుటిలోని కథలన్నిటా సమాజాన్ని ఎన్ని కోణాల్లో చూడాలో, సామాజిక చలన సూత్రాలను ఎలా గుర్తించి, ఎలా అర్థం చేసుకోవాలో దార్శనికుడైన వాడి చూపు ఎలా ఉండాలో ఎంత చురుగ్గా ఉంటుందో ఈ కథలు మనకు స్పష్టపరుస్తాయి. ఉత్తరాంధ్ర కథా మేరువులైన అట్టాడ అప్పల్నాయుడు, గంటేడ గౌరునాయుడు గార్ల సాహిత్య పథంలో చరిస్తున్న దాసరి రామచంద్రరావు తనదైన పంథాలో వారిరువురికీ ముందు ముందు ఒక నమ్మకస్తుడైన కథావారసుడు కాగలడనే విశ్వాసాన్ని, భరోసాను ఇస్తుంది, ఈ కథా సంపుటి. ఉత్తరాంధ్ర జనజీవన సంస్కృతిని ,ధిక్కార స్వరాన్ని ముందుకు తీసుకుపోగల ఒక కొత్త 'సారధి' రామచంద్రరావులో ఉన్నాడనేందుకు తార్కాణంగా ఈ సంపుటిలోని కథలన్నీ నిలుస్తాయి. ■



### బయట ...

నేను తలుపులు మూసేసుకొని
కవిత రాయడానికి కూర్చున్నాను
బయట గాలి వీస్తోంది
వెలుగు తక్కువగా వుంది
వర్షంలో ఒక సైకిల్ నిలిపివుంది
ఒక పిల్లాడు ఇంటికి తిరిగొస్తున్నాడు

నేను కవిత రాసేసాను
అందులో గాలి లేదు వెలుగు లేదు
సైకిలూ లేదు పిల్లాడూ లేదు
తలుపులూ లేవు

హిందీ మూలం : **మంగలేశ్ డబరాల్**

తెలుగు : **పాయల మురళీకృష్ణ**




# మట్టి పాదాల వెంట ప్రవహించిన కవిత్వం

- కంచరాన భుజంగరావు
94415 89602

**మా**నవాళికి శాస్త్రజ్ఞుల వైజ్ఞానిక శోధన ఎంత అవసరమో, కవిత్వం కూడా అంతేనని బలంగా నమ్మిన ఫ్రెంచి కవి సింజున్ పర్స్. "మీరు కవిత్వం ఎందుకు రాస్తున్నారు?" అని ఎవరైనా అడిగితే – "ఇంకా బాగా బతకడానికి" అని బదులిచ్చే వారాయన. మనుషులు బాగా బతికేలా చేయగల శక్తి కవిత్వానికి ఉందా? ఉన్నత మానవ విలువలు విశ్వవ్యాపితమై భూగోళం నిత్య శోభాయాత్రలతో వర్ధిల్లేలా సంస్కరించే సత్తా కవిత్వానికి ఉందా? అంటే ఉంది అనేదే సహేతుక సమాధానం. కవిత్వం మానవ ప్రగతికి సోపానం అని కచ్చితంగా చెప్పొచ్చు. వివిధ అస్తిత్వ సమూహాల కథలను, వెతలను అర్థం చేసుకునే మాధ్యమంగా; సాటి మనుషుల కష్టసుఖాలను సహానుభూతి చెందించే సాధనంగా చైతన్యం రగిలించే రగల్జెండా రెపరెపలతో కవిత్వం గుండెకి గుండెకి మధ్య వారధిగా నిలుస్తున్న వాస్తవం మన కళ్లముందుంది. భాషలకు లిపి లేని కాలం నుంచి కూడా ఈ భూమ్మీద కవిత్వం ఉంది. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా విశ్వంలో మానవ ప్రస్థానంలో జీవన పరిస్థితుల్ని మెరుగుపరిచే దిశను సూచిస్తూ దారిపొడవునా సృజన దీపమై వెలుగుతూనే ఉంది కవిత్వం!

**"విజ్ఞానపు కాంతుల్లో విరాజిల్లుతున్న**
**ప్రకృతి ఇచ్చిన కానుక మానవ జీవితం**
**వివేకపు వెలుగుల్లో శోభిల్లేలా**
**ఆ జీవితాన్ని అందంగా తీర్చిదిద్దే వరమే కవిత్వం"**

బతకడానికి తిండి నీరు ఎంత అవసరమో, చక్కగా బతకడానికి చక్కని కవిత్వం కూడా అంతే ముఖ్యం. డాక్టర్ రాధేయ అన్నట్లు – **కవిత్వం ఓ సామాజిక స్వప్నం**
**కవిత్వం ఓ సామాజిక సంస్కారం**
**కవిత్వం ఓ సామాజిక సత్యం**
**కవిత్వం ఓ సామాజిక చైతన్యం**

అటువంటి సామాజిక స్వప్నాన్ని పలవరిస్తూ కవిత్వాన్ని సంస్కారవంతమైన వ్యసనంగా మార్చుకున్నవాడు లండ సాంబమూర్తి. బంగాళాఖాతం అలలతో తన కళ్ళు, మెదడు తుడుచుకుని ఉద్దానం ఉద్దర మీద నిలుచుని గొంతెత్తి పాడుతున్న క్షతగాత్రుడు సాంబమూర్తి. సందర్భానికి తగినట్లు తన అక్షరాలను పుటాకారంగానూ, కుంభాకారంగానూ మలచి సత్యానికి దర్పణం పడుతున్నాడు. నిలువెల్లా చైతన్యం ఆవహించి, గండ శిలగా మారి, బరువెక్కి అల్పపీడనం ఎదు రవగానే జల జల వాక్యాలై కురిసి తేలిక పడుతుంది అతని గుండె మేఘం! మట్టి పాదాల వెంట నడిచి వస్తున్న కొత్త ఊటలా ఉంటుంది అతని కవిత్వం. పుట్లు పుట్లుగా గరిసెలు గరిసెలుగా కొత్త పంటయి కుచ్చిర్లుగా కుదిరి, కళ్ళంలో చేరి, రాశులుగా గాదెలు నిండి అటకలు మురిసి, పాతర్లలో పోగుపడే అక్షరాల ఆశ అతని కవిత్వం. భౌతికంగా అమ్మ దూరమైన తరువాత దు:ఖ నది ముంచెత్తిన చీకటి కీకారణ్యంలో తనకి ఒక లాంతరు దొరికింది. గుండెలోని శూన్యాన్ని వెలిగించి, వెలితి భర్తీ చేసే ఒక వెలుతురులా తనకు తోడై నిలిచింది కవిత్వం అని చెప్పుకున్నాడు. మాక్సిమ్ గోర్కీ చెప్పినట్లు – 'ఒక్క అమ్మ మాత్రమే భవిష్యత్తును గురించి ఏం ఊహిస్తుందో దాన్ని చూడగలదు. ఎందుకంటే పిల్లల ద్వారా భవిష్యత్తునే కదా తను కంటున్నది!'. తన చేయి పట్టి నడిపిస్తున్న అమ్మలాంటి కవిత్వాన్ని నెత్తిన పెట్టుకుని ఊరేగించడాన్ని మించిన జన్మ సార్థకత ఇంకేం ఉంటుంది!? అందుకే సాంబమూర్తి ప్రతి సామాజిక సందర్భాన్ని విశ్లేషించి కవిత్వం చేసి సాహిత్య పత్రికల ద్వారా ప్రకటిస్తున్నాడు. ఆ క్రమంలోనే గత రెండేళ్లలో తను ప్రకటించిన కొన్ని కవితల్ని "గాజు రెక్కల తూనీగ" పేరుతో సంపుటీకరించాడు. తనకు

ప్రాణంపోసి, ప్రేమను పంచిన అమ్మకు దాన్ని అంకిత మిచ్చాడు. మంచి అభిరుచి ఉన్న సాహిత్యాభిమాని దుప్పల రవికుమార్ 'సిక్కోలు బుక్ ట్రస్ట్' తరఫున ఈ కవితా సంపుటిని ప్రచురించారు.

ఈ "గాజు రెక్కల తూనీగ" ఏయే తావులు ఎగిరి వచ్చిందో, ఏ ఉద్యానవనాల పూల సొగసులను అద్దుకుని తిరిగివచ్చిందో, ఏ కర్కశ గాడ్పులకు బెదిరి దిక్కుతోచక దారితప్పి భయానక కాంక్రీటు అరణ్యాల్లో చిక్కుకున్నప్పుడు దాని గాజు రెక్కలు భళ్ళున పగిలి గుండె నెత్తురులు కళ్ళల్లో పొంగాయో... ఆయా అంశాలను ముగ్గురు ప్రముఖులు తమ ముందుమాటల్లో విశ్లేషించారు. ప్రముఖ కథకుడు నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు ఇలా అంటున్నారు : "ఆ ఒక్క గాజురెక్క అన్న పదజాలంతో ఎన్నెన్ని భావాలనో, ఆలోచనలనో కందిరీగ తుట్టె రేపినట్టు రేపినాడు. ఆ రెక్కలు మనకెవరికో కల్పించిన ఆశలు, మనమెన్నో కల్పించుకున్న ఆశలు... గానీ అవి గాజువి! మనల్ని అరగజం కూడా ఎగరనీయలేనివి!"

ఉత్తరాంధ్ర కవుల గురువు గంటేడ గౌరునాయుడు అన్నట్లు – "సాంబమూర్తి నిబద్ధత కలిగిన కవి. నిజాయితీగా నిర్ద్వంద్వంగా కుండబద్దలు కొట్టినట్టు తన భావాల్ని వ్యక్తీకరిస్తారు. తను పెరిగిన పరిసరాల్లో నుంచి, తను చూసిన సమాజంలో నుంచి, తన అధ్యయనంలో నుంచి నేర్చుకున్న లేదా అవగాహన చేసుకున్న అంశాలను తనలో ఇంకించుకుని, జీర్ణం చేసుకుని తనదైన శైలిలో కవిత కడతాడు. మదన పడతాడు. మగ్నమవుతాడు!"

కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన సీనియర్ కవయిత్రి అవధానం అమృవల్లి... సాంబమూర్తి కవిత్వాన్ని పరామర్శిస్తూ "ఆలోచన వినూత్నం... భావుకత విశ్వజనీనం" అని ప్రశంసిస్తూ తన ముందుమాట ద్వారా సా.మూ. అక్షర శిశువులను నాయనమ్మలా ఎత్తుకుని, హత్తుకుని, లాలించే ప్రయత్నం చేశారు. కవి స్త్రీవాద దృక్పథాన్ని ఆమె మాటల్లో చెప్పాలంటే – "స్త్రీ సమస్యలను పురుషులే ఎక్కువగా అర్థం చేసుకోవాలేమో!" అన్న ఓల్గా గారి మాటలు సాంబమూర్తిని బాగా ప్రభావితం చేసినట్లున్నాయి. ఎక్కడ ఏ దుర్మార్గం జరిగినా ఆమెపై జరిగిన దాడి గురించి విన్నా అతడు శోకసంద్రమై పోతాడు. సముద్ర ఘోషతో పాటు తన వేదనను లయం చేసి భారం దించుకోవాలనుకుంటాడు. కుదరదు. ఏదో బాధ. ఆవేశం. కనపడని ఆ కర్కశత్వంపై, ఆమెను కడతేర్చిన ఆ మృగత్వంపై ఏ అర్ధరాత్రో కాసిన్ని రక్తాక్షరాలై కురిస్తే తప్ప కనురెప్ప వాలదు. ఎప్పుడో ఒకప్పుడు ఆమెకై పేనుతున్న అక్షర పోగులన్నీ ఉరితాడై దుర్మార్గాన్ని శిక్షించకపోదా అనే ఆశ తనను మరో ఉషోదయమై పలకరించేది."

ఈ సంపుటిలోని కవితలు చదువుతుంటే ఈ కవిని తలపండిన కవిగానే భావిస్తారు తప్ప, ఇదే తొలి సంపుటితో వచ్చిన కొత్త స్వరంగా గుర్తించడం అసాధ్యం. పరిణత భావాలు.. లోతుగా తాకే వాక్యాలు... తేటయిన భావధార... సరికొత్త వ్యక్తీకరణ వ్యాకరణం... ఇతని కవితల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి!

ఈ కవి అక్షర శిల్పం, వ్యక్తీకరణ శైలికి మచ్చుతునకగా 'ముసురు' అనే ఒక కవితా పాదాలు చూద్దాం. నిరంతరం ఆగకుండా కురుస్తున్న వాన తీరును ఎంత అందంగా అక్షరీకరించాడో ఈ పదచిత్రంలో! –

**"పూల రాజ్యం మీద**
**వాన జరిపిన దండయాత్రలో**
**గాయపడ్డ ప్రతి పువ్వు మీద వాలి**
**నిశ్శబ్దంగా శ్రద్ధాంజలి ఘటిస్తోంది సీతాకోకచిలుక"**

సీతాకోక మకరందం కోసం పువ్వులు మీద వాలినట్టుగా కాకుండా వాన దాడికి గాయపడి రాలిపోయిన పువ్వులకు శ్రద్ధాంజలి ఘటిస్తోంది అనడం ఎంతో అద్భుతమైన ఊహ, అసమాన ఉపమానం. 'వెన్నెల' అనే కవితలో 'అంతులేని శిశిరాలనైతే యివ్వనీ కాసింత వెన్నెలనిచ్చే ప్రకృతి చమత్కారాన్ని మాత్రం మెచ్చుకోకుండా ఉండలేను' అంటాడు. ఇంకా ...

**"ఒక్కపూటైనా**
**వెన్నెలలా బతకాలన్న ఆశని చంపుకోలేను**
**ఏ శిశిరపు చీకటి హృదయంలోకైనా జారి**
**వెన్నెలగా మెరిసిపోవాలన్న తపననూ దాచుకోలేను**
**ఏ వేసారిన గుండె గుమ్మానికో**
**వెన్నెల తోరణమై అలంకృతమవ్వడానికి**
**నాలుగు వాక్యాల్ని రాయకుండా ఉండలేను!"**

సాహిత్య ప్రస్థానం మాసపత్రిక మార్చి 2020లో ప్రచురించిన 'అమ్మ గర్భాన్ని కాలదన్నుకొని...' అనే కవితలో మాతృభాష ఆవశ్యకతను గుర్తు చేస్తూ మనవాళ్ళ పరభాషా వ్యామోహాన్ని నిరసిస్తున్నాడు.

**"లేలేత మొగ్గలు**
**ఆంగ్లంలోనే వికసించాలి అంటున్నాం**
**సుతిమెత్తని పూలన్నీ**
**పరభాషలోనే పరిమళించాలి అంటున్నాం**
**చివరికి**
**ఇంగ్లీషులోనే తుమ్మమంటున్నాం**

**ఆంగ్లంలోనే ఆవలించమంటున్నాం"**

'పసి నవ్వుల వాన' అనే మరో కవితలో యుద్ధము– శాంతి గురించి చర్చిస్తూ కవి ఇలా అంటాడు :

**"...... ఇరు యుద్ధాల మధ్య విరామమే శాంతి అన్న**
**మేధావి మాటలు గుర్తొచ్చి వెనుదిరిగి**
**జనావాసాలకేసి కదులుతున్నప్పుడు**
**కాళ్లకు గుచ్చుకుంటూ రాళ్ళూరప్పలు**
**ఆకాశాన్ని సొంతం చేసుకున్న రాబందులు**
**రుధిరాన్ని పూస్తున్న గడ్డిపూలు**
**చలిచీమల్లా కొరికేస్తున్న ప్రశ్నల నుంచి**
**తప్పించుకోబోయి తూలిపడ్డాను**
**ఆయుధం ఎక్కడో జారిపోయింది**
**దొర్లుకుంటూ దొర్లుకుంటూ**
**ఓ పసిపాదం తగిలి ఆగాను**
**తలెత్తి చూస్తే/ ఓ స్వచ్ఛమైన పసినవ్వుల వాన**
**నన్ను తడిపేస్తూ..."** ... ఇలా కొన్ని కవితల్లో ముగింపు ఒక మెరుపులా చప్పున కట్టిపడేస్తుంది. ఇంకా ఉటంకిస్తూ పోతే చాలా మెరుపుల్ని పట్టి చూపాలి. అన్నిటినీ ఒకేసారి చేతిలోకి తీసుకుని చదువుతున్న కొద్దీ ఇంద్రధనస్సు మనసు పొరల్లో ప్రక్షిప్తమౌతూ ఉంటే పుటలు తిరగేస్తూ ఆస్వాదించే అవకాశం మీకే ఉంది.

మొత్తమ్మీద ఒక్కో కవితని ఒక వర్ణ చిత్రం చిత్రిస్తున్నంత శ్రద్ధగా రూపొందించాడు అనిపిస్తుంది. శిల్ప గాఢత సాధించడం కోసం ప్రతీకల వెంటపడలేదు. సాధారణ పాఠకుడికి అందేంత సులువుగా రాయడం మీద దృష్టి నిలిపాడు కవి. కవితా వస్తువుల కోసం ప్రయాస పడలేదు. అన్నీ అతని అనుభవం లోనివే! ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నందువల్ల బడి గూటిలో నుంచి బయటి ప్రపంచాన్ని చూస్తూ "పీపింగ్" చేస్తున్న పిట్ట మాదిరి స్పందిస్తున్నాడు. తను చూసిన తెలుసుకున్న పరిశీలించిన వార్తాంశాలుగా గ్రహించిన విషయాంశాలను అంతర్దృష్టితో సమీక్షించాడు. కార్యకారణ సంబంధాలను అవగాహన చేసుకున్న తరువాత సమాజంలో జరిగే వాస్తవ సంఘటనల నుంచి కవిత్వ అంశాలను ఎన్నుకున్నాడు.

ఇతని కవిత్వంలో వ్యక్తీకరణకు చాలా ప్రాధాన్యత ఉంది. ఆధునిక కవిత్వ పరిభాష బాగా పట్టుకున్నాడు. కొత్తతరం వచన కవిగా వస్తువు ఏదైనా చెప్పిన విధానం చప్పున హత్తుకునేలా ఉంది. వస్తువు కొత్తదైనా పాతదైనా చిత్రించిన పద్ధతి, చిత్రిక పట్టిన విధానం వల్ల నవ్యత సంతరించుకుని తాజాగా కనిపిస్తుంది. సా.మూ. కవిత్వం! ఎంచుకున్న విషయాన్ని నిర్దిష్టంగా, సూటిగా, క్లుప్తంగా చెప్పే నేర్పు ఈ కవికి ఉండటం వల్ల ఒక కచ్చితత్వం, సులభ గ్రాహ్యత, మిగతా వర్తమాన కవులకు లేని ప్రత్యేకత ... ఇతని కవిత్వంలో కనిపిస్తుంది.

ఈ సంపుటిలోకి తరచి చూస్తే కవి పల్లెని, ప్రకృతిని, సముద్రాన్ని పదే పదే కలవరిస్తున్నట్లు తెలుస్తోంది. కవి నేపథ్యం లోని ప్రకృతితో మమేకమైన అతని పల్లె జీవనం, దైనందిన జీవితంలో భాగమై తన ఇంటికంటిలో నిత్యం ప్రతిబింబించే నురగజెండాల అలజడి అనివార్యంగా కవిత్వంలోకి తర్జుమా అయిఉంటాయి. ఈ కవితల్లోని భావాలేవీ అపరిచితంగా కనబడవు. ఒక్కో కవితలో ఎంచుకున్న భావానికి కవి మెదడునీ, హృదయాన్నీ జమిలిగా అనుసంధానం చేసి, పొందికైన రూపంతో పూర్తిచేశాడు. ఒక్కో వస్తువుతో కవి ఎంత నిజాయితీగా మమేకమయ్యాడో అతని కొత్త అభివ్యక్తి మనకు తెలుపుతుంది. ఈ పుస్తకాకాశం నిండిపోయేలా దట్టించిన కవితా లాలిత్యం పేజీలుగా పరుచుకున్న క్యుములోనింబస్ మేఘాల నుంచి జారి పాఠక హృదయ సీమలో తడి స్పర్శగా మెరుస్తుంది. సా.మూ. కవిత్వం చదవడం ఒక మంచి అనుభూతి అని నిస్సంశయంగా చెప్పవచ్చు. స్వచ్ఛత, నిర్మలత్వం ఈ కవిత్వంలో సమ్మోహనత్వమై ఆకర్షిస్తాయి. వ్యక్తీకరణలో చాలాచోట్ల వాస్తవికతని అద్దంలో చూపే ఒక నైపుణ్యం ఉంది. పాఠకుని మనసు అభ్యంతర పెట్టలేని అతిశయాలు కూడా అంతర్లీనంగా కలగలిసి ఉన్నాయి. ఎక్కడా కవి గొంతు చించుకున్నట్టుగానీ, బిగ్గరగా నినదిస్తున్నట్టు గాని దాఖలాలు లేవు. కానీ సాటిమనిషి గాయపడిన ప్రతి సందర్భానికి, పీడనకు గురవుతున్న ప్రతి సందర్భానికి కవి గుండె రక్తమోడుతున్న చిత్రాలున్నాయి. సామాన్యుల అసహాయతలను అక్షరాల్లో పొదిగిన నిర్మలత్వం ఉంది. పల్లె సమూహపు హృదయ ధ్వనులుగా వినబడే ఆక్రోశాలు, ఆక్రందనలు ఇందులో ఉన్నాయి. ఇది ప్రగతిశీల కవిత్వం. పరిణత భావాలు గల ఈ కవి ఉదాత్త ప్రజాస్వామికవాది. ఆధునిక అభివ్యక్తిని అందిపుచ్చుకున్న నవతరం కవిత్వ ప్రతినిధి. వస్తువు ఎలాంటిదైనా వ్యక్తీకరణలో నవ్యత చూపడంతో పాటు సరళంగా లోతుగా కవిత్వం చెప్పగల నేర్పు సాధించడం వల్ల కవిగా కొత్త ఆశ రేకెత్తిస్తున్నాడు. ఎవరి వారసత్వాన్ని నిలిపే కవిగా రూపొందుతాడో కాలమే నిర్ణయిస్తుంది. కానీ ఆశాజనకమైన భవిష్యత్తు మాత్రం కనిపిస్తూ ఉంది. శైలీ విన్యాసాల పరంగా మరింత వైవిధ్యం సాధించడం ద్వారా ఈ కవి తెలుగు సాహితీ జగత్తులో తనకంటూ ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించుకుంటాడని కచ్చితంగా చెప్పొచ్చు.

■



# ముసుగు

- ఇ.శ్రీనివాస రెడ్డి
7893111985

**మం**చి గాఢ నిద్రలో ఉండగా, మంచం పక్కనే ఉన్న సెల్ ఫోన్ మోగింది. అదేపనిగా ఆగకుండా మోగుతూ ఉండటంతో మా ఆవిడ "అంత మొద్దు నిద్ర అయితే ఎలాగండి.. ఎవరో చూడండి" అంటూ నన్ను తట్టింది. కళ్లు తెరచి వాచీ వంక చూశాను. తెల్లవారుజాము నాలుగు కావస్తోంది. ఫోన్ అందుకుని చూశాను. ఆఫీసు కొలీగ్ వెంకట్రావు. అప్రయత్నం గానే నా ముఖంలో కాసింత కోపం, చిరాకు తొంగి చూశాయి. కొద్దిరోజుల నుంచి రోజు మార్చి రోజు ఫోన్ చేసి విసిగిస్తు న్నాడు. నెల రోజుల కిందట వెంకట్రావు వాళ్ళ నాన్న గారు కాలం చేశారు. అప్పటినుంచి తెల్లవారకముందే నాకు ఫోన్ చేయటం, "నాన్నను కళ్ళల్లో పెట్టుకుని చూసుకున్నాను ఇంతకాలం. ఒక్కసారిగా ఇలా అయ్యింది ఏమిటి? నాన్న గారి విషయంలో నేనమన్నా తప్పు చేశానా?" అంటూ విసిగించడం మొదలుపెట్టాడు. అతడి నైజం తెలుసు కాబట్టి నేను ఏమీ సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండి పోయేవాడిని.

ఇంకొకసారైతే "మన చేతుల్లో ఏముంది? నీకు చేతనైనంత చేసావు. ఊరుకో" అంటూ ఓదార్చేవాణ్ణి. కానీ, ఎందుకో వెంకట్రావు ఎప్పుడు ఫోన్ చేసినా కోపం వస్తుంది కానీ, ఏ రోజూ జాలి అనిపించలేదు. వెంకట్రావు ఆఫీసులో కొలీగే కాదు, వాళ్ళ నాన్న గారు, మా నాన్నగారు కూడా చిన్నతనం నుంచి కలిసి చదువుకుని, ఒకే ఆఫీసులో ఉద్యోగాలు చేసి రిటైరయ్యారు. ఇద్దరు ఒకే కాలనీలో ఇళ్లు కట్టుకోవడంతో కుటుంబాలు కూడా బాగా దగ్గరయ్యాయి. ఏ బంధుత్వం లేకపోయినా తెలియని వాళ్ళు చూస్తే మాత్రం వారిద్దరినీ బావా బావమరుదులేమో అనుకునే వాళ్లు.

వారి స్నేహాన్ని శాశ్వతం చేసుకోవడానికి నాన్న గారు ఒకసారి మా చెల్లెల్ని వెంకట్రావు ఇచ్చి చేద్దాం అని ఆలోచించారు. నేనే వద్దని అడ్డుపడ్డాను. అప్పుడు నాన్నకి, నాకూ ఓ చిన్న సైజు యుద్ధమే జరిగింది. చివరకు నాన్న గారికి వెంకట్రావు గురించి వివరంగా చెప్పిన తర్వాత ఆయన నా అభిప్రాయానికి విలువిచ్చి, చెల్లికి వేరే సంబంధం చూసి చేశారు.

వెంకట్రావుకి ఎంతసేపటికీ అబద్ధాలు చెప్పటం అలవాటు. ప్రతిదీ గోరంతలు కొండంతలు చేసి చెబుతూ మెప్పు పొందాలని తాపత్రయం. వాళ్ళ అమ్మా నాన్నలకు ఏదైనా జబ్బు చేస్తే మందుల షాపు నుంచి తెచ్చి ఏవో మాత్రలు వేసేవాడు. మర్నాడు ఆఫీసులో పెద్ద కార్పొరేటు హాస్పటల్‌కి తీసుకెళ్లి వైద్యం చేయించినట్టు అబద్ధాలు చెప్పేవాడు. అతడి తత్వం గురించి అప్పుడప్పుడు వాళ్ల నాన్న మా నాన్న దగ్గర చెప్పుకుని బాధపడేవాడు. ఆఫీసులో నేను వెంకట్రావుకి పరోక్షంగా చెప్పే ప్రయత్నం చేసినా పెద్దగా పట్టించుకునేవాడు కాదు. నాన్నగారి ఒత్తిడి మేరకు అప్పుడప్పుడు వెంకట్రావు ఇంటికి వెళ్లి వాళ్ళ అమ్మానాన్న యోగక్షేమాలు కనుక్కుంటూ చిన్నచిన్న అవసరాలు తీర్చి వచ్చేవాణ్ణి. నేను వాళ్ళ ఇంటికి రావడం, వాళ్ళ అమ్మానాన్నలకు సాయం చేయటం వెంకట్రావుకే కాదు; వాళ్ళ ఆవిడకు కూడా సుతారమూ ఇష్టం ఉండేది కాదు. నేను ఉన్న ఐదు నిమిషాలూ ఆవిడ కూడా ఆ పక్కనే ఉండేది. వారిని ఎంత బాగా చూసుకుంటుందో ఏకరువు పెట్టేది. తిరిగి వచ్చి జరిగింది అంతా నాన్నగారికి చెబుతూ ఉండేవాడిని. ఆయన కూడా చాలాసార్లు వెంకట్రావు వాళ్ళ నాన్నతో "అంత ఇబ్బంది పడుతూ అక్కడ ఎందుకు? బయటకు వచ్చి వేరుగా ఉండొచ్చు కదా? నీకొచ్చే పెన్షన్తో మీ ఇద్దరూ హాయిగా గడపవచ్చు" అనేవారు. కానీ వెంకటరావు

వాళ్ళ నాన్న మాత్రం కొడుకు పరువు పోతుందోనని ససేమిరా ఒప్పుకునేవాడు కాదు.

"తమకు వచ్చే పెన్షన్ డబ్బు మొత్తం పిల్లల చేతిలో పోసి వాళ్ల దయాదాక్షిణ్యాల కోసం ఎదురు చూసే ప్రతి తల్లిదండ్రి పరిస్థితి ఇంతేనేమో" అనేవారు నాన్న. అందుకేనేమో తన పెన్షన్ డబ్బు తన దగ్గరే పెట్టుకుని ఎప్పుడన్నా అవసరమైతే నాకు సాయం చేస్తూ ఉండేవారు.

♦ ♦ ♦

కాస్త చికాకుగానే రిసీవ్ బటన్ నొక్కి, "చెప్పు వెంకట్రావు" అన్నాను. "అన్నయ్య గారూ.. ఆయన మనల్ని వదిలి వెళ్ళిపోయారు.." అంటూ పెద్దగా ఏడుస్తోంది వెంకట్రావు భార్య అవతల వైపు నుంచి. ఒక్కసారిగా నా నిద్ర మత్తు వదిలి పోయింది.

"ఏమిటమ్మా నువ్వు అనేది.." అన్నాను.

"అవును.. అన్నయ్య గారూ... ఆయన మమ్మల్ని వదిలి వెళ్లిపోయారు." మళ్లీ ఏడవటం మొదలుపెట్టింది

"అయ్యో.. " అని నిట్టూర్చి "నేను వస్తున్నాను." అని వెంటనే బయల్దేరబోతుంటే...

"ఏమైంది" అనడిగింది మా ఆవిడ.

విషయం చెప్పాను. తనూ బయల్దేరింది.

దారి మధ్యలో "ఆయనకి ఆరోగ్య సమస్యలు లేవు కదా.. ఎలా జరిగింది?" అనడిగింది.

"నాకు మాత్రం ఏం తెలుసు? తనని నేను ఏ వివరాలూ అడగలేదు. అంతా అయోమయంగా ఉంది." అన్నాను.

ఆ ఇంటికి చేరుకునేసరికి అప్పటికే ఓ పదిమంది ఇంటి బయట ఉన్నారు. వాళ్ళను తప్పించుకొని లోపలికి వెళ్ళాము.

అక్కడి దృశ్యం చూసి ఇద్దరం ఒక్కసారిగా ప్రాన్పడి పోయాం. ఎదురుగా హాల్లో సీలింగ్ ఫ్యానుకు వేలాడుతూ వెంకటరావు మృతదేహం.

♦ ♦ ♦

తండ్రికి వచ్చే పెన్షన్ డబ్బు మొత్తం తనే తీసుకుని కనీసం వాళ్ళకు కావాల్సిన మందులు కూడా సరిగా ఇచ్చేవాడు కాదు వెంకట్రావు. రెండేళ్ల క్రితం వాళ్ళమ్మకు క్యాన్సర్ సోకింది. ఆపరేషన్ చేస్తే ఇంకొన్నాళ్లు బతికేదేమో! సరైన వైద్యం చేయించక ఆవిడ ఎక్కువ కాలం బతకలేదు. తల్లి పెద్దకర్మను మాత్రం ఎవరూ ఊహించనంత గొప్పగా చేశాడు. దినపత్రికల్లో ఘనంగా ప్రకటనలు వేయించాడు. బంధువులందరికీ మంచి గిఫ్టులు పంచాడు. ఇవన్నీ చూసి వెంకటరావుకి తల్లి మీద ఎంత ప్రేమో అని అనుకున్నారు చాలామంది. బతికున్నప్పుడు ఇంకా ఎంత బాగా చూసుకున్నాడో అన్నారు. వాళ్ళ నాన్న, మా నాన్న, నేను మాత్రం లోలోపల చాలా బాధపడ్డాం.

అప్పటినుంచి నాన్న గారు "నేను పోయిన తర్వాత పేపర్లలో ప్రకటన వేయకపోయినా పర్లేదు కానీ, జబ్బు చేస్తే మాత్రం మంచి హాస్పిటల్లో వైద్యం చేయించండి." అనేవారు అప్పుడప్పుడు. భార్య చనిపోయిన దిగులుతో నెల తిరగకుండానే వెంకటరావు తండ్రి మంచం పట్టాడు. అప్పుడుగాని వెంకటరావు అసలు స్వరూపం బయట పడలేదు. తండ్రిని బాగా నిర్లక్ష్యం చేశాడు. ఆయన మాటకు అసలు విలువ లేకుండాపోయింది. వెంకటరావు భార్య కూడా మామ గారి అవసరాలను అంతగా పట్టించుకునేది కాదు. ఎవరైనా బయట వాళ్ళు వస్తే మాత్రం ఆయనకి దగ్గరుండి సేవలు చేస్తున్నట్టు నటించేది.

ఒకరోజు వెంకటరావు వాళ్ళ నాన్నను చూడటానికి నేనూ, నాన్న వెళ్ళాం. ఆరోజు మాత్రం ఎందుకో ధైర్యం చేసుకుని తన బాధనంతా నాన్న గారి ముందు వెళ్లబోసుకున్నారు ఆయన. నాన్న గారు, ఆయన స్నేహానికి గుర్తుగా ఉంటుందని వారి కలయికను సెల్‌ఫోన్లో వీడియో తీశాను. అది జరిగిన రెండు రోజులకే ఆయన మరణించారు. షరా మామూలుగానే తండ్రి అంత్యక్రియలను కూడా వెంకట్రావు ఘనంగా జరిపించాడు. తన తండ్రి గుర్తుగా నాన్నగారికి బట్టలు పట్టుకొచ్చాడు ఓ రోజు. అతడిని చూడగానే నాన్నగారికి కోపం కట్టలు తెంచుకుంది. ఆ బట్టలను విసిరి కొట్టారు.

"ఒరేయ్.. పుత్రుడు పున్నామ నరకం నుంచి తప్పిస్తాడని అంటారు. నువ్వు మాత్రం బతికుండగానే మీ నాన్నకు నరకం చూపావు." అని తిట్టేసరికి వెంకట్రావుకి మారు మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అప్పటినుంచి వెంకటరావులో చాలా మార్పు గమనించాను. ఆఫీసులో మాట్లాడేవాడు కాదు. మౌనంగా తన పని తను చేసుకుపోయేవాడు. రోజు మార్చి రోజు తెల్లవారుజామున నాకు ఫోను చేసేవాడు. "నాన్న గారి విషయంలో నేను తప్పు చేశానా?" అనడిగేవాడు.

రోజూ అలాగే విసిగిస్తుంటే ఓరోజు ఆఫీసులో ఎవరూ లేని సమయంలో "వెంకట్రావూ... ప్రతి రోజు నువ్వు మా నాన్నకు ఇలా చేశాను.. అలా చేశాను అని చెబుతుంటావు.

ప్రతి మాటకి ముందూ వెనుకా నేను నేను అంటూ ఉంటావు. ఆ మాట వెనక చాలా అహంకారం కనిపిస్తుంది." అన్నాను.

"అహంకారమా?" అని ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు.

"అవును అహంకారమే.. ఆ అహంకారంలో కన్న తల్లిదండ్రులు కూడా నీకు కనపడలేదు. ప్రతి మనిషిలో ముగ్గురు నేనులు ఉంటారు. ఒక నేను ఈ ప్రపంచానికి గొప్పగా కనపడాలని తాపత్రయ పడే వ్యక్తి. మరొక నేను సమాజంలోని ప్రతి అంశం తనతోనే ముడిపడి ఉంటుందని భావించే వ్యక్తి. మూడో నేను. వాస్తవంగా తానేమిటో, తన బలాబలాలు ఏమిటో తెలిసిన వ్యక్తి. అతనే అసలైన నేను. కానీ నువ్వు మాత్రం ప్రపంచానికి గొప్పగా కనపడాలని అబద్ధాలలో బతకటం అలవాటు చేసుకున్నావు. మీ నాన్ననూ అలాగే బాధపెట్టావు." అని వాళ్ల నాన్న మాటలు ఉన్న వీడియో చూపించాను. ఏం మాట్లాడాలో తెలియక తలవంచుకొన్నాడు వెంకట్రావు. "పదిమందిలో గొప్పగా కనిపించాలని నీకు నువ్వుగా వేసుకున్న ముసుగు ఇకనైనా తీసేయ్." అని అతడి సమాధానం కోసం ఎదురు చూడకుండా ఇంటికి వచ్చేసాను.

ఇది జరిగిన తర్వాత రెండు రోజులు వెంకటరావు ఆఫీసుకు రాలేదు. ఈ పొద్దున ఆత్మహత్య వార్త వినాల్సి వచ్చింది.

♦ ♦ ♦


ఎవరో సమాచారం ఇచ్చినట్టున్నాడు. పోలీసులు వచ్చారు. విచారణ మొదలెట్టారు.

"ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు? ఏమైనా అప్పులు ఉన్నాయా? సమస్యలు ఏమైనా ఉన్నాయా?" అంటూ ఎస్ఐ ప్రశ్నిస్తున్నాడు.

ఆమె మాత్రం ఏం జవాబు చెబుతుంది? లోకానికి గొప్పగా కనపడాలనే ముసుగు తొలగిపోగానే వెంకట్రావులో పశ్చాత్తాపం మొదలైంది. తాను చేసిన తప్పుకు క్షమించమని అడగడానికి తల్లిదండ్రులు బతికి లేరు. తన బాధ ఎవరితోనూ పంచుకోలేక చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. తను తనలా బతకాలంటే చాలా ధైర్యం కావాలి. లేకుంటే రకరకాల ముసుగులు వేసుకుని బతకాల్సి ఉంటుంది. ఏదొకరోజు ఆ ముసుగు తొలగిపోతే ...!?

విచారణ సాగుతోంది. అయ్యో ఎంత ఘోరం జరిగిందంటూ వారి బంధువులు తమలో తాము మాట్లాడుకుంటున్నారు.

■



## బాధాగ్ని

**వి**ంత శబ్దాలతో
ఆవిష్కృతమౌతోంది
దృశ్యం
ఒక హెచ్చరికలా ...

నిలువునా బ్రద్దలు చేసే మాట
కిటికీలోనుంచి లోపలికి
దూసుకు వస్తోంది
హోరు గాలిలా భయాన్ని కలిగిస్తూ ...

అగాధంలోకి
జారిపోతున్నంత బాధాగ్ని

చీకటి భస్మాసురుడి వలె కనిపిస్తుంటే
ఎర్ర దీపాలను వెలిగించుకుంటూ
కొన్ని క్షణాల మధ్య
నేను
మౌనాన్ని స్వీకరించి.

**- లక్ష్మీ కందిమళ్ళ**
**88493 68808**

# దు:ఖదీపం

- పుట్టి గిరిధర్
94914 93170



దేహసముద్రంలో దాగిన హృదయం
ఎగసిపడుతున్న అగ్నిపర్వతమై
అనేకానేక స్పందనలను సృష్టిస్తూ
దు:ఖపు లావాను ఎగజిమ్ముతుంది!

కళ్ళు
కన్నీటి ప్రవాహాన్ని ఆపే ద్వారాలై
మరిగిన దు:ఖసారాన్నంతా వడబోసి
ఒక్కో చుక్కకు దారినిస్తాయి!

కంటిరెప్పలకున్న వెంట్రుకలు
కన్నీటిని దోసిలి పట్టి
రాలిపోకుండా మెత్తగా జారవిడుస్తాయి
బతుకు చెదిరిపోయినా
దు:ఖం చెల్లాచెదురు కావొద్దని!

వర్ణంలో వ్యత్యాసాలుండొచ్చు
బాధలో బహు విధాలుండొచ్చు
ఏడుపులో ఎన్నో రకాలుండొచ్చు
మనసును బట్టి, మనిషిని బట్టి
దాని రూపు మారుతూ ఉండొచ్చు
కన్నీటిలో మాత్రం ఒకే తడి
అదే గుండెలో దాగిన వెలి!

మనిషి పయనంలో
దు:ఖమొక కనబడని కాంతి
ఎన్నెన్నో తీరాలను చేరి
కొత్త దారులను చూపిస్తుంది
భ్రమల తెరలను తుంచి
నిజాన్ని నగ్నంగా చూపిస్తుంది!

కన్నీటి చమురుతో వెలిగే బతుకు దీపం
రవ్వంతైనా కొండంత బలాన్నిస్తుంది
కన్నీళ్లను దాటిన కళ్ళు
సూర్యచంద్రులై వెలుగుతుంటాయి!

మనిషి దు:ఖం గీతను బోధిస్తుంది
నుదుటి గీతలను తిరగరాస్తుంది
సంతోషాలది కేవలం రెక్కల దారి
దుఃఖానిది ఎన్నో మలుపుల రహదారి
ఆకాశమంత ఆవేదన కురిసినా
మట్టిలా మొలకెత్తడానికి సిద్ధమే!

దు:ఖం మనకొక నేస్తం
ఈ దు:ఖమే లేకుంటే
గుండెలో ఎన్నెన్ని ప్రపంచ యుద్ధాలు జరిగేవో
ఎన్నెన్ని గుండెలు బద్దలై ఆగిపోయేవో!



# సామాజిక మాధ్యమంలో సాహితీ సేద్యం

తుమ్మేటి రఘోత్తమ రెడ్డి

**'చి**లుకను పెంచాను ఎగిరిపోయింది. ఉడుతను పెంచాను. పారిపోయింది. మొక్కను పెంచాను.. ప్రస్తుతం ఆ రెండూ వచ్చి చేరాయి.' అని అన్నారు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్. ఈ మాటలకు ఆచరణ రూపమిచ్చారు ప్రముఖ రచయిత తుమ్మేటి రఘోత్తమ రెడ్డి. పిచ్చుకలు గూడు కట్టుకునేందుకు అనువైన వాతావరణం, చిలుకలు వాలేందుకు పచ్చని చెట్లు, ఉడుతలు ఉత్సాహంగా ఎగిరేందుకు వీలుగా ఓ తోటను తన మిద్దెపై నిర్మించారు. అక్కడ పూలమొక్కలుంటాయి. పూలుంటాయి.

కోళ్లుంటాయి. పిచుక గూళ్లుంటాయి. వీటి మధ్య అంటే ప్రకృతి మధ్య సహజసిద్ధంగా ఓ మనిషి తిరుగాడుతుంటారు. వికృతమైన నగరజీవనంలో ఈ చిన్ని ప్రకృతిని చూసేందుకు పర్యాటకులూ వస్తుంటారు. ఆ తోట అలా పూలిస్తూ, పండ్లిస్తూ, కూరలిస్తూ.. పక్షులను, జీవరాశిని తన పరిధిలో కాపాడుకుంటూ ఒక ఆరోగ్యవంతమైన సహజ ప్రపంచాన్ని నిర్మించుకుంది. అక్కడే సాహితీ సేద్యమూ చేస్తున్నారు ప్రముఖ రచయిత రఘోత్తమరెడ్డి.

శ్రమకు అర్థం, బతుకు పరమార్థం ఎరుక పరిచే వ్యవసాయ కుటుంబంలో పుట్టారు రఘోత్తమరెడ్డి. ఊహ తెలిసినప్పటి నుంచి అకడమిక్ చదువు కంటే సమాజాన్ని చదవడం ఆరంభించారు. దాదాపు ఆరు శతాబ్దాలు తన చుట్టూ ఉన్న సమాజంలో జీవించారు. చూశారు. విన్నారు. తెలుసుకున్నారు. ఎందుకిలా? అని తర్కించారు. అన్నీ ప్రశ్నలే! జవాబులు కోసం అన్వేషించారు. ఇంకా అన్వేషిస్తూనే ఉన్నారు. ప్రకృతి నుంచి, మనిషి నుంచి, మొక్క నుంచి, కుక్క నుంచీ నేర్చుకునేది ఎంతో ఉందని అనుకున్నారు. కథలు, నవలలు, వీడియో కథలు, కొటేషన్లు, వంశ, గ్రామ చరిత్రల రికార్డ్ చేయడం నుంచి మిద్దెతోట సంస్కృతిని వ్యాప్తి చేసేందుకు విశేష కృషి చేస్తున్న రఘోత్తమ్‌రెడ్డి ఈ తరంతో చేస్తున్న ప్రయాణంలో సామాజిక మాధ్యమం ప్రధాన భూమిక పోషిస్తోంది. కలం, కాగితాలు పక్కన బెట్టిన రచయితలు, మేమెందుకు రాయడం లేదంటే అంటూ వివరణలు ఇచ్చుకునే సాహితీవేత్తలకంటే భిన్నంగా సామాజిక మాధ్యమం వేదికగా నేటితరంతో మమేకమవుతున్నారు ఆయన. తన ఫేస్‌బుక్ వాల్‌నే ఒక సకల శీర్షికల సాహితీ సంచికగా తీర్చిదిద్దారు. ఇందులో కవితలు, కథలు, వ్యంగ్య కథనాలు, సీరియల్స్, కొటేషన్స్, విద్యావిజ్ఞాన సంబంధ వ్యాసాలు, పాటల వెనుక మాటలు, గ్రామచరిత్రలు, సాహిత్యం, సేద్యం, జానపద కళలు, సేంద్రియ వ్యవసాయం, శాకాహారం ఉపయోగాలు, సస్యరక్షణ పద్ధతులు, మిద్దెతోట నిర్మాణం- నిర్వహణ కూడా మనకు కనిపిస్తాయి. సామాజిక మాధ్యమాల ద్వారా సాహిత్యాన్ని, సేద్యాన్ని కలగలిపి చేస్తున్న రఘోత్తమరెడ్డి ఆలోచనలు, లక్ష్యాలు ఆయన మాటల్లోనే..

**మార్పు అత్యవసరం**

సాహిత్య ప్రక్రియల్లో మార్పులు అవసరం. మనం వెనక్కి తిరిగి సాహిత్య చరిత్రని అధ్యయనం చేస్తే ఈ విషయం అర్థం అవుతుంది! యూరప్‌లో పారిశ్రామిక విప్లవానికి ముందు ఇపుడు మనం అనుకుంటున్న 'ఆధునిక కథ- నవల -

కవిత్వం' వంటివి లేవు! వేరు వేరు రూపాల్లో ఉండేవి! ఒక్క సాహిత్య ప్రక్రియలే కాదు, వస్తువు – భాష – శైలీ – శిల్పాల్లోనే కాదు చూసే దృక్పథం లోనూ చాలా మార్పులు వచ్చాయి! అందుకని జీవితంలోని అన్ని రంగాల్లో మార్పులు వస్తుంటాయి. సాహిత్య రంగంలో కూడా మార్పులు అనివార్యం! కాలాగుణంగా సాహిత్య ప్రక్రియల వేదికల మార్పు అవసరమే. అయితే కాలానుగణంగా రచయితలు మారాలా? అనేది జీవితమంత 'సంక్లిష్టమైంది, లేదా సరళమైంది కూడా! కాలానుగుణంగా అంటే, ఏఏ విషయాల్లో అనే ప్రశ్న వస్తుంది! రచయిత మారడం కాదు, మారుతున్న కాలాన్ని అర్థం చేసుకోవాలి! 'కాలం' అనేది కూడా విస్తృతార్థంలో వాడబడుతున్న పదం! కాలం అంటే 'సమయం' అని కాదు కదా! జీవితం – దాన్ని ప్రభావితం చేస్తున్న అనేక సూక్ష్మ –స్థూల విషయాలు! పర్యావరణంతో సహా! రచయిత మారడం అంటే, కొత్త పరిణామాలను అప్పటికప్పుడు అర్థం చేసుకోవడం! దృక్పథం మారదు, కాని దృష్టి నిశితం కావాలి! రిజిడ్‌గా ఉండకూడదు!



**సాహిత్యానికి సామాజిక మాధ్యమం వేదిక**

సాహిత్య ప్రక్రియల వేదిలు మార్పు అవసరం అనేది సామాజిక మాధ్యమం నిరూపిస్తోంది. సోషల్ మీడియా ప్రభావం సాహితీరంగంపై చాలానే ఉంది. సోషల్ మీడియా రాక పూర్వం సాహిత్యం పరిస్థితి ఒక విధంగా ఉంది! పత్రికా సంపాదకుల అభిరుచుల ప్రకారం, సాహిత్యానికి స్థానం దొరికేది. పెట్టుబడి పెట్టిన పత్రికలకు వాటి వాటి పరిధులుంటే, రకరకాల భావజాలాల ప్రచారాలకోసం ఉన్న పత్రికలది మరోరకం పరిధులు! ఆయా పరిధులకు వెలుపల ఆలోచించే రచయితలకు, ప్రచురణ అవకాశాలు దాదాపు లేవు!

నేను రాసిన పాతిక కథల్లో నాలుగు కథలు వ్యాపార పత్రికల్లో అచ్చయ్యాయి! ఇరవయ్యొక్క కథల్లో మూడు వంతులు పారలల్ సాహిత్య పత్రికల్లో అచ్చయితే, మిగిలిన ఒక వంతు సొంత పబ్లికేషన్ ద్వారా అచ్చువేసుకోవాల్సి వచ్చింది! 1997 నుంచి 2016 దాకా రచనా వ్యాపకాన్ని మానుకోవాల్సి వచ్చింది. దానికి మరికొన్ని కారణాలు ఉన్నా, ప్రధానంగా ప్రచురణ అవకాశాలు లేకనే అనేది నా విషయంలో ఎదురైన అనుభవం! ఐదేళ్ల క్రితమే నాకు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చింది. నాకు నచ్చిన పద్ధతిలో రచనా వ్యాసంగం తిరిగి ప్రారంభించాను!

**కొత్తతరంతో ప్రయాణం కోసమే..**

సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలకంగా ఉన్న లక్ష్యం కొత్త తరంతో ప్రయాణించడానికే. సాహిత్యం, చరిత్ర, కొటేషన్లు, మిద్దెతోట ఆవశ్యకత వంటి అంశాలను కొత్త తరానికి అందించేందుకు ఇదే సరైన వేదిక. అందుకే సామాజిక మాధ్యమంలో సాహితీ సేద్యం చేస్తున్నాను. మొదట్లో మిద్దెతోట నిర్మాణం – నిర్వహణ ఒక సంవత్సరం కాలంలో కూరగాయల మొక్కల పెంపకం గురించి రాస్తూ వచ్చాను. ఆ తరువాత కొటేషన్స్ రాయడం ఆరంభించాను. ఫేస్‌బుక్ పేజీ, వాట్సాప్ గ్రూపు, టెలీగ్రామ్ గ్రూపు రెండింటిని నడుపుతున్నాం. కొత్త పాఠకులను దృష్టిలో పెట్టుకుని 'సీరియల్స్' ప్రారంభించాం. అలా కాలం గడుస్తున్న కొద్దీ అవసరాలు పెరుగుతున్నాయని గమనించి వాటిని తీర్చడానికి ఒక ప్రయత్నం చేయడంతో ఫేస్‌బుక్‌లో అలా విభిన్నమైన శీర్షికలు ప్రారంభం అయ్యాయి. పుస్తక సమీక్షలు, పరిచయాలు, శాస్త్రీయ సంగీతం, సినిమాలు, చరిత్రలు ... ఇలా మరికొన్ని విషయాలు ఆయా రంగాల్లో ప్రావీణ్యం ఉన్నవారు రాస్తున్నారు. ఎక్కువమంది విద్యార్థులు, ఉద్యోగార్థులు పరిచయం అవుతున్నారు. నేను ఎవరినీ గైడ్ చేయాలనుకోవడం లేదు. కానీ విద్యార్థులను ఉద్దేశించి రాస్తున్నాను. నాకు చెప్పాలనిపించిన 'కోట్స్' చెప్తున్నాను. వాటికోసం వచ్చేవారు వస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో నా ఈ సాహితీసేద్యం యువతరం కోసం.

**సంభాషణ : చల్లా మధుసూదనరావు**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**



# దంపూరు నరసయ్య 'ఆంధ్రభాషా గ్రామవర్తమాని'

- ఆచార్య డి.వి శ్రవణ్ కుమార్
94926 34686

విశిష్ట పత్రికా రచయిత, సంపాదకుడు, ఇంగ్లీషు జర్నలిజంలో తొలి తెలుగు వెలుగుగా భావించదగిన దంపూరు నరసయ్యకి తగిన గుర్తింపు లభించలేదనే చెప్పాలి. దంపూరు నరసయ్య సెప్టెంబరు 25, 1849న జన్మించినట్లు ప్రముఖ పరిశోధకులు పెన్నేపల్లి గోపాలకృష్ణ నిరూపించారు. నరసయ్య 1896 దినచర్యలో సెప్టెంబరు 25వ తేదీన తన 48వ జన్మదినమని, తెలుగు తిథుల ప్రకారం మహర్నవమి నాడు తన పుట్టినరోజు వస్తుందని రాసుకున్నట్లుగా జమీన్ రైతు 17-7-1979 సంచికను ఆధారంగా చూపారు. దంపూరు అనే గ్రామం నెల్లూరుకు తూర్పున తుమ్మగుంటకు, వావిళ్లకు దగ్గరగా ఉంది. ఆ ఊరి పేరే వీరి ఇంటిపేరుగా మారింది. ఆ రోజుల్లో కొన్ని దంపూరు కుటుంబాలు మద్రాసులో స్థిర పడ్డాయి. నరసయ్య మద్రాసు పచ్చయ్యప్ప పాఠశాలలో చదువుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పచ్చయ్యప్ప ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగానూ, ఆ తర్వాత నెల్లూరులో ప్రభుత్వోద్యోగం చేశారు. ఆయన మద్రాసులోఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడు రెండేళ్ల పాటు 'నేటివ్ అడ్వకేట్', నెల్లూరులో ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నప్పుడు సంవత్సరం పాటు 'నెల్లూరు పయొనీర్' పత్రికల్ని నిర్వహించాడు. మళ్లీ మద్రాసు వెళ్లిన తర్వాత 1881లో 'పీపుల్స్ ఫ్రెండ్' పత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక 1897 జులై వరకు నడిచింది.

దంపూరు నరసయ్య గారి గొప్పదనాన్ని వెలికి తీసిన పరిశోధకుల్లో ఆద్యుడు బండి గోపాలరెడ్డి (బంగోరె). ఆయన 'నెల్లూరు మండల పత్రికలు' చరిత్ర శోధించి ఒక వ్యాసం రాశారు. ఆ రోజుల్లోనే నెల్లూరు వారపత్రిక 'యూత్ కాంగ్రెస్'లో 'నెల్లూరు మొదటి జర్నలిస్టు దంపూరు నరసయ్య' శీర్షికతో 21-11-1963న ఒక వ్యాసం వచ్చింది. అయితే దాని వ్యాస రచయిత పేరు లభ్యం కాలేదు. ఆ తర్వాత బంగోరె నరసయ్య జీవిత విశేషాలను సేకరించడానికి కృషి చేశాడు. వెంకటగిరి వెళ్లి నరసయ్య మనుమలను కలుసుకుని వివరాలు సేకరించాడు. వాటి ఆధారంగా జమీన్ రైతు పత్రికలో మూడు వ్యాసాలు[1] రాశారు. బంగోరె ఈ పరిశోధనానంతరం మరొక పరిశోధకుడు పెన్నేపల్లి గోపాలకృష్ణ కొనసాగించారు. మిగిలిన వివరాలు, రికార్డులను సేకరించారు. గోపాలకృష్ణ ఈ విధంగా సేకరించిన వివరాలు, ఆధారాలతో జమీన్ రైతులో రెండు వ్యాసాలు[2] రాశారు. ఆ తర్వాత నరసయ్యపై సమగ్రంగా పరిశోధించిన వారు డా.కాళిదాసు పురుషోత్తం. గోపాలకృష్ణ గారి దగ్గర ఉన్న రికార్డునంతా తీసుకుని పురుషోత్తం పరిశోధన ప్రారంభించారు. మద్రాసు, వెంకటగిరి, నెల్లూరు, కోడూరు మొదలుగా ఊళ్లు తిరిగి కొంతమేర మౌఖిక చరిత్ర సేకరించారు. మద్రాసు ఆర్కైవ్స్‌లో 'పీపుల్స్ ఫ్రెండ్' పత్రికలు రెండు సంచికలను సేకరించారు. నరసయ్య నడిపిన తెలుగు పత్రిక 'ఆంధ్రభాషా గ్రామ వర్తమాని'లో ప్రచురించిన వార్తలు, వ్యాసాలకు సంబంధించిన ఇంగ్లీషు అనువాదాలను కాళిదాసు పురుషోత్తం సేకరించారు. ఈ వివరాలు, ఆధారాలు అన్నింటితో ఆయన 'ఇంగ్లీషు జర్నలిజంలో తొలి తెలుగు వెలుగు దంపూరు నరసయ్య' పేరిట ఓ పుస్తకాన్ని ప్రచురించారు.

వ్యాసకర్త : ప్రొఫెసర్-కం-డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం - 517 426.

### ఆంధ్రభాషా గ్రామవర్తమాని

1897 జులై వరకు 'పీపుల్స్ ఫ్రెండ్' ఆంగ్ల పత్రికను కొనసాగించిన దంపూరు నరసయ్య ఆ ఏడాది ఆగస్టులో నెల్లూరుకు వచ్చేశారు. ప్రభుత్వోద్యోగం వదులుకొని పదిహేడేళ్ల క్రితం మద్రాసు వెళ్లిన నరసయ్య ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, భార్య నగలు కూడా తాకట్టు పెట్టి 'పీపుల్స్ ఫ్రెండ్' పత్రికను నడిపారు. అనారోగ్య పీడితురాలైన భార్యను వెంటబెట్టుకుని నెల్లూరుకి చేరాడు. ఇలా నెల్లూరుకి తిరిగి రావడానికి మరో కారణం కూడా ఉంది. ఆయన కుమారుణ్ణి తన అక్క గారైన మీనాక్షమ్మకు దత్తత ఇచ్చాడు. నెల్లూరుకి సమీపంలో కోడూరు గ్రామ పరిసరాల్లో ఆమెకు భూములు న్నాయి. ఆమె అశక్తత వల్ల పొలాలు రుణదాతల వశమయ్యే పరిస్థితి వచ్చింది. ఈ ఆస్తి వ్యవహారాలను చక్కబెట్టడానికి నరసయ్య నెల్లూరులో ఉండవల్సి వచ్చింది. వ్యవసాయం జీవనాధారం అయింది. వ్యవసాయ పనులు చూస్తుండటం వల్ల చుట్టుపక్కల గ్రామాలు, ప్రజలతో పరిచయాలు ఏర్ప డ్డాయి. ప్రజల కష్టసుఖాలు గమనించాడు. పేదల కష్టాలు, భూస్వాముల ఆగడాలు, గ్రామాధికార్ల మోసాలు వంటివన్నీ గమనించాడు. అక్కడి పరిస్థితుల్ని ప్రభుత్వం దృష్టికి, దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికి ఓ పత్రిక అవసరమని భావించాడు. ఎన్ని సమస్యలెదురైనా పత్రిక నడపాలన్న కాంక్ష తీరలేదు. మూడు ఇంగ్లీషు పత్రికలు ప్రచురించిన తన జర్నలిజం అనుభవంతో తెలుగు పత్రికా సంపాదకుడిగా 'ఆంధ్ర భాషా గ్రామ వర్తమాని' అనే పేరుతో 1900వ సంవత్సరంలో వారపత్రికను ప్రారంభించారు.

భాషకు సంబంధించి దంపూరు నరసయ్యకు కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. 1883 నాటికే ఆయన వ్యవహారిక భాషావాది. తెలుగు వ్యావహారిక భాషావాదంపై గ్రాంథిక వాదుల దాడి జరుగుతున్న రోజుల్లో నిర్భయంగా, నిజాయితీగా వాడుక భాషను సమర్థించిన ప్రముఖుల్లో నరసయ్య కూడా ఒకరు. గురజాడ 'కన్యాశుల్కం' నాటక సమీక్షలో, వేదం వేంకటరాయశాస్త్రి పాత్రోచిత భాషను మెచ్చుకుంటూ చేసిన ప్రతాపరుద్రీయ నాటక సమీక్షలోనూ ఈ వ్యావహారిక భాషా పక్షపాతం కన్పిస్తుంది. గ్రామీణ ప్రజల కోసం "ఆంధ్రభాషా గ్రామ వర్తమాని" పత్రిక ప్రారంభించాక ... తనకిష్టమైన ఇంగ్లీషు పత్రికా వ్యాసంగాన్ని వదిలి తెలుగు పత్రికా రంగంలోకి మారారు. తెలుగు పత్రికల చరిత్రలో గ్రామీణ ప్రజల కోసం, పేదరైతుల ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా పత్రికను నడిపిన వారిలో ఆద్యుడయ్యాడు.

"ఆంధ్రభాషా గ్రామ వర్తమాని" సంచికలు ఇప్పుడు లభించడం లేదు. అయితే ఆ పత్రికలోని కొన్ని వార్తలు, వ్యాసాలు, సంపాదక లేఖలు ఆంగ్లానువాద రూపంలో చెన్నైలోని తమిళనాడు ఆర్కియాలజీ శాఖలో ఉన్నాయి. ఆ రోజుల్లో బ్రిటీష్ ప్రభుత్వం దేశ భాషా పత్రికలపై నిఘా ఏర్పాటు చేసింది. దేశ భాషల్లోని పత్రికలను పరిశీలించిన ప్రభుత్వ అను వాదకులు... అవసరమైన విషయాలను అధికారులకు నివేదించేవారు. ఆ నివేదికల్లో పత్రికలకు సంబంధించిన వివరాలు కూడా పొందుపర్చేవారు. ఈ రహస్య నివేదికల వల్ల ఇప్పుడు అనేక పత్రికల స్వరూప, స్వభావాలను గ్రహించ డానికి వీలుపడింది.

### '...గ్రామ వర్తమాని' చర్చించిన కొన్ని విషయాలు

#### రహదార్లు లేని గ్రామాలు :

ప్రతి ఊరికి ప్రధాన మార్గాన్ని కలుపుతూ మంచి రోడ్డు, చుట్టుపక్కల ఊళ్లను కలుపుతూ చక్కటి బాటలు, రోడ్లు వేయాలని నరసయ్య ఆశించారు. గ్రామీణుల సౌకర్యాలను పట్టించుకోకపోవడం వంటి బ్రిటీషువారి పాలనలోని లోపాలను తన పత్రిక ద్వారా ఎత్తి చూపారు. గ్రామాల్లోని రోడ్లను గురించి తన పత్రికలో వివరంగా రాశారు. "వేసవిలో తప్ప పల్లెటూళ్లకు బండిలో ప్రయాణం చెయ్యడానికి బాటలు లేవు. రోడ్లు వెయ్యకుండానే ప్రభుత్వం రైతుల వద్ద రోడ్డు సెస్సు వసూలు చేస్తుంది. ఈ సెస్సులో పాతిక భాగం రైతులకిస్తే, వారే రోడ్లు వేసుకుంటారు. గ్రామాలను ప్రధాన మార్గాలతో కలిపినప్పుడే అవి అభివృద్ధి చెందుతాయి. గ్రామాల్లో భూస్వాములు రైతులకు సహకరించడంలేదు. ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోకపోతే, ప్రభుత్వానికీ భూస్వాములకు తేడా ఉండదు"[3] అని ఒక వ్యాసంలో హెచ్చరించాడు.

#### గ్రామీణ పాఠశాలలు :

గ్రామీణ చదువుల గురించి నరసయ్య తన పత్రికలో తరచూ చర్చించేవారు. స్కూళ్ల ఇన్‌స్పెక్టరుగా పని చేసిన అనుభవం ఉండటంతో విద్యావ్యవస్థపై ఆయనకు చక్కటి అవగాహన ఉ ంది. 500కి పైబడి జనాభా ఉన్న ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, చిన్న గ్రామాల్లో గ్రాంటు స్కూళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్కూలు సెస్సు వసూలు చేసి పాఠశాలలు నిర్వహించాలని కోరాడు. ఎక్కువ మంది జనాభా చదువుకోవడం లేదని బాధపడ్డాడు. గ్రామాల్లో కాస్త తెలివితేటలున్న వారిని ఉపాధ్యాయులుగా నియమించి వారికి జీతభత్యాలు ఏర్పాటు చేయాలని లేదా ఉపాధ్యాయులు విద్యార్థుల దగ్గర ఫీజు వసూలు చేసుకునే అవకాశం ఇవ్వాలని

సూచించాడు. సంవత్సరానికోసారి తనిఖీలు జరిపి అసమర్థులైన ఉపాధ్యాయుల్ని తొలగించాలని 'ఆంధ్ర భాషా గ్రామ వర్తమాని' 9.6.1900 నాటి సంచికలో సూచించాడు.

**గ్రామ న్యాయస్థానాలు :**

1889 ఒకటవ యాక్టు ప్రకారం గ్రామ న్యాయస్థానాలు ఏర్పాటయ్యాయి. ఈ చట్టం ప్రకారం గ్రామాల్లోని చిన్న చిన్న సివిల్, క్రిమినల్ కేసులను విచారించి, పరిష్కరించే బాధ్యతను గ్రామాధికారులకు, గ్రామ మునసబులకు అప్పగించారు. అయితే గ్రామ న్యాయస్థానాల వ్యవస్థ నెల్లూరు జిల్లాలో సరిగా అమలు కావట్లేదని నరసయ్య అభిప్రాయపడ్డారు. ప్రతి పెద్ద గ్రామంలో గ్రామ న్యాయస్థానం ఏర్పాటు చేయాలని, కొన్ని చిన్న చిన్న గ్రామాలను కలిపి ఒక న్యాయస్థానంగా నిర్వహించాలని, మెట్రిక్యులేషన్ పాసయిన వారినే గ్రామ మున్సిఫులుగా నియమించి వారికి సివిలు, క్రిమినలు, రెవెన్యూ పాలన అప్పగించాలని ఆయన తన పత్రిక ద్వారా ఒక ఉద్యమం నడిపారు. "ఈ చట్టం అసలు అమలులో ఉందా? లేదా? సమర్థులైన మున్సిఫులను ఎక్కడ నియమించారు? ప్రభుత్వానికి శిస్తు వసూలయితే చాలు. ఇంకేమీ పట్టదు?" అని తీవ్రంగా విమర్శిస్తూ తన పత్రికలో రాశారు.

**రైతుల పట్ల పత్రిక దృక్పథం :**

పేద రైతుల కష్టాలను దంపూరు నరసయ్య తన పత్రిక ద్వారా వెల్లడి చేశారు. తరచూ కరవు కాటకాలతో రైతులు తల్లడిల్లిపోతున్నారని, గ్రామీణ ప్రజలు రోజురోజుకూ నిరుపేదలుగా మారిపోతున్నారని తన పత్రికలో ప్రముఖంగా ప్రస్తావించాడు. రైతులు శిస్తు చెల్లించే విధానంలో మార్పులు తెచ్చి, వెసులుబాటు కల్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. శిస్తు మొత్తం ఒక్కసారిగా కాకుండా, వాయిదాల పద్ధతిలో వసూలు చేయాలని సూచించాడు. గిట్టుబాటు ధర వచ్చేవరకు ధాన్యం అమ్మవద్దని రైతులకు హితవు చెప్పాడు. "ప్రభుత్వం రైతులను కన్నబిడ్డల వలె చూసుకోవాలి. రైతు నాశనమైతే దేశం నష్టపోతుంది, ప్రభుత్వం నష్టపోతుంది" అని ఆంధ్రభాషా గ్రామ వర్తమాని 23.02.1901 నాటి సంచికలో నాటి ప్రభుత్వాన్ని హెచ్చరించాడు.

అదేవిధంగా రెవెన్యూ వ్యవస్థలోని లోపాల్నీ నరసయ్య సునిశితంగా విమర్శించాడు. "మద్రాసు పరగణాలోని రైత్వారీ విధానం మహా సంక్లిష్టమైంది. ఈ వ్యవస్థ భూకామందులకు, కరణాలకు, రెవెన్యూ అధికారులకు దోచుకోవడానికి అనుకూలమైంది. బొంబాయి పరగణాలో భూమి సర్వే చేయించినట్లు ఇక్కడ కూడా తిరిగి సర్వే చేయించి రైతువారీ విధానంలో సంస్కరణలు ప్రవేశపెట్టాలి. పేద రైతుల దారుణ జీవన స్థితిగతులను పత్రికల ద్వారా తెలుసుకుని ప్రభుత్వం అనుకూలంగా స్పందించాలి"[4] అని రైతుల పక్షాన తన పత్రికలో రాశారు. ఆనాడు అమలులో ఉన్న జమాబందీ విధానాన్ని తీవ్రంగా ఎండగట్టాడు. "రెవెన్యూ అధికారులూ, గ్రామాధికారులూ కలిసికట్టుగా రైతులను కొల్లగొట్టే విధానం జమాబంది" అని ఆంధ్ర భాషా గ్రామ వర్తమాని పత్రికలో (08.09.1900 సంచిక) విమర్శించాడు. రైతులు చెల్లించవలసిన శిస్తులు, సెస్సులు మొదలైన వివరాలు పట్టాల్లో పేర్కొంటారు. ఈ పట్టాలు జారీ చేసే కార్యక్రమానికి మరోపేరు 'జమాబంది'. ఈ జమాబందీ నిర్వహణలోని లోపాలు, రైతులను ఎదుర్కొంటున్న సమస్యలను తన పత్రికలో ప్రచురించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. గ్రామాధికారుల వ్యవస్థని నరసయ్య వ్యతిరేకించారు. గ్రామాధికార్లు, కరణాలు రాసే దొంగ లెక్కలు, వాటివల్ల గ్రామాల్లో రైతులు నష్టపోయిన విధానాన్ని తూర్పారబట్టారు. గ్రామ సేవకుల వెట్టి చాకిరీ, వారి జీతభత్యాల గురించీ ఈ పత్రికలో ప్రస్తావన ఉంది.

**జమీందారీ వ్యతిరేక భావన :**

జమీందారీ రైతుల సమస్యలను 1888లోనే దంపూరు నరసయ్య 'పీపుల్స్ ఫ్రెండ్స్' పత్రికలో ప్రస్తావించారు. నాటి బొబ్బిలి, వెంకటగిరి జమీందార్లు తమ ఎస్టేట్లు అన్యాక్రాంతం కాకుండా తమ పలుకుబడిని ఉపయోగించి 'ఇంపార్టియబుల్ ఎస్టేట్ యాక్ట్'ని తెచ్చుకున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ "వీరి ఎస్టేట్లు సాధారణమైన ఎస్టేట్ల మాదిరే అవసరం ఏర్పడినపుడు విభజించుకోవడానికి వీలుగా ఉండడమే న్యాయం. అలాకాక చట్టం చేసేటట్లయితే ఇనాందార్ల ఇనాములు, సాధారణ పట్టా పొలాలు అన్నీ అవిభాజ్యంగా ఉండేటట్లు చట్టం చెయ్యాలి" అని ఆంధ్రభాషా గ్రామవర్తమాని పత్రికలో 8.12.1900 సంచికలో రాశారు. జమీందారి గ్రామాల్లో గ్రామకరణాల నియామకం, జీతభత్యాల చెల్లింపు, వారిపై అధికారం అంతా జమీందారుల చేతుల్లోనే ఉండేది. అందువల్ల వారు అటు రైతుల్ని, ఇటు ప్రభుత్వాన్ని వంచిస్తూనే ఉంటారని, అందువల్ల గ్రామ కరణాలపై అజమాయిషీ ప్రభుత్వమే తీసుకోవాలని నరసయ్య రాశారు. వెంకటగిరి జమీందారి రైతుల కష్టాలను మొట్టమొదట పత్రిక ద్వారా లోకానికి తెలియజేసిన ఘనత దంపూరు నరసయ్యకే దక్కుతుంది. 'వెంకటగిరి జమీందారీ రైతులు' అనే శీర్షికతో ఆంధ్రభాషా గ్రామ వర్తమాని పత్రికలో ఆయన ఒక వ్యాసం రాశారు. సాగునీరు అందక, పంటలు పండక రైతులు పడ్డ కష్టాల గురించి అందులో వివరించారు. సాగు చేయని పొలాలను అధికారులెవరూ పరిశీలించరని,

శిస్తు మినహాయింపు ఇవ్వకుండా, కఠిన నిబంధనలతో వసూలు చేస్తారని తెలిపారు. ఈవిధంగా రైతుల అసంతృప్తి రగిలి సుమారు ముప్పయి ఏళ్ల తర్వాత జమీందారి వ్యతిరేక ఉద్యమంగా మొదలైంది. ఈ ఉద్యమం నుంచే 'జమీన్ రైతు' పత్రిక ఆవిర్భవించింది. ఈ పరిణామాల దృష్ట్యా జమీందారి రైతులకు ఆసరాగా నిలబడి వారి సమస్యలను లోకానికి చాటి చెప్పిన తొలి పత్రిక 'ఆంధ్ర భాషా గ్రామవర్తమాని' అని చెప్పవచ్చు.

దంపూరు నరసయ్య తన పత్రికలో అనేక స్థానిక సమస్యలపై చర్చించారు. రైతులు పశుసంపదపై ఆధారపడి జీవిస్తారు. అటువంటి పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపకపోతే వ్యవసాయాభివృద్ధి జరగదని రాశాడు. గ్రామాల్లో వ్యాపించిన కలరా, మలేరియా వంటి వ్యాధుల గురించి మందులు అందుబాటులో లేవని, తగిన వైద్య సిబ్బందిని నియమించి గ్రామాల్లో వైద్య సౌకర్యాలు కల్పించారని పత్రికలో పేర్కొన్నాడు. ప్రతి తాలూకాలో ఒక ఆయుర్వేద కళాశాలను ప్రారంభించి అర్హత కలిగిన వైద్యులను తయారు చేయాలని ప్రతిపాదించాడు. నెల్లూరు మునిసిపాలిటీ అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. కృష్ణపట్నం – నెల్లూరు రైలు మార్గ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరాడు.

'ఆంధ్ర భాషా గ్రామ వర్తమాని' ఒక చిన్న స్థానిక వారపత్రికయినా, అనేక జాతీయ, అంతర్జాతీయ విషయాలపై కూడా వార్తలు ప్రచురించేవారు. ఆనాడు ఉప్పుపై కూడా పన్ను వేయడాన్ని నిరసించారు. పేదవాడు గంజిలో వేసుకునే ఉప్పుపై కూడా పన్నువేసి ఎక్కువ ఖరీదుకి అమ్మడాన్ని విమర్శించారు.

**సాహిత్య విషయాలు :**


ఆనాటి ప్రభుత్వానికి దేశ భాషా పత్రికలపై నివేదికలు సమర్పించిన ప్రభుత్వ అనువాదకులు, పత్రికలోని రాజకీయ అంశాలను అనువదించారు గానీ సాహిత్యాంశాల జోలికి వెళ్లలేదు. అందువల్ల సాహిత్యాంశాలు అంతగా లభ్యం కాలేదు. అయితే కొన్ని ఆధారాల వల్ల ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు, సాహిత్య లేఖలు ప్రచురించినట్లు తెలుస్తోంది. వేదం వేంకటరాయశాస్త్రి గారు తన మిత్రుడైన పూండ్ల రామకృష్ణయ్యకు రాసిన లేఖలో, తన ప్రతాప రుద్రీయ నాటకాన్ని ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో సమీక్షించిందెవరో తెలుసుకోవాలని రాశారు. అందుకు రామకృష్ణయ్య రాసిన సమాధానపు లేఖ ద్వారా ప్రతాప రుద్రీయ నాటక పుస్తక సమీక్ష అందులో ప్రచురితమైనట్లు తెలుస్తోంది. ఇంకా నాటక ప్రదర్శనలపైనా, సమకాలీన పత్రికలపైనా ఆంధ్రభాషా గ్రామ వర్తమానిలో సమీక్షలు ప్రచురించినట్లు తెలుస్తోంది. వేదం వేంకటరాయశాస్త్రి మిత్రులు స్థాపించిన ఆంధ్రభాషాభిమాన సమాజం కార్యక్రమాలపై పత్రికల్లో వెలువడిన సమీక్షలను ఒక చిన్న కరపత్రంగా 1900 సంవత్సరంలో ప్రచురించారు. ఈ సంస్థ ప్రదర్శించిన వేదం వారి శాకుంతల నాటక ప్రదర్శనపై ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో వచ్చిన సమీక్షలో కొంత భాగం ఆ కరపత్రంలో చేర్చారు. పూండ్ల రామకృష్ణయ్య గారి 'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రికను ప్రశంసిస్తూ నరసయ్య ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో 'పేట్రియట్' పేరుతో ఒక సమీక్ష చేశారు. అందులోని రెండు వాక్యాలను ఇతరుల అభిప్రాయాలు అనే పేరుతో అముద్రిత గ్రంథ చింతామణి ప్రచురించింది. ఇటువంటి కొన్ని ఆధారాల వల్ల కొన్ని సాహిత్యాంశాలు కూడా ఈ పత్రికలో ఇచ్చేవారని తెలుస్తుంది.

'ఆంధ్రభాషా గ్రామ వర్తమాని' సంచికలు నేడు లభ్యం కాకపోయినా, ఈ విషయంలో అనుపమానమైన పరిశోధన చేసిన బంగోరె, పెన్నేపల్లి గోపాలకృష్ణ, డా. కాళిదాసు పురుషోత్తంల కృషి వల్ల ఇంత సమాచారం వెలుగు చూసింది. ఈ పరిశోధకులకు హృదయపూర్వక అభినందనలు. ఏదిఏమైనా తొలితరం పత్రికా సంపాదకుల్లో దంపూరు నరసయ్య చిరస్మరణీయుడు.

**పాద సూచికలు :**

1. 'బంగోరె కూనిరాగాలు – ఇతర రచనలు', యువజన లలిత కళాసమాజం, నెల్లూరు, 1983 ప్రచురణలో మూడు వ్యాసాలున్నాయి.
2. 'దంపూరి నరసయ్య – మరికొన్ని జీవిత శకలాలు', జమీన్‌రైతు పత్రిక, 6–7–1979; 'దంపూరి నరసయ్య జీవిత చరిత్రలో ప్రధానమైన ఘట్టాలను తెలియజేసే రెండు డైరీలు – రెండు జాబులు', జమీన్ రైతు పత్రిక, 13–7–1979
3. ఆంధ్రభాషా గ్రామవర్తమాని, తేదీ : 5.5.1900 సంచిక
4. ఆంధ్రభాషా గ్రామ వర్తమాని, తేదీ : 20.10.1900 నాటి సంచిక

■



# గుంటనక్కలు

దొండపాటి కృష్ణ
90523 26864

**ఒ**క్కసారిగా ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది స్వప్న. బెడ్ లైట్ వెలుతురులో రాత్రి రెండున్నర గంటల సమయాన్ని చూపిస్తోంది గడియారం. మొబైల్ చేతిలోకి తీసుకుని సమయాన్ని చూస్తే అదే సమయం! తనని కలవరపాటుకు గురిచేసింది ఒక కల అని నిర్ధారించుకుంది. తనకు ఎదురైన సంఘటనలు కలగా వస్తున్నాయో లేక కలగా వచ్చిన సంఘటనలు నిజ జీవితంలో ఎదురవుతున్నాయో అర్థంకాని అయోమయ స్థితిలోకి వెళ్ళిపోయింది.

ఆ ప్రాంతం గుండా ఆఫీసుకు వెళ్ళాలంటే స్వప్నలో రోజురోజుకు ఏదో తెలియని శక్తి వెనక్కి లాగుతుండేది. రాత్రిళ్ళు సరిగ్గా నిద్రపోవడం లేదు. రాన్రాను ఆమె ప్రవర్తనలో మార్పు రావడాన్ని గమనించిన ఆమె తండ్రి సత్యనారాయణ ప్రేమగా ఆమె తల నిమురుతూ కారణమడిగాడు. విషయాలన్నింటినీ చెప్పింది స్వప్న.

"ఏమీ చేయకుండా రెండు నెలలనుంచి నీకోసమే వాళ్ళెందుకు తిరుగుతార్రా? భయంతో అలా మాట్లాడుతున్నావ్. అంతే... ఇలాంటివి ఉంటాయనే ఆఫీస్ క్యాబ్‌లలో వెళ్ళమన్నా. నువ్వేమో టైం వేస్టవుతుందని స్కూటీ కొనుక్కున్నావ్..." ఆమె చెప్పింది విన్నాక అన్నాడు తండ్రి.

"నేను చెప్పేది నిజం నాన్నా... అలాంటివాళ్ళు గుంట నక్కల్లా మాటు వేస్తారు. ఈ న్యూస్ చూడండి. పాపం ఆ డాక్టర్ దిశ ఏం చేసింది? ఆమెను అత్యాచారం చేసి క్రూరంగా చంపేశారు. ఇప్పుడు దేశమంతా గొడవ చేసినా ఆమెను తిరిగి తీసుకురాగలరా? పదండి నాన్నా... వాళ్ళమీద కంప్లయింట్ ఇద్దాం." టేబుల్ మీదున్న పేపరును చూపిస్తూ లేవబోయింది స్వప్న.

"ఆధారాలు లేకుండా కంప్లయింట్ ఏమని ఇస్తావ్? నీ వెంట పడుతున్నారనా? వాళ్ళను చూస్తుంటే నీకు భయం వేస్తుందనా? చూడరా చిన్నీ... ఆ రోజు నీ బండి యాక్సిడెంట్‌కి గురవ్వడం, ఆ సంఘటన రోజూ కలగా రావడంతో నీకు భయం పట్టుకుంది. నిన్నెవరో అనుసరిస్తున్నారనే భ్రమలోకి వెళ్లిపోయావ్. ఇలాంటి న్యూస్లు పేపర్లో చదివి మరింత భయపడుతున్నావ్. అంతేకాని నువ్వనుకుం టున్నట్లు ఏం లేదు. నిశ్చింతగా ఉండు. నేనున్నా కదా..." అంటూ ధైర్యాన్నిచ్చాడు.

సమస్య వస్తుందనుకున్నప్పుడు ముందే నివారణ చర్యలు తీసుకోవాలి. అలా కాకుండా సమస్య వచ్చాక సరిదిద్దుదాం అనుకుంటే సరిపోదు. ఒకవేళ అది సరిద్దిద్దుకోలేని తప్పయితే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లే అవుతుందని ఆమె బాధ.

"అది కాదు నాన్నా... నేను చెప్పేది నిజం." అంటూ నచ్చజెప్పడానికి ప్రయత్నించింది.

"అంతలా భయపడకరా! నీకీ నాన్న ఉన్నాడు. నువ్వు ధైర్యంగా ఉండు." అంటూ సమాధానపరచడంతో స్వప్న మౌనంగా ఉండిపోయింది.

"రమణత్త నిన్ను కోడల్ని చేసుకుంటానని అడిగిందిరా... ఏం చెప్పమంటావ్?" టాపిక్కు మారుస్తూ అడిగాడు.

"నేను చెప్పేది నమ్మకుండా దాన్ని నా పెళ్ళితో ముడిపెడుతున్నారు కదా! అర్థమైందిలే..." నిట్టూర్చుతూ సోఫాల్లోంచి లేచి విసురుగా తన గదిలోకి వెళ్ళిపోతున్న స్వప్న వైపే చూస్తుండిపోయాడు సత్యనారాయణ.

స్వప్న ఒక్కతే కూతురు కావడంతో చిన్నప్పట్నుంచి గారాబంగా పెంచారు. ఆమెకే కష్టం తెలీకుండా ముందే అన్నీ సమకూర్చారు. నలుగురిలో ఎక్కువగా కలిసే పరిస్థితి రాలేదు. భద్రత అనే ఒంటరితనంలో పెరిగింది. ఈమధ్యనే యాక్సిడెంట్ జరగడంతో ఉన్నట్లుండి భయపడుతుంది. కూతురు

చెప్పిన విషయాన్ని ఆమె ముందు తేలిగ్గా పరిగణించినా ఒక తండ్రిగా మథనపడుతూనే ఉన్నాడు. కూతురు చెప్పినట్లు జరగకూడదని కోరుకుంటూనే ఉన్నాడు.

భర్త అంతరంగాన్ని ఎరిగిన యమున, "ఎందుకంతలా కంగారు పడిపోతున్నారు? పెళ్లికేం తొందరొచ్చిందిప్పుడు?" అనడిగింది.

"కంగారు పడట్లేదు. జాగ్రత్త పడుతున్నాను."

"నా దగ్గరో ఉపాయం ఉంది. అమ్మాయికి నేను చెప్తాలే!" అంది.

"చెప్పి చూడు. పెళ్ళికి కూడా ఒప్పించు. పెళ్ళైతే అన్నీ సర్దుకుంటాయి." అనడంతో ఆమె ఇంకేం మాట్లాడలేక పోయింది.

మరుసటి రోజున, తనకి తోడుగా సహోద్యోగిని మౌనికని తీసుకెళ్లాలని నిర్ణయించుకుంది స్వప్న. ఆమెకి ఫోన్ చేసి విషయం చెప్పింది. ఆటోల్లో ప్రయాణం చేయలేక ఇబ్బంది పడుతున్న మౌనికకి, నోట్లో చెక్కెర వేసుకున్నంత తియ్యగా అనిపించి వెంటనే ఒప్పేసుకుంది. మౌనిక తోడుగా రావడంతో స్వప్నలో కొండంత ధైర్యం వచ్చింది. వారం రోజులపాటు స్వప్నకు నైట్ షిఫ్ట్, మౌనికకి డే షిఫ్ట్ వేసింది కంపెనీ. ఇద్దరికీ ఒకే షిఫ్ట్ వేయమని అడిగినా మిగతావారు సెలవుల్లో ఉన్న కారణంగా అలా వేయడం కుదరదన్నారు. చేసేదిలేక నైట్ షిఫ్ట్ డ్యూటికి ఆరోజు రాత్రి పదింటికి బయలుదేరింది స్వప్న. వెళ్ళేదారిలో ఒక కిలోమీటర్ దూరం నిర్మానుష్యంగా ఉంది. వీధి లైట్లు వెలగడంలేదు. కీచురాళ్ళ శబ్దాలు భయపెడుతున్నాయి.

భయంగా వెళ్తున్న ఆమె బండిని ఆపి, తాళాలు లాక్కున్నారు ఇద్దరు. ఆ హఠాత్పరిణామానికి ఆమె బిగుసుకుపోయింది. తేరుకుని బిగ్గరగా అరవబోయింది. గట్టిగా పట్టుకుని ఆమె నోరు నొక్కేశారు వాళ్ళు.

"అరిచావో... ఈ చున్నీతో గొంతు నొక్కేస్తా. చచ్చిపోతావ్. కోపరేట్ చేస్తే తొందరగా పని అయిపోద్ది" చెవిలో చెప్పి, నోటిపైనున్న అతని చేతిని మెల్లగా తీశాడు ఒకడు.

"ప్లీజ్ అన్నయ్యా... నన్నేం చేయొద్దు. నన్ను వదిలేయండన్నయ్య... ప్లీజ్ అన్నయ్యా..." కన్నీళ్లు పెట్టుకుంటూ ప్రాధేయపడింది.

"ఏంటి... వరసలు కలుపుతున్నావ్? 'అన్నయ్యా' అంటే వదిలేస్తాం అనుకుంటున్నావా? మేం అన్నయ్యలం కాదు కన్నయ్యలం! మేం ఎవ్వరికీ చెప్పం. నువ్వూ ఎవ్వరికీ చెప్పొద్దు. ఒరేయ్... ఎవరన్నా చూస్తారు బండిని పక్కనున్న పొదల్లోకి లాగేయ్..." కరగని వాళ్ళ కర్కశత్వపు మనసు పైశాచికానందంతో గంతులేస్తోంది.

"చిన్న అన్నయ్యా... వదిలేయమని నువ్వైనా చెప్పన్నయ్యా! ప్లీజ్ అన్నయ్యా... వదులూ... నా బ్యాగ్... నా హ్యాండ్‌బ్యాగ్... దాన్ని ఏం చేయొద్దు..." అని వేడుకుంది. 'హ్యాండ్ బ్యాగ్' అని ఒత్తి పలకడంతో ఆమె మొహాన్ని చున్నీతో చుట్టేసి, "ఒరేయ్... ముందా హ్యాండ్ బ్యాగ్లో ఏముందో చూడు. ఈ సాఫ్ట్వేర్ వాళ్ళు హైటెక్ తెలివితేటలు వాడతారు." ఇంకొకతనికి పురమాయించాడు.

బ్యాగ్ లాక్కొని, జిప్ తీసి "ఫోను, విస్పర్ ప్యాకెట్లు ఉన్నాయన్నా..." అంటూ బ్యాగును అటూ ఇటూ తిప్పాడతను.

"ప్లీజ్... నా ప్యాకెట్స్ నాకిచ్చెయ్యండి..." బతిమాలుకుంటోంది స్వప్న.

"లైవ్ లొకేషన్ షేర్ పెట్టిందేమో ఫోన్ స్విచ్ ఆఫ్ చెయ్... ఆ ప్యాకెట్స్‌లో ఏమున్నాయో చెక్ చెయ్. లేకపోతే దొరికిపోతాం..." కంగారుపెట్టాడొకడు. అతని బందీ నుంచి తప్పించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది స్వప్న. చున్నీతో చుట్టేయ్యడంతో ఆమె మెడంతా కందిపోయింది. తోపులాటలో ఆమె బట్టలు నలిగిపోయాయి. అతను ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, ఒక విస్పర్ ప్యాకెట్ చించాడు. ఆ ప్యాకెట్లో ఉన్న పౌడర్ ఒక్కసారిగా బయటకు చిమ్మి, పక్కనే ఉన్న వాళ్ళిద్దరి మొహాల మీద పడింది.

ప్రమాదకరమైన ఆ పౌడర్ కొన్ని రసాయనాల మిశ్రమం కావడంతో క్షణాల్లో వాళ్ళ మొహం కాలిపోయింది. ఆమె తన మొహాన్ని చున్నీతో కప్పుకోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకుంది. ఆ బాధను తట్టుకోలేక ఆమెను వదిలేశాడతను. ఇంతసేపూ వాళ్ళ అరాచకాన్ని భరించింది ఈ క్షణం కోసమే! అదే అదునుగా వాళ్ళ నుంచి బండి తాళాలు లాక్కొంది స్వప్న. 'నిజంగానే హైటెక్ తెలివితేటలు వాడిందిరా...' అంటూ ఏడ్వడం మొదలెట్టారు వాళ్ళు.

రోడ్డు మలుపు దగ్గరికి వెళ్ళగానే బండాపి, వెనక్కి తిరిగి చూసింది. 'అమ్మా... అమ్మా... అంటూ బిగ్గరగా అరుస్తున్నారు వెధవలు! వాళ్ళ అమ్మ కూడా ఒకప్పుడు నాలాంటి అమ్మాయేనని గుర్తించని మృగాలు! స్వగతంగా మనసులో తిట్టుకుంటూ చుట్టూ చూసింది. ఆ చీకట్లో, ఆ సమయంలో క్రిమికీటకాలు తప్ప ఎవ్వరూ సంచరించడం లేదు.

ఇంటి వరండాలో బండి పార్కింగ్ చేసి వెక్కివెక్కి ఏడుస్తూ లోపలికొచ్చింది. అప్పుడే తలుపులన్నీ వేయబోతున్న యమున, వెనక్కి తిరిగొచ్చిన కూతుర్ని చూసి కంగారుపడింది. దగ్గరికి తీసుకుని సోఫాలో కూర్చుంది.

"ఏమైందమ్మా? ఆఫీసుకు వెళ్ళకుండా వచ్చేసావేం?" అనునయంగా అడిగింది.

అలికిడికి కంగారుగా లోపలనుండి వరండాలోకొచ్చాడు సత్యనారాయణ. ఏడుస్తున్న కూతుర్ని, ఓదార్చుతున్న భార్యను చూసి నిర్ఘాంతపోయాడు. రాత్రి 11 కావొస్తుండడంతో ఆ వీధి మొత్తం తలుపులు మూసేసుకుంది. టీవీల చప్పుళ్ళే విని పిస్తున్నాయి.

"నేను చెప్తే నమ్మలేదుగా! అమ్మ చెప్పిన ప్లాన్ వర్కౌటయ్యింది కాబట్టి సరిపోయింది. లేకపోతే..." అంటూ వాళ్ళు అడ్డగించింది, వాళ్ళను ధైర్యంగా తిప్పికొట్టిన వైనం మొత్తం చెప్పింది స్వప్న.

ఏదైతే జరగకూడదని మథనపడుతున్నాడో అదే జరగడం అతన్ని కృంగదీసింది. కూతురినలా చూసి కంటతడి పెట్టు కున్నాడు. తదుపరి నిర్ణయం తీసుకున్న వాడిలా, "పదా పోలీస్ స్టేషన్‌కెళ్దాం. అక్కడా వెధవలు గిలగిల కొట్టుకుంటుంటారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టిద్దాం" అన్నాడు సత్యనారాయణ.

ఉలిక్కిపడిన యమున, "ఆగండి! జరిగిందేదో జరిగి పోయింది. ఇక వదిలేయండి. పోలీస్ కేసంటే అల్లరైపోతాం. అదృష్టం బాగుండి అమ్మాయికేం కాలేదు. ఏం జరగనట్లే ఉ ందాం..." సగటు తల్లిగా అంది.

"అదేంటి యమునా.. ఇంత జరిగితే కంప్లయింట్ వద్దంటావ్. ఇది మనసులో పెట్టుకుని వాళ్ళు మళ్ళీ అడ్డగిస్తే?" అన్నాడు.

''ఇక్కడితో వదిలేయండి. మనం వేరే ఇంటికి మారిపోదాం..." భయపడుతూ అంది యమున.

"ఎందుకంతలా భయపడతావ్?" అడిగాడు.

"భయపడట్లేదు. జాగ్రత్త పడుతున్నాను" అందామె.

"ఇలా అనుకోబట్టే ఇలాంటివాళ్ళు రెచ్చిపోతున్నారు. ఆడది అబల కాదు సబల అని, గుంటనక్కలపై పులి పంజా విసురుతుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఒకరు ముందడుగేస్తే మిగతా వాళ్ళూ అదే బాటలో పయనిస్తారు. ఆడపిల్ల ఒక్కతే బయట తిరగాలంటే భయపడిపోయే రోజులు మళ్ళీ వచ్చేశాయి. కూతుర్ని సమాజానికి బలివ్వకూడదని ఒక తల్లిగా జాగ్రత్తలు చెప్పి ఆ వెధవల నుంచి కాపాడావు. నేను వాళ్ళను పట్టించి, ఇటువంటి వాటికి చరమగీతం పాడతాను. ఏరా చిన్నీ... నువ్వేమంటావ్?" అంటూ కూతురి నిర్ణయాన్ని అడిగాడు సత్యనారాయణ.

"పదండి నాన్నా..." అంటూ తండ్రి చేతుల్ని పట్టుకుని అడుగు ముందుకేసింది స్వప్న.

■



## ఉక్కపోత


- వి.రాజగోపాల్

91330 84262


ఇక్కడంతా
ఉక్కపోతగా వుంది
ఊపిరి సలపనివ్వని
విపత్తుల మధ్య
చిక్కుకున్నట్టుగా వుంది

పెట్రోలుకు
రెక్కలు తొడిగినప్పుడు
నిత్యావసరాలు
చుక్కల చాటున నక్కినప్పుడు
గ్యాసు బండను గుదిబండగా
మార్చినప్పుడు
మూలన ముడుచుకు
తొంగున్న కట్టెల పొయ్యి
వెటకారపు నవ్వులు రువ్వినప్పుడు
ఇంతుల కంట కన్నీరు వొలికినప్పుడు

సంసారంలో సలపరం పుడుతున్నది
బతుకు బండికి శోషొచ్చి
సంకటాన పడుతున్నది
గొంతు బిగించి గొడవకు దిగక పోతే
గోల గోల చేసి గంగవెర్రులెత్తించకపోతే
ఏలినోడి తిక్క కుదిరేటట్టు లేదు
ఈ ఉక్కపోతకు ఉపశమనం
దొరికేటట్టూ లేదు!
అందుకే... గొడవకు సిద్ధమవుదాం
కదలండి...
గోల చేసి గోడు వినిపిద్దాం నడవండి. ■

నివాళి




# నిలువెత్తు తెలుగుదనపు కథకుడు సింగమనేని

26.6.1943 - 25.2.2021

**తె**లుగు కథకు తెల్లని ఖద్దరు పంచె కట్టి తెల్లని ఇస్త్రీ నలగని చొక్కా వేసి, చేతిలో చిన్న రుమాలు కళ్ళకు కళ్ళజోడు పెడితే ఆ రూపం పేరు సింగమనేని నారాయణ. కొందరు వ్యక్తులతో మాట్లాడుతుంటే మన దగ్గర బంధువులతో మాట్లాడినట్టు చాలా ఆత్మీయంగా అనిపిస్తుంది. సింగమనేనిని చూస్తే నాకు అలాగే అనిపించింది. 20 ఏళ్ల కిందట నేను కెసిపి సిద్ధార్థలో పని చేస్తున్న కాలంలో ఆయన్ని మొదటిసారి కలిశాను. 2001 జనవరిలో మా పాఠశాలలో, సిబిఎస్ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం ఒకటి ఏర్పాటు చేయాలని ప్రణాళిక తయారు చేసుకున్నాను. ఆ శిక్షణ శిబిరంలో మాట్లాడడానికి కేతు విశ్వనాథ రెడ్డి గారిని, నాగభైరవ కోటేశ్వర రావు గారిని ఆహ్వానించాను. అందుకు ప్రధాన కారణం ఒకటి నుంచి ఐదవ తరగతి వరకూ తెలుగు పాఠ్యపుస్తకాలకు నాగభైరవ కోటేశ్వరరావు, 6 నుంచి 10వ తరగతి వరకు కేతు విశ్వనాథరెడ్డి ప్రధాన సంపాదకులుగా ఉన్నారు. ఆ పాఠ్యాంశాలను నిర్ణయించేటప్పుడు సంపాదకుల విధాన నిర్ణయాలు ఉపాధ్యాయులకు తెలియజేయడం వల్ల వారు లక్ష్యాలను సులువుగా విద్యార్థులకు చేర్చగలుగుతారనే భావనతో ఏర్పాటు చేశాను. అయితే కారణాంతరాల వల్ల నాగభైరవ గారు రాననడం, అదే రూమ్‌లో ఉన్న సింగమనేని గారిని తీసుకు వెళ్ళమని ఆయన చెప్పడం, సింగమనేని గారు సరేనని రావడం, రెండు రోజులు జరిగిన ఆ శిక్షణా శిబిరంలో దాదాపు పదవీ విరమణకు సమీపంలో ఉన్న ఆయన తన అనుభవాలను, పాఠ్యాంశాల నిర్ణయంలోని లక్ష్యాలను, గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు, పట్టణ ప్రాంతంలోని విద్యార్థులకు మధ్య ముఖ్యంగా తెలుగు భాషా బోధనలో తీసుకోవాల్సిన అనేక అంశాలను వివరంగా ఉపాధ్యాయులకు అందించారు. అభ్యుదయ దృక్పథంతో పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించాల్సిన అవసరం కూడా ఉదాహరణలతో ఉపాధ్యాయులకు వివరించారు. మార్క్సిస్టు భావజాలంతో అనంతపురం గ్రామీణ ప్రాంత ప్రజల కథలు చెప్పిన సింగమనేని మాకు అప్పుడు సరికొత్త ఉపాధ్యాయుడిగా కనిపించారు. ఆయన మాటతీరు, వేషధారణ చూసిన నాకు ఎందుకో ఆయనను 'నాన్న' అని పిలవాలనిపించింది.

కథకుడుగా సింగమనేని తెలుగు కథా సాహిత్యంలో అత్యున్నత స్థాయిలో నిలిచిన వ్యక్తి. కథాశిఖరంగా భావించే ఆయన రాసిన కథలు రాశిలో తక్కువే. మొత్తంగా 50కి పైగా కథలు మాత్రమే ఆయన రాశారు. కానీ రాసిన ప్రతి కథా నిలిచిపోయే కథే. ఈ కథలన్నీ నాలుగు సంపుటాలుగా జూదం (1988), సింగమనేని నారాయణ కథలు (1999), అనంతం (2007), సింగమనేని కథలు (2012) పేరిట వెలువడ్డాయి. ఆయన తొలి కథ "న్యాయమెక్కడ" 1960లో కృష్ణా పత్రికలో ప్రచురితమైంది. అనంతపురం కరువు సీమ జీవన యాతన ఈ లోకానికి తన కథల ద్వారా ఎత్తిచూపిన వాడు సింగమనేని. వాస్తవ జీవన చిత్రణతోపాటు, అనంతపురం మాండలికపు రుచిని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. కథనం ప్రామాణిక భాషలోనూ, సంభాషణలు మాండలికంలో రాయడం ఆయన ప్రత్యేకత. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన

ఆయన తన మూలాల్ని, రైతు జీవన స్థితిగతులను తన కథల్లో వ్యక్తంచేశారు. *అడుసు, దృశ్యము– అదృశ్యమూ, ఒక గతి – ఒక శృతి, అవాస్తవికత, పరీక్షిత్తు, తరగతిగదిలో తల్లి, యక్షప్రశ్నలు, మకర ముఖం* ఇలాంటి కథలు చిరకాలం నిలిచి ఉండే కథలు. సింగమనేనికి తెలిసిన జీవితం ఒకటి రాయలసీమ కరువు జీవితం, రెండు ఉపాధ్యాయ వృత్తితో కూడిన జీవితం. ఈ రెండింటిని చాలా అద్భుతంగా తన కథల్లో ప్రతిబింబించారు. *తరగతి గదిలో తల్లి* కథను పరిశీలిస్తే .. ఉపాధ్యాయుడు పిల్లలకు పాఠాలు బోధించే క్రమంలో సామాజిక అంశాలను, స్త్రీ పురుష అసమానతలలోని వైరుధ్యాలను, ఎదిగే దశలో పిల్లలు అలవర్చుకోవల్సిన అలవాట్లను గొప్పగా చిత్రీకరించిన విధానం కని పిస్తుంది. ఆ కథలోనో ఆదర్శ ఉపాధ్యాయునికి ఉండవలసిన మార్గదర్శకాలు కూడా గోచరిస్తాయి. మకరముఖం కథలో రిజర్వేషన్ నేపథ్యంలో దళితుల మానసిక వేదనను వ్యక్తం చేశారు. నీకు నాకు మధ్య నిశీధి కథలో మధ్యతరగతి స్త్రీలపై జరుగుతున్న హింస దౌర్జన్యాలు లాంటి అంశాలు కనబడతాయి.

సింగమనేని రాయలసీమ ప్రాంతంలో జరిగిన అనేక సామాజిక ఉద్యమాలతో పాటు తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమంలో కూడా చురుకుగా పాల్గొన్నారు. మహాప్రస్థానం పుస్తకాన్ని నిలువెత్తున ప్రచురించి ఏనుగు మీద ఊరేగించాలని శ్రీశ్రీ తన అనంతంలో రాసుకున్నాడు. నిలువెత్తు కాకపోయినా పెద్ద పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురించాలని సాహితీ మిత్రులు విజయవాడ వారు ప్రయత్నం ప్రారంభించారు. ఆ పుస్తకాన్ని సింగమనేనితో ఆవిష్కరింపచేయాలని శ్రీశ్రీ విశ్వేశ్వరరావు ఆకాంక్షించారు. ఆ ఆకాంక్ష నెరవేర్చకుండానే సింగమనేని వెళ్లిపోయారు. తెలుగు కథా శిఖరం కూలిపోయింది. ఆయన వారసత్వాన్ని ముందు తరాలకు అందించడమే మనం ఆయనకు ఇవ్వగల నివాళి.

– బండ్ల మాధవరావు

88976 23332

# ప్రముఖ రచయిత పోరంకి దక్షిణామూర్తి కన్నుమూత



ప్రముఖ రచయిత, వ్యాసకర్త డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి (86) ఫిబ్రవరి 6వ తేదీన హైదరాబాద్ చైతన్యపురిలోని తన ఇంట్లో కన్నుమూశారు. తెలుగు అకాడమీ ఉప సంచాలకునిగా పనిచేసి 1993లో ఉద్యోగ విరమణ చేసిన ఆయన అనేక నవలలు, కథలు, కథానికలు, పరిశోధనా వ్యాసాలు రాశారు. 'వెలుగు వెన్నెల గోదావరి' నవలను ఉత్తరాంధ్ర, 'ముత్యాల పందిరి' నవలను తెలంగాణ, 'రంగవల్లి' నవలను రాయలసీమ మాండలికాల్లో రాశారు. పరమహంస యోగానంద రాసిన 'యాన్ ఆటో బయోగ్రఫీ ఆఫ్ సెయింట్' అనే పుస్తకాన్ని దక్షిణామూర్తి 'ఒక యోగి ఆత్మకథ' పేరిట అనువదించారు.

దక్షిణామూర్తి 1935 డిసెంబర్ 29న తూర్పు గోదావరి జిల్లాలోని ఆలమూరులో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసి, అక్కడే తెలుగు శాఖ రీడర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1969లో తెలుగు అకాడమీకి బదిలీ అయ్యారు. ఆ సమయంలో పలు నిఘంటు నిర్మాణాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. వృత్తి పదకోశం రూపకల్పనలో ప్రఖ్యాత భాషావేత్త భద్రిరాజు కృష్ణమూర్తికి సహాయకుడిగా పనిచేశారు. 40 వేల పదాలతో 'ఇంగ్లీషు– తెలుగు– ఇంగ్లీషు' నిఘంటువును సంకలనం చేశారు. తెలుగు కథానిక స్వరూప స్వభావాలపై సిద్ధాంత వ్యాసం రచించి డాక్టరేట్ పట్టా పొందారు. పాఠ్య పుస్తకాల రూపకల్పనలోనూ ముఖ్య భూమిక పోషించారు. కథలు, నవలలు, పరిశోధనా వ్యాసాలతో కలిపి సుమారు 40 పుస్తకాలు రచించారు. లెక్కకు మిక్కిలిగా అనువాదాలు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కమిటీకి సభ్యుడిగానూ ఆయన పని చేశారు. తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన ఆయన కొండేపూడి సాహితీ సత్కారంతోపాటు అనేక పురస్కారాలు అందుకున్నారు. దక్షిణామూర్తికి సతీమణి వరలక్ష్మి, కుమార్తె శ్రీబాల, కుమారులు రమణ ప్రసాద్, సత్యమూర్తి ఉన్నారు.





# ప్రాణం ఉన్నంతవరకూ ... అదే ఆశయం.. అదే ఆదర్శం

- కవిత శ్రీ
94946 96990

**తె**లుగు సాహిత్య రంగంలోకి లేటుగా ఎంట్రీ ఇచ్చిన ఆరు పదుల లేటెస్ట్ కుర్రాడు షేక్ అహమద్ బాష. ప్రేమ, కిడ్నాప్ తర్వాత ఆయన కలం నుంచి వచ్చిన నవల 'ప్రాణం ఉన్నంత వరకు'. ఈ పేరుకు 'ఆమె వ్యక్తిత్వం మారదు' అనేది ఉప శీర్షిక. దీనిని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించారు. పుస్తకం మొదట్లోనే 'ఆహ్వానం' పేరుతో మధురాంతకం నరేంద్ర సమగ్రంగా రాసిన సమీక్షలో నుంచి 'నరేంద్ర గారు సున్నితంగా చేసిన కొన్ని సూచనల్ని పట్టించుకుంటే మీ రచన మరింత మెరుగుపడగలదు' అని ఒక ఉచిత సలహా పడేసి విమర్శ రాసే కష్టం నుంచి చేతులు దులుపుకుందామని ముందే ప్రణాళిక వేసుకున్నాను. కానీ ఈ రచయిత కిడ్నాప్ నవలలో కనబడిన ఇరవైరెండేళ్ళ కుర్రాడికి ఉండేంత ఆవేశంతో బాటు ప్రస్తుత రచనలో అరవైయారేళ్ళ పెద్దమనిషికి ఉండే సంయమనం రంగరించి ఒక గొప్ప సృజన చేశారు. సాహిత్య పరమ ప్రయోజనాలైన కళ్ళని చెమ్మగిల్ల జెయ్యడం, రమణీయమై ఔరా అనిపించడం లాంటి సందర్భాలు విరివిగా తారసిల్లాయి. ఎన్నో సందేశాలు ఉన్నాయి. నవలా లక్షణమైన సంపూర్ణ జీవిత చిత్రణ అనేది కూడా చాలావరకూ నెరవేరింది. దీంతో, నా ముందస్తు ప్రణాళిక తారుమారైంది. ఇప్పటి సాహిత్య విమర్శకుల్లో కొందరు సమస్యని ప్రతిపాదించడమే రచయిత కర్తవ్యమని వాదిస్తున్నారు. సమస్యని ప్రతిపాదించడంతో రచయిత పని ఐపోదని, దానికి పరిష్కారం కూడా చూపించాల్సిన బాధ్యత రచయితపై ఉందని మరికొందరు ప్రగతిశీలవాదులు గట్టిగా వాదిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో సమస్యా ప్రతిపాదనతో బాటు పరిష్కారాన్ని కూడా చూపిస్తున్న ఈ నవలని ఇంకా అనేక కారణాల వల్ల తప్పకుండా చర్చించుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రాణం ఉన్నంత వరకూ నవల పుట్టుకకు స్పష్టమైన కారణాలు, లక్ష్యాలు ఉన్నాయి. భారతీయ సమాజంలో వేళ్ళూనుకున్న నిచ్చెనమెట్ల వ్యవస్థ, స్నేహాభావం, ప్రేమరాహిత్యం, కుటిలప్రేమలు, కులగజ్జి, మతపిచ్చి, జాత్యహంకారం, శ్రమదోపిడీ, అవినీతి, సంకుచితత్వం, పక్కవారి ఆహారాన్ని ఆహార్యాన్ని చూసి ఓర్వలేనితనం, అసహనం, విశాలమైన దఅక్పథ లేమి, విచక్షణ లేని విద్యావిధానం, లాభాలు తప్ప ఇంగితం లేని కార్పొరేటు మనస్తత్వం, సరైన దిశగా పయనించని అనారోగ్యకరమైన ప్రపంచీకరణ, వీటన్నిటినీ పెంచిపోషించి రెచ్చగొట్టి ఎక్స్ ప్లాయిట్ చేస్తూ ఎన్క్యాష్ చేసుకొంటున్న రాజకీయం, విదేశాల్లో ఉన్న మనవాళ్ళ పాశ్చాత్య వ్యామోహం, విచ్చలవిడి డేటింగులు, జీవిత భాగస్వాముల్ని మార్చడం, ఆ మత్తులో పిల్లల్ని వాళ్ళ పెంపకాన్ని కూడా విస్మరించడం లాంటి చేదు అనుభవాలు రచయితని బాగా ఆవేదనకు గురిచేశాయి. వీటిని ఎండగట్టి ఒకానొక విరుగుడు కనుగొని ఒక ఆదర్శవంతమైన సమాజాన్ని, జాతిని, దేశాన్ని నిర్మించడంలో తనవంతు చెయ్యాల్సిన ప్రయత్నానికి మొదట తన్ను తాను సమాయత్తం చేసుకోవాలని గట్టి ప్రయత్నం చేశారు. అందుకు ఆయన సాహిత్యంతో బాటు ఇతర కళల్ని అభ్యసించారు. చరిత్రని, మానవ పరిణామ క్రమాన్ని, మానవ హక్కుల పరిణామాన్ని, ప్రపంచ మతగ్రంథాల్ని, ఆయా దేశాల పౌరస్మృతుల్ని, తత్వశాస్త్రాన్ని, సైన్స్‌ని కూడా విస్తృతంగా అధ్యయనం చేశారు. తన అధ్యయనంలో, విధి నిర్వహణలో భాగంగా ఆయన ప్రపంచం

అంతా చుట్టి కళల్ని, కళాఖండాల్ని, కళాకారుల్ని, పేరుగాంచిన ప్రాకృతిక ప్రదేశాల్ని సందర్శించారు. తన అధ్యయనంలోంచి సమస్యల మూలాల్ని, వాటి విరుగుళ్ళని బాగా ఆకళింపు చేసుకున్నారు. ఇంకా కార్పొరేటు ప్రపంచాన్ని, అందులో ఆధిపత్యాల కోసం జరిగే ప్రచ్ఛన్నయుద్ధాల స్వరూపాన్ని, విశ్వవిద్యాలయాలకు పట్టిన కులగజ్జిని, స్త్రీల, బాలల హక్కులు కాలరాయబడు తుండడాన్ని, నోటిమాటకు ఉన్న మహత్యాన్ని, స్వప్రయోజనాల కోసం జనాల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొట్టడం అలవాటు చేసుకున్న రామచంద్ర ప్రభుల్ని, కృష్ణమూర్తి లాంటి మిడిమిడి జ్ఞానపు మూర్ఖుల్ని, నాగరాజారావు లాంటి స్వతంత్ర సమరయోధుల ఆదర్శ జీవన విధానాల్ని, వ్యాపార ప్రయోజనాల వ్యామోహంలో పడి అమాయకుల జీవితాలతో ఆడుకుని చేతులు కాలినాక ఆకులు పట్టుకునే లార్డు స్వరూపుల్ని, దేశీయాభిమానంతో జాతి ప్రయోజనాల కోసం శక్తివంచన లేకుండా పాటుపడే రాధాకృష్ణ లాంటి కార్పొరేట్ వ్యాపారస్తుల జీవితాల్ని నిశితంగా పరిశీలించారు. ఇంతటి విస్తృతమైన జ్ఞానంతో సంఘ సమస్యలకు పరిష్కార మార్గాల్ని చూపించడంలో ఇతిహాసాల్లోని ఘటనల్ని, చారిత్రక ఘట్టాలను (అంకెలతో సహా), ఆచార సంప్రదాయాల డొల్లతనాన్ని, ఇతర దేశాల్లోని ఆదర్శ సమాజాల ఉదాహరణల్ని రచనలో ఎలా వాడుకోవాలో ఒంటబట్టించుకున్నారు. ఈ విషయంలో రచయిత పడిన వ్యయప్రయాసలు మెచ్చుకోదగ్గవి.

అహమద్ బాషా గారు తన కలానికి కిడ్నాప్‌లోని పదునుని అలానే కొనసాగిస్తూ ఈసారి దానికి పరిపక్వతని, సంయమనాన్ని, ఒకింత శిల్పాన్ని జోడించారు. దేశంలోని భిన్న వర్గాల్లో ఒక స్పష్టమైన అవగాహనతో కూడిన సామరస్యాన్ని పెంపొందించి ఒక ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం చెయ్యాలన్న నిబద్ధతతోటి ఈ నవల రచించారు. ఆయన సంకల్పం బలమైనది కావడం వల్లా, అది నేరుగా సమాజాన్ని చేరాలని ఆశించడం వల్లా ఏ డొంకతిరుగుళ్ళూ లేకుండా స్పష్టంగా వస్తుప్రతిపాదనే నవలంతా చేశారు. స్వార్థపరశక్తులైన క్యాపిటలిస్టులు చేసే పని కప్పిచెప్పడం. (దీన్ని శిల్పపరంగా తీసుకుని అపార్థం చేసుకోకండి. శిల్పం కోసం కప్పి చెప్పడం వేరు. సంకుచిత లక్ష్యాల కోసం మసిపూసి మారేడుకాయ చెయ్యడం వేరు) దాని బద్దలు కొట్టడమే క్యాటలిస్టు లక్ష్యం. మధ్యమధ్యలో పాఠకులకు కంటతడి రుచి చూపగల సుధాకర్– భావనల ప్రేమాయణం, తల్లి ఆదరణకు నోచుకోలేని కళ్యాణ్ దైన్యం లాంటివి రచయిత ఆదర్శాల సాధనకు కొన్ని ఆలంబనలు మాత్రమే! ఇలా అన్నంత మాత్రాన నాయిక భావన, నాయకుడు సుధాకర్‌ల ప్రేమని, రచయిత ఇష్టంగా పెట్టుకున్న నవల పేరుని, ఆయన చేసిన ప్రేమకు సంబంధించిన ప్రతిపాదనల్ని తక్కువ చేసి చూపడం నా ఉద్దేశం కాదు.

ఈ నవల నాయికా ప్రధానమైన రచన. అది రచయిత లింగ సమతా భావానికి నిదర్శనం. నవల్లో ప్రధానపాత్ర భావనా నాయర్. ఆమె కొంచెం భావవాది. కొంచెం భౌతికవాది. కొంచెం జాతీయవాది. కొంచెం వామపక్షవాది. నిజ జీవితం ఎలా కలగాపులగంగా ఉంటుందో అచ్చు అలానే ఉంటుంది భావన భావజాలం. ఐతే దానికి కావలసినంత స్పష్టత ఉంది. ఒక రకంగా ఆమె వీటన్నింటి మేలు కలయిక. రచయిత దృక్పథానికి ప్రతీక. రచయిత తన రచన ఒక ప్రేమకథ అని స్పష్టంగా చెప్పుకున్నారు. ఇది ప్రేమకథే కానీ ఆయన పైకి అనుకున్న ప్రేమకథ మాత్రం కాదు. ఆయన అంతరాత్మ అనుకున్న ప్రేమకథ. అందులోని కుళ్ళుని తొలగించి, శుద్ధి చేసి, ఒక ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని కోరుకునే ఒక స్వాప్నికుడి ప్రేమకథ. సుధాకర్ హెచ్చైవీ పాజిటివ్ అని తెలిసినప్పుడు నవల విషాదాంతమై ఉంటుందని పాఠకులు అనుకోవచ్చు. కానీ రచయిత మోదాంతం వైపే మొగ్గారు.


అహమద్ భాషా గారి తొలి రచన 'ప్రేమ'లో మంచి శైలి, గొప్ప కథనం ఉన్నాయి. అందులోనే ఆయన ఉపన్యాస ధోరణికి (సాహిర్ మాటల్లో) పునాది పడింది కానీ శృతిమించలేదు. ఆ తర్వాత ఆయన రచనోద్దేశాలు సీరియస్ కావడం వల్ల కిడ్నాప్‌లో అది ఎక్కువైంది. నరేంద్ర గారు ప్రాణం ఉన్నంత వరకు నవలకు హిందీవాళ్ళు పిలిచే ఉపన్యాస్ అనే పేరు చక్కగా నప్పుతుందని సున్నితంగా సూచించారు. ఐతే ఈ రచనలో ఉపన్యాస ధోరణికి చక్కని సమన్వయం మేళవించబడింది. రచనోద్దేశాలు నెరవేర్చుకోడానికి అది అవసరం అయింది.

నవల్లోని మానవ సంబంధాల విషయంలోకి వస్తే వాటిలోని సున్నితమైన తావుల్ని రచయిత అంతే సున్నితంగా తాకారు. సుధాకర్ హెచ్చైవీ పాలవడానికి సునంద చేసిన నిర్లక్ష్యమే కారణమని చిత్రించడంలో భార్యాభర్తల బాధ్యతల్ని గుర్తు చేశారు. భావన పెళ్లై హెచ్చైవీ పాలైన సుధాకర్‌ని పెళ్ళాడడంలో ఒక సరికొత్త మానవీయ కోణాన్ని చూపించారు. భావన సుధాకర్‌ని పెళ్ళాడి అతని కుంటుంబాన్ని చక్కదిద్దడంలో కుటుంబ వ్యవస్థ పట్ల మనిషికి ఉండాల్సిన నిబద్ధతని గుర్తుచేశారు. ఇవన్నీ రచయిత

ఆదర్శాలు. మైకులగోలపై భావన చేసిన పోరాటంలో మనిషిలో సామాజిక రుగ్మతల్ని ఎదిరించడానికి తగిన ఉద్యమస్ఫూర్తి ఉండాలని సూచించారు. స్వరూప్ లాంటి కార్పొరేట్లు మానవ సంబంధాలతో కూడా వ్యాపారం చేస్తుండడాన్ని కళ్ళకు కట్టి జాగ్రత్త పడేలా చేశారు. కిడ్నాప్ కథానాయకుడు ఖాద్రీ పాత్రలో రచయితని చూసుకున్నట్లే.. ఈ నవలలోని భావన పాత్రలో ఆయన సహచరిని చూసుకోవచ్చని అనిపిస్తుంది.

ఈ నవల కథా నేపథ్యంలో ఒకే ఒక్క వైరుధ్యం ఉంది. అది ఏంటంటే ఈ నవల రాయడానికి ఒక ప్రేరణ ఉందట. ఆ ప్రేరణ ఎయిడ్సుతో మరణించిన ఒక వ్యక్తి భార్య కథ. ఆమె ఇప్పటికీ ఒక చిన్న గుడి ముందు పూలు అమ్ముకుని బతుకుతున్నదంట. మరి పూలమ్ముకుని బతికే చదువురాని పేదరాలి కథను పేదతనం నేపథ్యం నుంచి రాయకుండా ఆమెకు మధ్య తరగతి, అందం, అమేయమైన తెలివితేటలూ, కాలగమనంలో వచ్చే పదవులూ ఐశ్వర్యాలు, చేపట్టిన కార్యాల్లో అఖండమైన విజయాలు ఆపాదించి కథనం చెయ్యడంలో ఉన్న ఆంతర్యం ఏమిటి? అందంలో, సంస్కారంలో, సామాజిక హోదాలో ఉన్న ఆకర్షణ ఏమిటి? శ్రమైకజీవనం వల్ల ప్రాప్తించిన ఒంటి మెరుపులేమిలో పేదతనంలో ఉన్న అంటరానితనం ఏమిటి? ఇది రచనని ఆకర్షణీయం చెయ్యడమా? లేక అట్టడుగు సమాజాన్ని, శ్రామికజన నేపథ్యాన్ని కథనం చేసి మెప్పించడానికి వెనుకంజ వెయ్యడమా? అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఇది తప్ప ఈ రచనపై పెద్దగా ఫిర్యాదుల్లేవు. ఐతే ఇలా చేసి కూడా ఒక కార్పొరేటై ఉండి కూడా కుటుంబాన్ని దిద్దుకుంటూ, పర్యావరణాన్ని కాపాడుకుంటూ, శ్రామిక సంక్షేమాన్ని పట్టించుకుంటూ దేశంలోని విభిన్న వర్గాల మధ్య సయోధ్య కుదుర్చుతూ సామరస్యాన్ని సాధించవచ్చు, తారతమ్యాలు లేని సమాజాన్ని స్థాపించవచ్చు అనే సందేశం ఇవ్వడంలో రచయిత ముందుచూపు, దానిపట్ల తనకున్న నిబద్ధతా స్పష్టంగా కనబడుతున్నాయి. ఇలాంటి లక్ష్యసాధన కోసమే రచయిత పాటుపడుతున్నట్లు ఆయన రచనలన్నింటినీ అధ్యయనం చేస్తే తెలుస్తుంది. దానికి సమరస భావాలు గల ఒక ఆదర్శవంతుడైన టీచర్ కొడుగ్గా పుట్టడం, అన్య సామాజిక వర్గానికి చెందిన సహాధ్యాయినిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఒద్దిగ్గా కాపురం నిలబెట్టుకోవడం, భిన్న సంస్కృతుల నేపథ్యంలో పుట్టిన బిడ్డల్ని సంస్కారవంతులుగా తీర్చి దిద్దుకున్న నేర్పరితనం అనే ఆయన నేపథ్యం గట్టి పునాదిగా నిలిచింది. ఈ నవల పాఠకుడి హృదయానికి కావలసినంత  తడి, మేధస్సుకు గొప్ప సడి ఇస్తున్న రచన అనడంలో సందేహం లేదు. తను స్వప్నిస్తున్నట్టు దేశంలోని భిన్న వర్గాల మధ్య సమరసభావం సాధించి, ఒకానొక ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించటమే రచయిత ఆశయం. ప్రాణం ఉన్నంత వరకూ అందుకోసమే ఆయన ప్రాకులాట.

■



## దున్నేయ్ రైతన్న

**గు**ట్టను దున్నావు
మట్టిని దున్నావు
ఆకలి పేగుల్ని నాగలికి కట్టి
పొలాలు దున్నింది చాలు
మనుషుల ఎడారి గుండెల్ని దున్నాలి
దున్నేయ్ రైతన్న
ఈ కిరాతక రాజ్యాహంకారాన్ని
ఈ అమానుష మానవ నైజాన్ని

కలుపు కోసావు కాయ కోసావు
కడుపు నింపే  పంట కోసావు
బతుకు పండించే మెతుకు కోసింది చాలు
కోసేయ్ రైతన్న
నిన్ను కాలరాసే కుతంత్రాల్ని
పచ్చని పంటకు చిచ్చు పెట్టే కరాల్ని

మట్టికి నీళ్లు తాపావ్
విత్తుకు ప్రాణమూదావ్
నీ స్వేదాన్ని రక్తంగా ఎక్కించింది చాలు
ఎక్కించేయ్ రైతన్న
నీ కోడెగిత్తల బండిని
సామ్రాజ్య వాద సౌధం మీదికి!

**- ముదిగొండ సంతోష్**
**79813 52713**





# ప్రపంచమే ఒక పెద్ద పరస

**డాక్టర్ కరణం శ్రీనివాసులు రెడ్డి**

94932 12454

తెలుగు అధ్యాపకులు,
సంజయ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
పీలేరు, చిత్తూరు జిల్లా

**ఆ**ది మానవుడి కాలం నుంచి మానవ జీవితంతో ముడి పడి నేటికీ కొనసాగుతున్న బంధం మనిషి–పశువులది. వేటాడి జీవించే దశలో మాంసానికీ, ఉత్పత్తి దశలో వ్యవసాయానికీ ఆసరాగా నిలిచి మనిషి కడుపు నింపింది పశువే. అందుకే మానవ నాగరికతలో పశుకేంద్రంగా ఆచారాలు, సంప్రదాయా లు, పండుగలు వెలిశాయి. పశువూ మానవ నాగరికతలో భాగమయ్యింది. అంతేకాక వ్యవసాయాధారిత సమాజంలో ఆవులు, ఎద్దులు ప్రధాన ఉత్పత్తి సాధనాలుగా, మారకపు సంపదగా మారిపోయాయి. గ్రామీణ జీవితం పశువు చుట్టూ అల్లుకొన్నది. అందునా భారత దేశం వంటి వ్యవసాయ ప్రధాన దేశంలో పశువు కేంద్ర స్థానాన్ని ఆక్రమించింది. సింధు లోయ నాగరికత మొదలుకొని నేటి వరకు జరిగిన చరిత్రలో అన్ని దశలలోనూ ఇందుకు దండిగా ఆధారాలున్నాయి. ఈ సుదీర్ఘ చారిత్రక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యం ఇదే అనివార్యంగా సాహిత్య వస్తువు కావాల్సి ఉంది.

ఆంగ్ల సాహిత్యంలో ఉన్న 'పాస్టోరల్ సాహిత్యం' పశువుల, గొర్రెల కాపర్ల జీవితాన్ని పశువులతో వారి జీవితానికున్న అనుబంధాన్ని గ్లోరిఫై చేస్తూ రొమాంటిసిజంలో ఒక పాయగా సాగింది. పశుపక్ష్యాదులు పాత్రలుగా మానవ జీవితాన్ని వ్యంగ్యంగా చిత్రీకరించిన 'అలిగరి' కథనం బాగా ప్రసిద్ధి పొందింది. కానీ పశువుతో ముడిపడ్డ మనిషి జీవితాన్నీ, అందులోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలను స్పృశిస్తూ మనిషి పశువు యొక్క యదార్థ సంబంధాలను వ్యాఖ్యానించే రచనలు చాలా అరుదుగా వచ్చాయి. తెలుగులో కె. సభా 'అంబా', పేరూరు బాల సుబ్రహ్మణ్యం 'మడకెద్దులు', జి.ఆర్.మహర్షి 'క్షమించు కన్నా!' వంటి కథలు మనిషికి పశువుతో గల అనుబంధాన్ని మానవీయ కోణంలో ఆర్ద్రంగా చిత్రించాయి. అంతేగానీ మనిషికి, పశు వుకీ మధ్యగల ఉత్పత్తి, శ్రమ సంబంధాలను సామాజిక కోణంలో చెప్పే రచనలు మాత్రం పెద్దగా రాలేదనే చెప్పాలి. ఈ లోటు పూడ్చడానికే అన్నట్లు వి.ఆర్.రాసాని పశు సంపదపై అరుదైన నవలగా 'పరస'ను మన ముందు నిలిపారు. 'పరస' నవల బీశేరయ్య అనే గంగెద్దులాయన జీవితాన్ని భూమికగా చేసుకుని ప్రపంచీకరణ ప్రారంభ దశ (1990వ దశకం)కు ముందు ఆ తర్వాత సమాజాన్ని మన ముందు నిలిపింది. ఏ సమాజంలో నైనా ఆర్థిక వ్యవస్థ చరాస్తులతోనే ఆరంభమౌతుంది. సింధు లోయ నాగరికత నుంచి పశువు ప్రధాన చర సంపదగా చలామణి అవుతోంది. ఈ మధ్య కాలం వరకు కూడా పల్లెల్లో పశువులు కలిగినోడే 'కలిగినోడు'గా ఉన్నాడు. భూమి ఒక ప్రధాన వనరుగా ఉంటుందే గానీ మారకపు వస్తువు గాదు. ప్రపంచీకరణ యుగం మొదలైన తర్వాత స్థిరాస్తి ప్రధాన ఆస్తిగా మారింది. అమ్మకపు వస్తువైంది. ఆ భూమిపై ఆధారపడ్డ వ్యవసాయం వ్యాపారమయ్యింది. వ్యవసాయానికి ప్రభుత్వ సాయం ఉపసంహరించుకోవడం, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం, యంత్రాల ప్రవేశం, వ్యాపారీకరణ వంటి వాటి మూలాన గ్రామ స్వయం పోషకత్వం నశించింది. దీంతో వ్యవసాయం ఆలంబనగా ఏర్పడ్డ మానవ సంబంధాలు, జానపద కళలు మనుగడ కోల్పోయాయి. ఇది గ్రామీణ జీవితాల్లోనూ, కళలను వృత్తిగా జీవించే వాళ్లలోనూ తీవ్రమైన అలజడినీ, నిశ్శబ్ద విధ్వంసాన్నీ సృష్టించింది.

ఈ మార్పులన్నీ ప్రజలపై బలవంతంగా రుద్దబడినవే కానీ ప్రజలు కోరుకున్నవి కావు. భూమి, వ్యవసాయం, పశువులు మొదలైన వాటితో మనుషుల సంబంధాలు, ఆ సంబంధాల నుంచి పుట్టిన నమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాలు, కళలు ఒక వైపు ... కులం, దాని ఆధారంగా ఏర్పడ్డ అంతరాలు, ఆ అంతరాల నుంచి పుట్టిన వైరుధ్యాలు, ఆ వైరుధ్యాల మూలంగా తలెత్తిన ఘర్షణ మరో వైపు కనిపిస్తుంది. ఈ కాన్వాసునంతా శేరయ్యను కేంద్ర బిందువుగా చేసుకుని 'పరస'లో చిత్రించారు రాసాని. "నవల వ్యక్తిని చిత్రిస్తుంది. వ్యక్తి సమాజంతో, ప్రకృతితో జరిపే పోరాటాన్ని చిత్రించే మహా కావ్యమే నవల. ఇది వ్యక్తికీ సమాజానికీ ఉండిన సమతుల్యత చెడిపోయిన కాలంలో– వ్యక్తి ఇతర శక్తులతో, ప్రకృతితో పోరాటానికి దిగిన కాలంలో మాత్రమే అభివఅద్ధి చెందగలిగింది" అని రాల్ఫ్ ఫాక్స్ తన 'నవల – ప్రజలు'లో అంటాడు. వ్యక్తికి సమాజానికి సమతుల్యం చెడిపోయిన కాలం ప్రపంచీకరణతో పరాకాష్టకు చేరింది. కానీ ఇప్పుడు సమాజం తనలో తాను ఘర్షణ పడుతోంది తప్పిస్తే అది ఒక వ్యవస్థీకఅత పోరాటం వైపు పయనించడం లేదు. పరస నవల వ్యక్తికి సమాజానికి చెడిపోయిన సమతుల్యాన్ని సమర్థవంతంగా చిత్రించింది. పోరాట ప్రస్తావన చేయలేక పోయింది. ఒక సమాజం వ్యవస్థీకృత పోరాటం వైపు మళ్ళా లంటే మొదట అంతరాలను, వైరుధ్యాలను గుర్తించగలగాలి. వాటి మూలాలను అర్థం చేసుకోగలగాలి. ఆ అవగాహనలోంచి పోరాట రూపాలు రూపుకట్టాలి. ఇదంతా మనిషి చైతన్యవంత మయ్యే క్రమం. చాలా మంది ఈ అంతరాలే సహజమను కుంటారు. కొంతమంది అదంతా దైవలీల అనుకుంటారు. కొంతమంది వాటిని గుర్తించి, ఏమీ చేయలేక అసహనంతో, నిస్సహాయతతో ఉంటారు. కొంతమంది వ్యవస్థీకృత లోపాలకు వైయక్తిక పోరాటాన్ని కొనసాగించి, ముగిస్తారు. మరి కొంత మంది మాత్రమే మూలాలను శోధించి, చలన సూత్రాలను అవగాహన చేసుకుని, పోరాట రూపాలను సిద్ధం చేసి, అమలు చేస్తారు.

'పరస'లో బీశేరయ్య అంతరాలను, వైరుధ్యాలను గుర్తించి, ఏమీ చేయలేని నిస్పృహతో ఉంటాడు. 'పరస'లోని పాత్రలు సామాన్య పల్లె ప్రజలు. వారి పాత్రలను సహజంగానే మలిచారు రాసాని. లేని చైతన్యాన్ని పాత్రలకు ఆపాదించి, వాటి చేత ఉత్త నినాదాలు చేయించలేదు. ఆ పాత్రల కుటుంబ, సామాజిక చైతన్యం ఎంతవరకో అంత వరకే ప్రవర్తించాయి. మన కథా నాయకుడు బీశేరయ్య ఒక గంగెద్దులాయన. అతనికి గంగెద్దు కోసం ఒక దేశిపు కోడెదూడ అవసరమౌతుంది. అందుకోసం అతను దలాల్ కాదు (దళారి) చిన్నబ్బను తీసుకుని పుంగనూరు 'పరస'కు పోతాడు. పరస అంటే పశువుల సంత. ఇక్కడ దూడల దగ్గర నుంచి ఎద్దుల వరకు అన్ని రకాల పశువులను కొంటారు. అమ్ముతారు. పశువుల ఎంపిక, వాటి బేరసారాలు ఒక పేద్ద సబ్జెక్టు. పశువుల జాతులు, వాటి లక్షణాలు, పశువుల సుడులు, వాటి పర్యవసానాలు ఒక పశు లక్షణ శాస్త్రంలా ఉంటుంది. ఆ శాస్త్రకారుడుగా మనకు చిన్నబ్బ కనబడతాడు. కురుక్షేత్రంలో శ్రీకఅష్ణుడు అర్జునునకు యోగశాస్త్రం ఉపదేశించినట్లు చిన్నబ్బ బీశేరయ్యకు, వారితో పాటు వచ్చిన గంగాచెంద్రకు పశులక్షణ శాస్త్రాన్ని బోధిస్తాడు.

అల్లికారు కుర్రలు, ఎర్ర శ్యామడ గొడ్లు, చాగిరి జాతివి, నల్ల మట్టి యచ్చేపలు, ఎర్రమట్టి యచ్చేపలు, క్రాసింగావులు, నాటు గిత్తలు, ఒంగోలు గిత్తలు, నెల్లూరావులు, చుక్కావులు ఇవి పశుల రకాలు. అంతే కాదు; పశుల సుడి విజ్ఞానం కూడా ఇలా విరిగా చెప్తాడు చిన్నబ్బ. మనుషులకు తల, వీపుల్లో సుడులు ఉన్నట్టే పశువులకు వివిధ భాగాల్లో సుడులు ఉంటాయి. ఆ సుడులను, అవి ఉన్న చోటును బట్టి పశువుల స్వభావాన్ని చెప్తారు. నాము సుడి, కొమ్ము సుడి, సంకెళ్ళ సుడి, గూటం సుడి, పొరక సుడి, పలుపు సుడి, అరితి సుడి వంటివి ఆ సుడుల్లో ముఖ్యమైనవి. ఇందులో గూటం సుడి ఉంటే కొన్నోడికి గూటమేననీ, అరితి సుడి గనక కాడిమాను కింద నలిగితే సంసారం కూడా నలిగిపోతుందనీ నమ్మకాలు. ఇవన్నీ చిన్నబ్బ చెబుతా వుంటే ఆశ్చర్యపోవడం మన వంతవుతుంది. ఇది చాలక చిన్నబ్బ చేతే మనుషుల సుడులు, వాటి ఫలితాలను కొసరుగా చెప్పిస్తాడు రచయిత.

పరసలో పశువుల బేరం అంతా ఒక గందరగోళం. దళారీలు చేతులపై తువ్వాలు గుడ్డ వేసుకొని, ఆ ముసుగులో వేళ్ళు పట్టుకొని చేసే బేరం రైతులకు అర్థం కాదు. ఇదంతా రైతు ప్రమేయం లేకుండానే జరిగిపోతుంది. అది ఇప్పటి వ్యవసాయ మార్కెట్లో కమీషన్ మండీ వాళ్ళ వ్యవహారం లాంటిదే. మోసం షరా మామూలే. మోసపోయేది అప్పుడూ ఇప్పుడూ రైతే. ఇంకా చెప్పాలంటే ఇప్పటి సాఫ్ట్‌వేర్ కన్సల్టెంటు కంపెనీలు చేస్తున్నది కూడా ఇదే. ఇంతకుముందే చెప్పుకున్న పశుల రకాలు, వాటి సుడులు, మనుషుల సుడులు వాటి వివరణలతో పాటు ఈ కాలం వాళ్లకు, నగర జీవులకు తెలియని అనేక అంశాలు రాసాని తన పాత్రల చేత పూసగుచ్చినట్లు వివరిస్తాడు. కపిల (మోట) తోలే విధానం,కొత్త కుర్రలకు కపిల నేర్పే పద్ధతి మనకు నేర్పించినట్టుగా ఉంటుంది. కోడె దూడలకు గంగెద్దులాట నేర్పడం, గంగెద్దులాట కళారూపం మన కళ్ళ ముందు నిలుపుతాడు. ఎదకొచ్చిన ఆవుపై కోడెను వదలడం, కోడెగిత్తలకు పిడుగ్గొట్టడం మనకు చూపిస్తాడు. గూకా చెంగడు

అనే పాత్ర చేత పశుల రోగాలు, వాటి లక్షణాలు, వాటికి వైద్యం అన్నీ వివరంగా చెప్పిస్తాడు రచయిత. ఇలా తను తెలుసు కున్న, మనకు తెలియని ఆచారాలు, విధానాలు అన్నింటినీ చెప్పడానికి కథలో కొన్ని పాత్రల్ని ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించినట్టు అనిపిస్తుంది. ఒక్కోసారి ఉన్న పాత్రల చేతనే అదే పనిగా వివరాలు మనకు తెలియజేసినట్లు ఉంటుంది. రాసాని చాలా నవలల్లో కనిపించే దృశ్యాలే ఇవి. ఇలాంటివి ఆయన నవలల్లో అనివార్యమే. ఎందుకంటే రాసాని నవల లెప్పుడూ సామాజిక వాస్తవికతతో పాటు బోలెడంత సమాచారాన్నీ ఇస్తాయి. ఆయన కథాస్థలంలో స్వయంగా పర్యటిస్తారు. పరిశోధన చేస్తారు. సమాచారాన్ని సేకరిస్తారు. అలా సేకరించిన సమాచారాన్ని తన పాత్రల ద్వారా మనకు తెలియజేస్తాడు. మన తాతల నాటి సేద్యపు విశేషాలు, పండుగలు, పెండిండ్లు, ఇప్పటికే అంతరించిపోయిన, పోతున్న జానపద కళారూపాలు ఆ అంశాలు మనం చూడనివి కావచ్చు లేదా కొత్త తరానికి తెలియనివి కావచ్చు... నవలలో మన కళ్ళ ముందు కనబడతాయి.

ముందుమాటలో తవ్వా ఓబుల్ రెడ్డి అన్నట్లు ... ఈ నవల చాలా గ్రామీణ దృశ్యాలను, అంశాలను, విశేషాలను రికార్డు చేసింది. ఇక ఈ నవలలో కనిపించే సామాజిక వాస్తవికతాం శాలు రెండు. అవి కులము, సామాజిక మార్పు. కులమూ, అది సృష్టించిన సామాజిక అంతరం, అగ్ర కులం నిమ్న కులంపై జరిపే దాష్టీకం అనేవి కులానికి సంబంధించిన వాస్తవికత. కులాధార సామాజిక అంతరం గ్రామీణ మానవ సంబంధాల్లోనూ, గ్రామ భౌతిక నిర్మాణంలోనూ మనం ప్రత్యక్షంగా చూడొచ్చు. ఊరికున్న ఆస్తిలో అగ్రభాగం అగ్రకులాల వారికే వుంటుంది. మిగతా వూరు కూటి కోసం, కూలి కోసం వారి పైనే ఆధారపడే ఉంటుంది. అందుచేత ఊరి పెత్తనం వారిదై ఉంటుంది. కథాస్థలమైన ఘంటా వాళ్ళ పల్లెలోనూ ఇదే పరిస్థితి. ఆ ఊరి పెత్తనం సామెర్ల శంకర్రెడ్డి కుటుంబీకులదే. ఆ ఊళ్ళో కాస్త భూములున్నదీ వాళ్ళకే. మిగతా వాళ్లకు ఆ దరిదాపుల్లో భూములున్నా రెడ్లకున్న గౌరవం మిగతా వాళ్లకు లేదు. మధ్యస్తాలు (పంచాయితీలు), పండగ, దేవరలు, ఎలక్షన్లూ వీటిల్లో చెల్లుబాటయ్యేది వీళ్ళ మాటే. ఒక రకంగా ఆ ఊరి రాజ్యానికి వాళ్ళే అనధికారిక అధిపతులు. మిగతా వాళ్ళు వీళ్ళ ఆధిపత్యాన్ని సహించలేక, ఆందోళన చెందుతూ వాళ్ళలో వాళ్ళే నలుగుతూ ఉంటారు తప్పితే ఎదురుతిరగలేరు.

"ఈ రెడ్లూ, నాయుళ్ళూ అంతేరా నాయనా! వాళ్ళు చెప్పింది జరగాల్సిందే అంటారు. వాళ్ళ మాట కింద బడగూడదు" అని రాముడంటే, "అవునబ్బా రాజ్యమెప్పుడూ వోళ్ళ సేతుల్లోనే గదా వుంటాది" అంటాడు నుసకడు. "డిల్లీలో బ్యామ్మలు, ఈడ కాంగ్రెస్ వస్తే రెడ్లూ, తెలుగు దేశం వస్తే నాయుళ్ళూ రాజ్య మేలతా వుండారు" అంటారు గూకా చెంగడు, కన్నయ్య. మిగతా వాళ్ళ పెత్తనం ఎప్పుడొచ్చేది అంటూ వగస్తానే "ఈ మిగిలి నోళ్ళు వొగిటయ్యేది లేదు. వాళ్లకు దేశిం పెత్తనం వచ్చేదీ లేదు ఫో..." అంటూ ముక్తాయింపునిస్తారు వాళ్ళు.

కటారి రాముడు, గూకా చెంగడు, నుసకడు, కన్నయ్య లాంటి బహుజనులైతే కులాన్ని, అది సృష్టించిన అంతరాలను, ఆధిపత్యాన్ని గుర్తించారు. దానికి ఒక్కటవ్వడం అనే పరిష్కారానికీ వచ్చారు. ఈ యెరుక వారికి వారి జీవితానుభవాలే ఇచ్చాయి. కానీ ఆ 'ఒక్కటవ్వడం' అనేది ఎలా అన్నది వారికి అర్థం కాని వ్యవహారం. ఒక్కటవ్వడం అంటే వ్యవస్థీకృతం కావడం. ఆ వ్యవస్థకు ఒక లక్ష్యం ఉండటం. ఆ లక్ష్యానికి ఒక సైద్ధాంతిక భూమికను ఏర్పాటు చేసుకోవడం. ఆ భూమిక ఆధారంగా లక్ష్యం కోసం నిరంతర పోరాటం చేయటం. అదే ఉద్యమమంటే. ఆ ఉద్యమాన్ని వీరిలో మనం చూడలేము. ఒక వేళ వీరు వ్యవస్థీకృత అన్యాయానికి గురైనా వైయక్తికమైన తక్షణ తిరుగుబాటును మాత్రమే ప్రదర్శిస్తారు. అది అప్పటికి మాత్రమే వైయక్తిక ఉపశమనాన్ని, తాత్కాలిక ప్రయోజనాన్ని కలిగిస్తుంది. ఆఖరుగా వాళ్ళ రచ్చబండ సంభాషణల ముగింపు ఇలా ఉంది : ''అవునబ్బా... మిగిలిన కులాలోళ్ళు ఒగిటయ్యేదాకా ఇంతే''. ప్రస్తుతం ఆ ఒక్కటవ్వడమైతే జరుగుతోంది కానీ ఏ కులానికి ఆ కులం ఒక్కటైనట్లు కనిపిస్తోంది. అంతేకాదు; ఒక్కటవ్వడానికి ఆయా కులాల్లో 'కులస్పృహ' పెరగడం కారణమైనట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు కులం సరికొత్త రూపాలతో ముందుకొస్తోంది. తన చరిత్రను తవ్వుకుంటోంది. సాహిత్యాన్ని సృష్టిస్తోంది. తాత్వికతను ప్రోది చేసుకుంటోంది. ఏ కులానికి ఆ కులం స్వీయ అస్తిత్వానికి సంపూర్ణ రూపం ఇవ్వడం కోసం ప్రయత్నిస్తోంది. దీనివల్ల వాళ్ళు కోరుకున్న 'మిగతా వాళ్ళు ఒగిటయ్యే' అవకాశం కనుచూపు మేరలో కనబడడం లేదు.

నవలా రూపాన్ని ఒకసారి తేరిపార చూస్తే, నవలలో ఏ హంగూ ఆర్భాటం, మలుపులు, సస్పెన్సులు ఏమీ ఉండవు. కానీ నవల చదువుతున్నంత సేపూ ఒక పురా ప్రపంచంలో మనమున్నట్టూ, దానికి సాక్షీభూతులమైనట్టూ, మన ప్రమేయం లేకనే అన్నీ మన కళ్ళ ముందు అలా జరిగిపోతున్నట్టూ అనిపిస్తూ ఉంటుంది. మన కళ్ళ ముందు వివిధ సహజ జీవన దృశ్యాలు అలా వచ్చి పోతుంటాయి. ఒక దళశ్యం, అందులోని పాత్రలు,

వాటి కదలిక, భాష, సంవేదనలు అన్నీ ఒక పల్లె రచ్చబండ మీద మనం కూర్చొని చూస్తున్నట్టే ఉంటుంది. మొదట్లో ఏ ప్రాధాన్యం లేకుండా అలా వచ్చిన పాత్రలు నవల మధ్య మధ్యలో మళ్ళీ వచ్చి తమ ఉనికిని చాటి పోతుంటాయి. అలాంటి ఒక పాత్ర గంగచంద్ర. నవల మొదట్లో బీశేరయ్య, చిన్నబ్బల సాయంతో పుంగనూరు పరసలో అల్లికారు ఎద్దుల్ని కొన్న 'గంగచంద్ర' 'ఏమైనాడబ్బా యాడా కనబళ్ళేదే' అని అను కుంటూ ఉంటే బండి లాగలేక పడుకొన్న ఎద్దుల్తో అవస్థ పడుతూ ప్రత్యక్షమవుతాడు.

నవలలో బీశేరయ్య పాత్ర మినహా మిగతావన్నీ చిన్న పాత్రలే అయినా తమవైన ప్రత్యేక అస్తిత్వాన్ని, ప్రయోజనాన్ని ప్రకటిస్తూ ఉంటాయి. ఒక వ్యవస్థకు ప్రతి రూపాలుగా నిలుస్తాయి. తేరగా మాటలతోనే రైతుల కష్టాన్ని దోచుకునే వ్యవస్థకు దళారి చిన్నబ్బ; సన్నకారు రైతుకు ప్రతినిధి గంగచంద్ర; అగ్రకుల దాష్టీకానికి శంకర్రెడ్డి, కేశవ రెడ్డి; కులాంతరాలపై నిరసనకు నుసకడు; శ్రమజీవి రెక్కల కష్టాన్ని ఉద్ధరకు మేసి, ఆ దోచుకోబడే శ్రమ జీవుల చేతనే పూజలందుకునే వ్యవస్థకు దేవరెద్దు; దోచుకున్న వాడిని దైవంగా పూజించే సమాజానికి ఘంటావాళ్ళ పల్లె ప్రతినిధులు. పాత్రలు రచయిత చెప్పినట్టు కాకుండా వాటి స్వభావం మేరకే నడుస్తాయి. అలా కాకుండా ఉండుంటే కనకమ్మకు కటారి రాముడు వల్లా బిడ్డ పుట్టుండే వాడు కాదు. పాత్రల స్వభావం బహిర్గతమయ్యే కీలక సన్నివేశాల్ని రచయిత నాటకీయ వైచిత్రితో రక్తి కట్టిస్తాడు. బీశేరయ్య ఆడించే గంగెద్దులాటలో భాగంగా వచ్చే దొంగను పట్టే సన్నివేశాన్ని, అదే సమయంలో (శంకర్రెడ్డి కుట్రలో భాగంగా) బీశేరయ్య ఇంట్లోనే దొంగలు దేశిపు దూడను పట్టుకుపోయే సన్నివేశాన్ని సమాంతరంగా నడిపిస్తాడు రచయిత. అలానే కటారి రాముడి ఎదకొచ్చిన ఆవుపై కనకమ్మ వాళ్ళ కోడె ఎక్కడం, కటారి రాముడు కనకమ్మను శారీరకంగా కలవడం ఒకేసారి జరిగిపోతాయి. ఆపై రాముడి ఆవు దాటు నిలిచి సూటిది కావడం, కనకమ్మ ముట్టు నిలిచి గర్భవతి కావడం అలానే జరుగుతుంది. ఆఖరుగా (శంకర్రెడ్డి కుట్రతో) పాముకాటు వల్ల బీశేరయ్య కోడెదూడ ప్రాణం పోవడం, కనకమ్మ పండంటి మగబిడ్డను ప్రసవించడంతో ఒక ప్రాణం భూమి మీదకు రావడం ఒకే ఇంట్లో ఒకేసారి జరుగుతాయి. ఇది పరస్పర వైరుధ్యాన్ని ఏకకాలంలో దృశ్యమానం చేసే శిల్ప వైచిత్రిలో ఒక భాగం. నవల ముగింపులో కూడా రాసాని ఒక అరుదైన శిల్పాన్ని సాధిస్తాడు. అందులో ఒక జీవిత తాత్వికతను దర్శింపజేస్తాడు.

ఈ నవలలో మొదటి ఆఖరు దృశ్యం ఒకటే. పరస. నవలను పరసతో మొదలు పెట్టి పరసతోనే ముగిస్తాడు. అలా జీవిత వృత్తాన్ని పరిపూర్ణం చేస్తాడు. ఆ వృత్తం లోపల, వెలుపల అనంత బిందువులుగా పరసలో పశువుల మాదిరి మనుషులు. దీనికంతటికి సాక్షీభూతులుగా నిలిచేది ఇద్దరు. ఒకరు బీశేరయ్య. మరొకరు మనము. స్థలం ఒకటే అయినా కాలం ముప్పై ఏండ్లు. ఈ ముప్పై యేండ్ల కాలంలో బీశేరయ్యతో పాటు చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఘంటావాళ్ళ పల్లెలో మనం జీవిస్తాం. గంగెద్దులాటలు, దేవరెద్దు ఊరేగింపులు చూసి, సమూహ మానవ కోలాహలాల్లో కలిసిపోతాం. గడ్డివామి సంబంధాలను చూసి న్యాయ నిర్ణయం చేయలేక నిర్లిప్తులమై పోతాం. పెద్దకులం దాష్టీకాలు చూసి కడుపు మండి బహుజనుల వైపు నిలబడతాం. ఎద్దుల బేరాలు, పశు విజ్ఞానం, వ్యవసాయ విజ్ఞానం నేర్చుకునే విద్యార్థులమవుతాం. ఇండ్లల్లో పశుల కొట్టాలు, ఊరి వీధుల్లో ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు కళ్ళారా చూస్తాం. పశుల కొట్టాల నుంచి, ఊరి వీధుల నుంచి వచ్చే పేడ, గంజరం వాసన మన ముక్కు పుటాలను తాకుతుంది. ఆ వాసనతో మన మూలాలను మనం తాకుతాం. ఆఖరుగా వొట్టి పోయిన పశుల కొట్టాలు, బోసి పోయిన ఊరి వీధులు, కూలి పోయిన ఇళ్ళు, నైరాశ్యం నిండిన పల్లె ప్రజల కళ్ళు మన కళ్ళ ముందు కనబడతాయి. కళ్ళు చెమరుస్తాయి. ఆ చెమర్చిన కళ్ళతోనే పుంగనూరు పరస చేరుతాం. అక్కడ పరసలో పశువుల్లేవు. అంతా మనుషులే. అది మనుషుల పరస. అక్కడ అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళు, అమ్ముడుపోయ్యేవాళ్ళు, వ్యాపారులు, దళారులు అందరూ మనుషులే. మొదటి పరస పశువులది. ఆఖరుది మనుషులది. ఈ ప్రపంచమే ఒక పెద్ద పరస అనిపిస్తుంది. మనమూ ఆ పరసలో ఉన్నట్టు అనిపించి ఉలిక్కి పడతాం. తప్పిపోయామోనని మనల్ని మనం వెతుక్కుం టాం. తేరిపార చూసుకుంటాం. 'పరస' మనకిచ్చేదీ ఇదే. ఇప్పుడు మనకు కావాల్సిందీ ఇదే! ■





# కళ్ళకు గంతలు

- మూరిశెట్టి గోవింద్
95022 00748

**భో**జనం చేసిన తరువాత ఓ అరగంట పాటు వీధి అరుగు మీద కూర్చోవడం ముందు నుంచి నాకున్న అలవాటు. చలికాలం కావడం చేత చలి తీవ్రత ఎక్కువగా ఉంది. రాత్రి సుమారు తొమ్మిది గంటలయ్యుంటుంది. వీధి లైట్లు అప్పటికే కునికిపాట్లు పడుతున్నాయి.

మొత్తం నిర్మానుష్యంగా ఉంది. ఇద్దరు యువకులు మోటారు బైక్ మీద వస్తూ కనబడ్డారు. వీధిలో ఎవరూ లేకపోవడం చేతనో ఏమో నేరుగా నా దగ్గరకే వచ్చి ఆగి, చేతిలోకి ఒక కాగితం తీసుకుని ఇక్కడ "సత్యం ఎవరండి" అని అడిగారు.

"సత్యం అంటే నేనేనండి" అన్నాను. వారు నెత్తి బరువేదో దించుకున్నట్టు వెతకబోయిన తీగేదో కాలికి తగిలినట్టు "హమ్మయ్య! మీరేనన్న మాట" అని, ఎందుకొచ్చిందీ వివరించే ప్రయత్నం చేశారు.

"సుమారు మూడేళ్ల క్రితం మీరు బస్సులో ప్రయాణించే సమయంలో రామాపురం వద్ద డ్రైవర్ మీద ఒక వ్యక్తి దాడిచేసి గాయపరిచాడు, గుర్తుందా?" అని ప్రశ్నించాడు. గుర్తు చేసుకోవటానికి కొంత సమయం పట్టింది. కాని గుర్తుకొచ్చింది.

"అవునూ ఆ కేసింకా తెగలేదా" అని అడిగాను.

"ఎల్లుండే వాయిదా. మీరు సాక్ష్యం చెప్పాలి. ఆరోజు సాక్షి సంతకం మీరే పెట్టున్నారు". అని ఒక కానిస్టేబుల్ నంబరిచ్చి మీరు అతన్ని కలిస్తే మిగతా వివరాలు తెలుస్తాయి అని నాకు సమన్లు అందించి సంతకం తీసుకుని వెళ్ళిపోయారు. వారు వెళ్ళారు కాని నా మనసు మాత్రం ఆ నాటి సంఘటనల చుట్టూ తిరగడం మొదలు పెట్టింది.

**ఆ**రోజు 8.30 గంటలకు బస్సులో ప్రయాణం చేస్తూ ఉన్నాను. బస్సు నిండా జనం కిటకిట లాడుతున్నారు. బస్సు సంపూర్ణత్వం పొందిన స్త్రీలా హుందాగా పొందిగ్గా పోతూ ఉంది. ఊయలలూపుతూ ఉన్నట్టు ఉండటం వల్ల కూర్చున్న వారంతా నిద్రకు ఉపక్రమించి ఉన్నారు.

అలా వెళ్ళుతున్న బస్సు సడన్ బ్రేక్ వేయడం చేత నిల్చున్న వాళ్ళంతా ముందుకు పడబోయి అంతలోనే తమాయించుకొని నిలబడ్డారు. "ఏమయ్యుంటిందబ్బా!" అని ఆలోచించుకొనే లోపలే బస్సు ముందు పెద్ద గొడవ, ఎవరో మరెవర్నో కొడుతున్నారు. కింద పడేసి కాలితో తొక్కుతున్నారు.

అప్పటికే బస్సులో ప్రయాణికులు మొత్తం దిగేశారు. ఏం జరిగిందనేది నాకు అర్థం కాలేదు. డ్రైవర్ ఎవరైనా యాక్సిడెంట్ చేశాడేమోనని బస్సు దిగి చూస్తే, అప్పుడు తెలిసింది నాకు. ఓ బడా రాజకీయ నాయకుడు, గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన వాడు, అతని అనుచరులు డ్రైవర్‌ని బూటు కాలితో తంతున్నారు. దెబ్బదెబ్బకు అతను అటు ఇటు దొర్లుతున్నాడు.

అప్పటికే అతని శరీరం రక్తసిక్తమై ఉంది. అక్కడ జరిగిందేమంటే .. అతని కారుకు డ్రైవర్ సైడ్ వదలలేదని ఇలా కొడుతున్నారట. అప్పటికి డ్రైవర్ సదరు వ్యక్తి కాళ్ళ మీద పడి "సార్! సింగిల్ రోడ్డు సైడివ్వడానికి కుదరలేదు" అని వేడుకుంటున్నా వారు శాంతించలేదు.

నేను కూడా వెళ్ళి నివారించడానికి ప్రయత్నించాను. నా ప్రయత్నం విఫలమైంది. ప్రయాణికుల్లో ఒక వర్గం సర్ది చెప్పక పోగా, డ్రైవర్ మీదనే పితూరీలు చేస్తూ ఉన్నారు. "వీడికి పొగరు. కొట్టాల్సిందే! మొన్న నేను బస్సు ఆపితే ఆపలేదు." అని ఒకరు.. ఇంకా ఏవేవో ఇంకొందరు .. అంటున్నారు. చివరకు కొట్టిన వాళ్లే చేతులు నొప్పి పుట్టి వెళ్ళి పోయారు.

నేనూ, ఇంకో ఇద్దరు ప్రయాణికులతో కలసి డ్రైవర్‌ని ఆసుపత్రిలో చేర్చి పోలీసు కంప్లయింటు రాసిచ్చేసరికి మధ్యాహ్నం అయ్యింది. సాక్షి సంతకం పెట్టడానికి ఎవరూ ముందుకు రాకపోయేసరికి నేనే పెట్టాల్సి వచ్చింది. కొంతమంది స్నేహితులు కూడా "ఎందుకు సాక్షి సంతకం పెట్టావు? ఇంతటితో వదలరు. పోలీస్ స్టేషను కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుంది. పైగా కొట్టినవాడు సామాన్యుడు కాదు. మన కెందుకు?" అని చీవాట్లు పెట్టారు.

అయితే అందుకు నేను ఒప్పుకోలేదు. ఈరోజు అతన్ని కొట్టారు. వదిలేస్తే రేపు ఇంకొకర్ని కొడతారు. లేదు మనల్నే కొట్టొచ్చు. అలాంటి వారికి శిక్ష పడాల్సిందే. నేనేమైనా ఫరవాలేదు" అన్నాను గట్టిగా. ఆ తరువాత ఈ కేసుకోసం చాలా రోజులు ఎదురు చూశాను. ఇన్నేళ్లు గడిచాక ఆ సంగతే మరచిపోయాను.

మూడు సంవత్సరాల తరువాత ఇప్పుడు కోర్టుకు పిలవడంతో ఎంతో సంతోషపడ్డాను. మా ఇంట్లో వాళ్లు మన కెందుకులే అన్నా వినలేదు. ఆ రాత్రి పడుకున్నాను గాని చాలాసేపటివరకు నిద్ర పట్టలేదు. ఆనాడు జరిగిన దౌర్జన్యకాండ నాకు గుర్తుకొస్తూనే ఉండింది. కోర్టులో ఎంత పకడ్బందీగా చెప్పి ఆ వ్యక్తికీ శిక్ష పడేలా చేయాలో అని వ్యూహాలు కూడా సిద్ధం చేసుకున్నాను.

**ఆ**రోజు నేను కోర్టు సమయానికి కంటే కొంచెం ముందుగానే వెళ్ళాను నల్లకోట్లు ధరించిన లాయర్లు ఒక్కొక్కరే వస్తూ ఉన్నారు. వారి వారి గుమస్తాలు వారి వెనకే వారి కట్టలు మోసుకొస్తూ ఉన్నారు. వస్తూ వస్తూ కోర్టు ప్రాంగణంలో ఎవరైనా కొత్త వారున్నారా అని పరిశీలిస్తూ ఉన్నారు.. కొత్త క్లయింట్లు ఏమైనా దొరుకు తారేమోనని ..

కోర్టు సమయం ఆసన్నమవుతూ ఉంది. ఈ కేసుకు సంబంధించిన కానిస్టేబుల్ వచ్చాడా లేదా అని నా దగ్గరున్న నంబరుకు ఒకసారి ఫోన్ చేశాను. ఒక వ్యక్తి ఫోన్ ఎత్తి చుట్టూ చూశాడు. నేను కలుసుకోవాల్సిన వ్యక్తి అతనే అయివుండొచ్చని భావించి, వడివడిగా అతని వద్దకు వెళ్ళాను.

"సత్యం అంటే మీరేనా?" అనడిగాడు. అవునన్నాను.

"ఈకేసు గురించి మీకేం తెలుసు? ఆరోజు బస్సులో ఉన్నారా?" అనడిగాడు.

"నేను ఉండటమే కాదు.. ఈ కేసు పూర్వపరాలన్నీ నాకు తెలుసు. ఎవరెవరు ఎలా దాడి చేసిందీ కోర్టుకు అన్నీ విడమరచి చెప్పాలనుకుంటున్నాను." అన్నాను. అతని ప్రతిస్పందన ఎలా ఉంటుందో అని అతడి ముఖం వంక చూశాను. అతనేదో చేదు గుళిక మింగిన వాడి మాదిరిగా ముఖం పెట్టి, ఇప్పుడు 'మీరు అలా చెప్పాల్సిన పని లేదు. నాకేమి తెలియదు. నేనేమి చూడలేదు' అని మాత్రమే చెప్పాలి" అన్నాడు.

అందుకు నేను "అలా ఎందుకు చెబుతాను? వారు దాడి చేసింది నిజం. నేను చూసింది నిజం. అలాంటి వారికి శిక్ష తప్పకుండా పడాలి లేదంటే వీరి ఆగడాలకు అంతు లేకుండా పోతుంది. నేను అబద్ధం చెప్పలేను" అనడంతో అతను అదోలా చూశాడు.

కోర్టు మొదలయ్యే సమయానికి ఆ ప్రాంగణమంతా జనంతో కిక్కిరిసి పోయింది. లాయర్లు తమ తమ క్లయింట్లకు తర్ఫీదు ఇస్తూ ఉన్నారు. ఎందుకంటే ఉన్నదున్నట్టు చెబితే కేసు నిలవకపోవొచ్చు. లేనిది కల్పించి చెప్పాలి. పైగా కొంతమంది డబ్బులు తీసుకొని తప్పుడు సాక్ష్యం చెప్పే వారు కూడా కోర్టు ఆవరణలో తచ్చాడుతుంటారు అందుకుని. బిళ్ళ జవాన్లు "సైలెన్స్ ... సైలెన్స్" అని అరుస్తూ ఉన్నారు. మధ్యమధ్యలో ఎవరెవర్నో పిలుస్తున్నారు. మూడుసార్లు ఒక్కొక్క పేరును ఒత్తి పలుకుతూ, వేలంపాట పాడినట్లే అనిపించింది నాకు.

ఈ లోపల పోలీసతను మరొక్కసారి వచ్చాడు. ఈ దఫా నిందితులను, వారి తరపు వకల్తా పుచ్చుకున్న లాయర్ని కూడా పిల్చుకొచ్చాడు. అందరూ కలసి నామీద తీవ్రంగా ఒత్తిడి తెచ్చి సాక్ష్యం చెప్పనియ్యకుండా చేయాలని ప్రయత్నించారు. నేను మళ్లీ అదే చెప్పాను... నా నిర్ణయంలో మార్పు లేదని. నేను ఇదే మాట బయటెక్కడైనా అనుంటే నా మీద దాడి చేసేవారేమో! అది కోర్టు కాబట్టి సరిపోయింది. వాళ్ళ వాలకం చూస్తే అలాగే అనిపించింది. లాయరైతే నిందితుల దగ్గర ఫీజు తీసుకొని ఉంటాడు.. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసు ఇలా అడగడేమిటి? ఇంతలో డ్రైవర్ తరపున వాదించాల్సిన డిపార్ట్మెంట్ లాయరు వొచ్చి వాళ్ళతోనే జత కలిసి పోయాడు. వీరందరిదీ ఒకటే మాట.. 'నాకేమి తెలియదు.. నేనేమి చూడలేదని చెప్పు' అని. ఎక్కడయినా నిజం చెప్పమని ప్రాధేయపడతారు. చెబుతా నన్నందుకు ప్రశంసిస్తారు. వీళ్ళేమిటి? నిజం చెప్ప కూడదంటున్నారు?

ఎవరెన్ని చెప్పినా నేను మాత్రం జరిగింది జరిగినట్టు నిజమే చెప్పాలనే కృతనిశ్చయంతోనే ఉన్నాను. అందుకే నా మీద వారికి గురి కుదరలేదు. పైగా నా మౌనం అంగీకారం అనుకున్నారో ఏమో నాతో మాట్లాడటం మానేసి వారిలో వారే చర్చించుకొంటూ ఉంటే నేను ఇక ఇక్కడుండటం మంచిది కాదని కోర్టు లోపలి కెళ్ళి సందర్శకులతో కలసి కూర్చున్నాను.

వెంటనే పిలుస్తారనుకొంటే ఎవరెవర్నో పిలుస్తున్నారు. అప్పటికే సమయం నాలుగయ్యింది. నాకు విసుగనిపించింది. వాయిదా వేసినా బాగుండుననిపించింది.

అప్పుడు న్యాయ వ్యవస్థ మీద నాకనేక అనుమానాలు కలిగాయి. పైగా ఈ కేసుకు కారణమైన డ్రైవర్ ఎందుకు ఇంతవరకూ రాలేదు... అని అతని గురించి ఆలోచిస్తూ ఉండగా.. అతడు కనిపించాడు. నాకు కొండంత ధైర్యమొచ్చింది. లేచి కోర్టు నుంచి వెలుపలకొచ్చి "హమ్మయ్యా! మీరు రారేమోనని భయపడ్డాను. మీరొచ్చారు, నాకు ధైర్యమొచ్చింది. ఆరోజు జరిగింది జరిగినట్టు చెబుతాను. మిమ్మల్ని కొట్టిన వ్యక్తులకు తప్పకుండా శిక్ష పడుతుంది" అన్నాను.

అతను చాలాసేపటివరకూ ఏమీ మాట్లాడలేదు. తరువాత "నేను మీకది చెప్పడానికే వచ్చాను. మీరిప్పుడు అలా చెప్పవలసిన పనిలేదు. ఈ కేసు విషయం నాకేమీ తెలియదంటే సరిపోతుంది" అన్నాడు.

ఆశ్చర్యమేసి... అతడి ముఖంలోకి చూశాను. అతను తనేదో తప్పు చేసినవాడిలాగ తల దించుకొన్నాడు. "మీరేనా ఆ మాటంటున్నది?" అన్నాను.

"అవును.. మీరు నా తరపున సాక్ష్యం చెప్పటానికి రావటం చాలా గొప్ప విషయం. అయితే అవతలి వ్యక్తి సామాన్యుడు కాదు. అతనితో కయ్యం మీకూ, నాకూ అంత మంచిది కాదని నా ఉద్దేశం" అన్నాడు.

"ఆరోజు వారు మిమ్మల్ని కొట్టింది నిజం. నేను చూసింది నిజం. ఇలా ఒక్కొక్కరే భయపడి పారిపోతే, అతని ఆగడాలకు అంతెక్కడుంటుంది? న్యాయమెక్కడ నిలుస్తుంది? పైగా నేను అబద్ధం చెప్పలేను. చెప్పినా నేను చెపుతున్నది అబద్ధమని సులభంగా అర్థమైపోతుంది. కాబట్టి నేను జరిగింది జరిగినట్టే చెప్పేస్తాను" అన్నాను.

ఈసారి అతడు "మీరు నా క్షేమం కోరేవారైతే నేను చెప్పమన్నట్టు చెప్పండి. నన్ను మరింత చిక్కుల్లోకి నెట్టాలంటే నిజం చెప్పండి" అని కళ్ళ నీళ్లు పెట్టుకున్నాడు.

చేసేది లేక వారు చెప్పమన్నట్టే చెప్పి కోర్టు నుంచి బయట పడ్డాను. సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసు కొట్టి వేయబడింది. నిందితులంతా సచ్ఛీలురని నిరూపించుకొన్నారు. కోర్టుకు కళ్ళుండవు చెవులే ఉంటాయి అంటే నేనేమో అనుకున్నాను. అన్ని వ్యవస్థలూ ఒక్కటై మనమే న్యాయ దేవత కళ్ళకు గంతలు కట్టి చెవులే కాని కళ్ళుండవంటే ఎలా?

■

## ఈ దుఃఖపు రుధిర రణ క్షేత్రంలో ...

- గవిడి శ్రీనివాస్

70192 78368

ఒక అనివార్యపు దుఃఖ స్థితి
ఏవో ఆక్రమిత దృశ్యాల్లో ముక్కలవుతూ
కార్యకారణ సంచలిత కల్లోలం ఇది

కళ్ళలో ఆకాశం చీల్చబడి
నా నిజ ఆనందపు శృతులు
లయ తప్పుతున్నాయి
దూరాలు దూకినా
నా మట్టి నన్ను వెంటాడుతుంది!

నాలో మునిగిన పర్వత శ్రేణులు
నాలో కుంగిన సూర్యోదయాలు
నాలో నోళ్లు తెరచిన లోయలు
నా ప్రపంచంలో దర్శనమౌతాయి
ఈ దుఃఖపు రుధిర రణ క్షేత్రం లో
అవ్యక్తాశ్రువులు ఘోషిస్తున్నాయి

ఛేదించ సాధ్యం కాని
నైరాశ్యపు లోకంలో నిట్టూర్పుల నడకల్లో
క్షణాల్ని ఒంపుకుంటూ విలపిస్తున్నాను
భళ్ళున వొలికే దు:ఖాన్ని
నా ఊరి చిత్రంగానో
నా ప్రాంత అభిమతంగానో
నా నేల జ్ఞాపకాల పుటగానో
నాలో ఒక వర్ణ క్షోభిత
దు:ఖ జలాలు ఉబుకుతుంటాయి

నేను విశ్వ మానవుణ్ణే
అయినా వేళ్లవెంట జారుతూ
ఈ దు:ఖపు రుధిర సంక్షోభంలో
రాలుతున్న బొట్టు బొట్టులో
రగిలే మమకారపు వేదనాగ్నిని నేను!

■

## ప్రియమైన చేతులు..!



బంజరును తాకి బంగరు మాగాణిగా
మలిచే పరుసవేది చేతులు
విత్తును నాటి ప్రాణప్రతిష్ట చేసే
పచ్చని సంజీవని చేతులు
ఆ చేతులంటే నాకు ఎంతో ఇష్టం..

కాడిని భుజాన శిలువలా మోసుకెళ్తూ
పారపట్టి పొలం పనులు జేసి
మట్టి పొరల్లా వఅర్ధాప్య ముడతలుపడ్డ
తూర్పార పట్టిన చేతులు
ఆ చేతులంటే నాకు ఎంతో ఇష్టం..

సరిహద్దుల్లో తుపాకీ పట్టి
శత్రువుని గీతకవతల తరిమి కొట్టినట్టు
దేశ ప్రజల ఆకలితో యుద్ధం చేస్తూ
తరాలుగా అందరికీ అన్నం పెట్టే చేతులు
ఆ చేతులంటే నాకు ఎంతో ఇష్టం..

- డాక్టర్ పెరుగు రామకృష్ణ
98492 30443

దేశానికి వెన్నెముకైన జాతిగా
గర్వంగా తన ధిక్కార స్వరాన్ని వినిపిస్తూ
నిరసన తెలుపుతున్న సమిష్టి కంఠంతో
మంచు గాలుల్లో పోరాట జెండా మోస్తున్న
ఆ చేతులంటే నాకు ఎంతో ఇష్టం..


□□□

తడినేల మీద గాయాల మొలకలెత్తక ముందే
ఆ చేతులు  గెలవాలి ..!!

■

## మౌనం

ఏటూరి నాగేంద్రరావు
74166 65323



అతడు
మౌనంగా నడకతో సంభాషిస్తుంటాడు
నిద్రపోతున్నప్పుడు తప్ప
నడకతో మహదానందాన్ని పొందే
నిశ్శబ్ద తాత్వికుడతడు
అసలు సంభాషణంటే ఏమిటి
ఒక దగా, తెలివైన మోసమా!
నిజాల వికృతత్వాన్ని వెలికితీసే ప్రయత్నమా!
ఒక్కోసారి కలల మైదానాల్లోకి
మరోసారి గాయాల ఊబిలోకి
అడుగులు వెతుక్కుంటూ పోవడం దాని నైజం!
బహుశా సంభాషణ సిద్ధాంత వ్యాసం
కావచ్చేమో!
మరి కొన్నేళ్లపాటు నిక్షిప్తం చేసుకునే
నమ్మకం కావచ్చు

ఎక్కడో ఒకచోట
అది అలంకారంగానో లేకుండా
పెనుగులాడుతుండొచ్చు
ఈ వెచ్చని నేలమీద
ఏ ఒక్క కలనీ సుఖించలేకుండా ఇంకి పోతున్నప్పుడు
తనలోకి అదిమి పట్టుకొనే
సంభాషణంటే నాకిష్టం

నడకతోనే
సమస్తము మౌనంతోనే
ఎగబాకైనా కింద పడైనా
మహా దిగులుతో ....

■


కవిత



# ఊరు నిద్రలేస్తున్నప్పుడు ...

- సాంబమూర్తి లండ
96427 32008

**చూ**డాలనుకుంటే
ఊరిని, అది నిద్రలేస్తున్నప్పుడే చూడాలి
పసిపాప నవ్వుతూ నిద్రలేచినట్టు
చందమామ మబ్బుల పడకమీంచి
ఆవలించుకుంటూ లేచి
వెన్నెల దుప్పటి సర్దుకుని వెళ్ళిపోతాడు
ఊరప్పుడు ఒక్కొక్క రేకూ విడువడుతున్న
సన్నజాజిలా అనిపిస్తుంది
పక్షులన్నీ చెట్లకు పువ్వుల్లా పూస్తాయి
గుండెలమీద నిద్రపోతున్న అమ్మ ప్రాణాన్ని
సున్నితంగా పరుపు మీదకు చేర్చి
తలగడను అడ్డం పెట్టి పడకమీంచి లేస్తున్నప్పుడు
అమ్మ ముఖంలోని భావాల్నీ
ఇప్పటివరకూ ఏ కవీ
అక్షరాల్లోకి అనువదించినట్టు లేదు
చేతుల్ని వెనక్కి పోనిచ్చి
చెదిరిన కురుల్ని సరిచేసుకుంటున్నప్పుడు
ఆమె కనుబొమ్మల లోయలోనే
సూరీడు పురుడోసుకునే సంగతి
ఏ ఆకాశానికీ తెలిసినట్టు లేదు
వాకిట్లో ఆమె అడుగుల సవ్వడి
ఊరికి వేకువ సంకేతం
వంటింట్లో ఆమె గాజుల చప్పుడు
కేలండర్‌కి మేలుకొలుపు
అప్పుడే లేచిన చీపుళ్ళు
వాకిలి మైదానంలో సాధన చేసే క్రీడాకారులు
పారిజాతమూ పసుప్పూల చెట్టూ
పూల ప్రసాదాల్ని పంచిపెట్టే పూజార్లు
ఆలస్యమైపోతుందంటూ అల్లరి చేసే సూరీడ్ని
మబ్బులు ఆటపట్టిస్తుంటాయి
సుప్రభాతాన్ని మోసుకుంటూ తిరిగే గాలి
ఒక్క అంగలో ఊరంతటినీ చుట్టేసివస్తుంది
కాసింత జీవశక్తిని జుర్రుకోవాలని
పెదాలు తెగ ఆరాటపడిపోతుంటాయి
పెద్దగా అంకెలు తెలియని కుక్కర్లు
మూడు నాలుగుసార్లుకే మూగబోతుంటాయి
ఊరప్పుడు
యుద్ధానికి సన్నద్ధమౌతున్నట్టుంటుంది
బారెడు పొద్దెక్కినాకో
సూరీడు జారిపోయాకో కాదు
చూడాలనుకుంటే
ఊరిని, అది నిద్రలేస్తున్నప్పుడే చూడాలి!



# ప్రమాదంలో మీడియా స్వేచ్ఛ

- ఎస్.వెంకట్రావు

**భా**రతదేశంలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిజానికి పేరెన్నికగన్న 'కారవాన్' పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ వినోద్ కె జోస్ ఫిబ్రవరి నెల ప్రారంభం రోజున ట్విట్టర్ తెరిచి చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ట్విట్టర్‌లో 'కారవాన్' పత్రిక అకౌంట్ ఆపేశారు. ఆరా తీస్తే... ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న రైతు ఉద్యమాన్ని కింది స్థాయి కథనాలతో విస్తృతంగా కవర్ చేయడమే పత్రిక అకౌంట్ మూసేయడానికి కారణమని తేలింది. 'భాతరదేశ ప్రభుత్వం జారీ చేసిన న్యాయపరమైన విజ్ఞప్తి మేరకు' ఈ చర్య తీసుకున్నట్లు ట్విట్టర్ తెలిపింది. రైతుల పాలిట ఉరి తాళ్లయిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మాట్లాడిన, ఆ చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి మద్దతిచ్చిన అనేక అకౌంట్లను ట్విట్టర్ ఇటీవలి కాలంలో మూసేసింది.

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతుల వార్తలను ఇప్పటికే కార్పొరేట్ మీడియా బ్లాక్ చేసింది. భారతదేశ చరిత్రలోనే అపూర్వమైన పోరాటం ఇది. లక్షల మంది రైతులు ఆరుబయట చలిలో, వర్షంలో ఇన్ని రోజులు సత్యాగ్రహ దీక్ష చేయడం బహుశా ప్రపంచ చరిత్రలో కూడా అపూర్వమైన సంఘటన. కానీ ఈ పోరాటానికి కార్పొరేట్ మీడియాలో వస్తున్న కవరేజీ చూస్తే అదృశ్య హస్తమేదో మీడియాకూ, పోరాటానికీ మధ్య అడ్డుగోడలా నిలబడినట్టుంది.

ఈ అడ్డుగోడలను ఛేదించుకుని రిపోర్టు చేస్తున్న పత్రికలు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా మీద ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. 'కారవాన్' పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ మీద, దాని యాజమాన్యం మీద, ఫ్రీలాన్స్ జర్నలిస్టు మన్‌దీప్ పునియా మీద ఇప్పటికే బిజెపి ప్రభుత్వం 'దేశ ద్రోహం' కేసు నమోదు చేసింది. ఎందుకు?... రైతుల ఉద్యమ వార్తలను ప్రచారం చేయడం ద్వారా వారు దేశద్రోహానికి పాల్పడుతున్నందుకని ప్రభుత్వం చెబుతోంది.

సింఘు సరిహద్దులో రైతుల దీక్ష గురించి విభిన్నమైన కోణాల్లో రాస్తున్న మన్‌దీప్ పునియా, ఆయన సహచరుడు ధర్మేందర్ సింగ్ కూడా ఇటువంటి 'శిక్ష'కు గురయ్యారు. రైతు వార్తలను ప్రారంభం నుంచి చురుకుగా ఇస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టులు వీరిద్దరు. స్థానికుల పేరుతో బిజెపి గూండాలు రైతుల శిబిరాలపై ఎలా దాడి చేసిందీ వారు తమ దగ్గర ఉన్న కెమెరా, మొబైల్ ఫోన్లలో రికార్డు చేసి చూపించారు. అందుకని బిజెపి పోలీసులు రాత్రికి రాత్రి వారిని అరెస్టు చేసి 'విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేశారు' అన్న నేరారోపణ చేశారు. జైల్లో పెట్టి చితక్కొట్టారు. కెమెరాలు విరగ్గొట్టారు. కుటుంబంతో మాట్లాడ్డానికి అనుమతివ్వలేదు. ఉన్న కాస్త ధైర్యం దిగిపోయి, అధికారుల ముందు మోకాళ్ల మీద నిలబడ్డానికి ఈ నిర్బంధం చాలదూ? కానీ యువ జర్నలిస్టులు లంగిపోలేదు. రైతు ఉద్యమకారులతో కలిసి తీహార్ జైల్లో ఉన్న మన్‌దీప్ పునియా దెబ్బలతో కందిపోయిన తన కాళ్లూ, చేతుల మీదనే జైలులో రైతులు చెప్పిన కథనాల నోట్సు రాసుకున్నాడు. బెయిలుపై బయటకు వచ్చిన తరువాత ఆయన ఆ నోట్సు ఆధారంగా మళ్లీ కథనాలు రాసి పంపాడు. 'నా కాళ్ల మీద విపరీతంగా కొట్టారు. దెబ్బలు తిన్న కాళ్ల మీదనే నేను నా జర్నలిజం కోసం నోట్సు రాసుకున్నాను' అని పునియా ట్వీట్ చేశాడు.

రైతు ఉద్యమానికి ముందు నుంచి విస్తృత ప్రచారం కల్పిస్తున్న వెబ్ పోర్టల్ 'న్యూస్ క్లిక్' మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఫిబ్రవరి 9న దాడి చేశారు. న్యూస్ పోర్టల్ ప్రధాన సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థ, వ్యవస్థాపక భాగస్వామి ప్రముఖ సాహితీవేత్త గీతా హరిహరన్‌లను 96 గంటలపాటు నిర్బంధంలో ఉంచారు. 73 ఏళ్ల పుర్కాయస్థ ప్రముఖ శాస్త్రవేత్త. 67 ఏళ్ల గీతా హరిహరన్ తన కథల సంపుటి 'ది థౌజండ్ ఫేసెస్ ఆఫ్ నైట్'కు 1993 కామన్వెల్త్ ఉత్తమ పుస్తకం బహుమతి పొందారు. వారిపై ఎందుకు దాడి చేశారో ఏమిటో అధికారికంగా సమాచారం చెప్పలేదు. కానీ కొన్ని కార్పొరేట్ పత్రికలకు పనిగట్టుకుని న్యూస్‌క్లిక్ ప్రతిష్టను దిగజార్చే విధమైన తప్పుడు 'వార్త' లీక్ చేశారు. 2009 నుంచి ప్రజా ఉద్యమాలపై అద్భుతమైన విశ్లేషణలు చేస్తున్నందుకు దేశాన్ని పాలిస్తున్న చీకటిశక్తులు వారికి విధించిన 'శిక్ష' ఇది.

జనవరి 26న ఎర్రకోట వద్ద కొంతమంది 'సర్కారీ' స్పాన్సర్డ్ రైతులు సృష్టించిన హింస, అవాంఛనీయ చర్యల నేపథ్యంలో 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకుడు సిద్ధార్థ వరద రాజన్, రిపోర్టర్ ఇస్మాత్ ఆరాలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటనల్లో పోలీసు కాల్పుల్లో ఒక యువ రైతు చనిపోయినట్లు రైతు తల్లిదండ్రులు చెప్పిన తొలివార్తను వీరు ట్వీట్ చేశారు. తరువాత ఆ రైతు పోలీసు కాల్పుల్లో కాకుండా ట్రాక్టర్ తిరగబడి చనిపోయినట్లు 'నిర్ధారణ' అయింది. ఏదైనా ఒక వార్త పూర్తిగా నిర్ధారణ అయ్యేలోపు దశల వారీ సమాచారం రావడం, దాన్ని మీడియాలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం సహజం. కానీ తల్లిదండ్రులను ఉటంకించినందుకు గాను కుట్ర సిద్ధాంతంతో కేసు నమోదు చేయడం వెనుక ఉన్నది ప్రజా రిపోర్టింగును అణచివేయాలన్న కుట్ర మాత్రమే! వీరు గాక అనంత్‌నాథ్, ఇండియా టుడేకు చెందిన రాజ్‌దీప్ సర్దేశాయి, జాఫర్ ఆఘా, ప్రశాంత్ కనోజియాలతో సహా ఇటీవల రైతు ఉద్యమ వార్తలు రాస్తున్న 9 మంది జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. అంటే రైతు ఉద్యమాన్ని అణచి వేయాలంటే ముందుగా భావ ప్రకటనా స్వేచ్ఛ మీద దాడి చేయడం అవసరమని ప్రభుత్వం భావిస్తున్నట్టుంది.

ఇటీవల ఉత్తరప్రదేశ్ లోని హత్రాస్‌లో దళిత యువతిపై అతి కిరాతకంగా జరిగిన అత్యాచారం కేసు వార్త సేకరించ దానికి వెళుతున్న మలయాళ జర్నలిస్టు సిద్ధిఖీ కప్పన్‌ను యు.పి పోలీసులు 'చట్ట విరుద్ధ చర్యల నిరోధక చట్టం' (ఉపా) కింద అరెస్టు చేసిన సంగతి మనకు తెలుసు. ఆయన నాలుగు మాసాలు జైలులో ఉన్నాడు. బిజెపి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నందుకు 2017లో గౌరీ లంకేశ్‌ను హత్య చేసిన విషయమూ మనకు తెలిసిందే. జమ్మూ-కాశ్మీర్ వార్తలు సేకరించే పాత్రికేయుల పైన కూడా బిజెపి ప్రభుత్వం ఇటువంటి నిర్బంధాలు ప్రయోగిస్తోంది.

అంతర్జాతీయ పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ ట్వీట్‌ను షేర్ చేసినందుకుగాను బెంగళూరుకు చెందిన 21 ఏళ్ల దిశా రవిపై దేశ ద్రోహం నేరం మోపడం పట్ల అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత దేశంలో మీడియా స్వేచ్ఛపై నగ్నంగా జరుగుతున్న దాడులు దేశ ప్రతిష్టను బాగా దిగజారుస్తున్నాయి. గతంలో ప్రభుత్వాల హయాంలో కూడా మీడియా స్వేచ్ఛపై దాడులు జరిగాయి. కానీ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ దాడులు 30 శాతం పెరిగాయని అధికారిక గణంకాలు తెలుపుతున్నాయి. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారతదేశ స్థానం ప్రతి ఏటా పడిపోతూ వస్తోంది. గత ఏడాది రెండు పాయింట్లు తగ్గింది. పత్రికా స్వేచ్ఛ హీనస్థితిలో ఉన్న 180 దేశాల్లో మనం 142వ స్థానంలో ఉన్నామంటే బిజెపి ప్రభుత్వం భారతదేశ పరువు ఎంతగా తీసేస్తున్నదో అర్థమవుతుంది.

పాత్రికేయులపైనా, మీడియాపైనా ప్రభుత్వ అణచివేతలను మీడియా వాచ్‌డాగ్ సంస్థలు, మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రభుత్వ చర్యలు సెన్సార్ కిందకు వస్తుందని పేర్కొన్నాయి. 'జర్నలిస్టులపై కేసులు పెట్టడం అనేది వారిని వేధించేందుకు, బెదిరించేందుకు, మీడియా మెడలు వంచేందుకు చేస్తున్న పనే' అని ఎడిటర్స్ గిల్డ్ పేర్కొంది. 'ప్రభుత్వం తను కోరుకున్నట్లు మీడియాను నడపదలచుకుంది' అని 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్' ఆసియా పసిఫిక్ డెస్క్ విమర్శించింది.

ప్రభుత్వ వార్తలతోపాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాల వార్తలను సేకరించి ప్రజలకు అందించడం పత్రికల బాధ్యత. ఈ బాధ్యతలు నిర్వహించే పాత్రికేయులను నిర్బంధించడం, కేసులు పెట్టడం, వేధించడం అంటే ప్రజాస్వామ్యానికి అడ్డుకట్టలు వేయడమే. మీడియా స్వేచ్ఛను అరికట్టడం ప్రజల ప్రజాస్వామిక హక్కులను హరించడమే. మనం మేల్కొని నిరసన గళం విప్పకపోతే నియంతృత్వ రాజ్యానికి ఇది బాటలు వేస్తుంది. ■

## కవిత

# శేషమే లేని విశేష గ్రంథం

- సోంపాక సీత
86393 11050

పుస్తకం ఆమెదే
పైన ముఖచిత్రమూ ఆమెదే
భూమిక కూడా ఆమే
మోసే భారం కూడా ఆమే
కానీ విషయ సూచిక, ప్రకటనలు మాత్రం
ఏలిన వారివే..!

పుటల్లోని అక్షరాలను కలిపే పదం ఆమె
పదాలను వాక్యాలుగా
వాక్యాలను సముదాయంగా
మలిచే సహనం ఆమెదే!
కామాలు, సెమికోలన్ల గుర్తులు పాటిస్తూ
గుంభనంగా
కాలాన్ని కదిల్చే కదలిక ఆమే
కానీ పేరాగ్రాఫ్‌లుగా విభజించి
పాలించే నైపుణ్యం ఏలినవారిదే..!

పాఠాలు, గుణపాఠాలు పిట్టకథలు వినే ఓర్పు ఆమే
క్లుప్తంగా, సంక్షిప్తంగా, గాలిదుమారాలు రేగినపుడు
విస్తారంగా, ప్రేమ మంచు కురిసినపుడు
బహుళైచ్ఛికాలను స్వీకరిస్తూ జవాబివ్వాల్సింది ఆమే
ప్రశ్నపత్రం మాత్రం ఎపవిడూ ఏలినవారిదే..!

భయభక్తులతో రాస్తే?
విశిష్టశ్రేణి..
అణకువతో రాస్తే ?
ప్రథమ..
ఆవేదనతో రాస్తే ?
మధ్యమ..
ధిక్కారంతో రాస్తే ?



ఫెయిల్యూర్..

ఉపోద్ఘాతాలతో ఉల్లేఖనీయంగా వెలగలేని ఆమెయైనా
స్వతంత్రంగా స్వగతం వినిపించగల బాణీ ఆమె..
సాధికారత పుటలు వెలసినా
శేషమేలేని విశేష గ్రంథరాజం ఆమె..
మసకబారిన పుటలను సైతం
సశేషమైన విశేషాలతో అలంకరించుకోగల
అతివ ఆమె..!

■

# భిన్నత్వంలో ఏకత్వం

మానవత్వం పరిమళిస్తే
దానవత్వం దహించిపోతే
సమతమమతల సుగంధం
ప్రపంచమంతా నిండిపోతే
మనుషులంతా ఒక్కటై
మనసులన్నీ ఏకమై
స్నేహగీతం పాడుతుంటే...
దేహాలు వేరైనా
మనులంతా ఒక్కటే కదా!
వివక్షల విషవృక్షాన్ని
నేలకూల్చితే
పుడమి పౌరులు ఏకమై
ప్రగతిదారుల నడువ గలిగితే
మానవీయ సౌరభాలు
మదుల నిండి మానవత
మకరందం పొంగి పొరలితే
జగతిన ఘనతై
సమతారాగం వినిపిస్తే
విశ్వ మానవులు
భిన్నత్వంలో ఏకత్వం సాధిస్తే
సంతోషాల సంబరాల
సరిగమలు పాడవా..!
విశ్వజనీనత వెల్లివిరియదా...!

- డా.గన్నోజు శ్రీనివాసాచారి
85558 99493

## కవిత

# బొమ్మలాట

-డాక్టర్ పళని
99123 43804



**నా** కిష్టం, బొమ్మంటే
మౌనంగా ఉంటుంది
మందితో మాట్లాడిస్తుంది
మనుషులు పెట్టిన బొమ్మ
మనుగడ శాసించే బొమ్మ

నాకెంతో ఇష్టం, బొమ్మంటే!

ఈ బొమ్మకు అందరూ బిడ్డలే
కానీ, పుట్టుక నుంచి దాయాదులే
అప్పుడైతే భూమి కోసం పోరాటం
ఇప్పుడైతే బొమ్మల కోసం ఆరాటం

అందుకే, నా కిష్టం, బొమ్మంటే!

ఒకరి మతం శాంతి
మరొకరిది విశ్వ శాంతి
అయినా బొమ్మతో పేచి
నా దేశం విధ్వంసాల కాణాచి

సరేలే! నాకిష్టం, బొమ్మంటే!

ఈ బొమ్మకు లేదు కులం, లేనే లేదు మతం
అయినా కలకలం, కొనసాగే ముసలం

అయినా సరే! నా కిష్టం, బొమ్మంటే!

ఒకడు గెలవడానికి బొమ్మ
మరొకడు నిలవడానికి బొమ్మ
అందరికీ అవసరమైన బొమ్మ
అందాలొలికే బొమ్మ

అందుకే, నాకు భలే ఇష్టం, బొమ్మంటే !

కళ్ళెత్తి చూడని బొమ్మ, కదిలించే బొమ్మ
పెట్టేందుకు సిద్ధాంతం, కూల్చేస్తే రాద్ధాంతం

అయితేనేం? నా కిష్టం, బొమ్మంటే!

పూజలకు కేరాఫ్ అడ్రస్
ప్రార్థనలకు మరో రకం డ్రెస్
గోడల ముందు వజ్రాసనం
అందరికీ అసలైన వ్యసనం

అరెరే! అందరికీ ఇష్టమే, బొమ్మంటే!

అబ్బో! మీకూ ఇష్టమేనా బొమ్మంటే?
ఆహా ! ఏదో జెండా, ఎజెండా ఉన్నమాటే !
అవునంటే ఇదే నిజం, కాదంటే మరో ఇజం!!

అందుకే; నా కిష్టం... అదంటే!



# బుచ్చిబాబు గారు మెచ్చితే చాలనుకున్నాను

## 2001లో 'గమనం' ఇంటర్వ్యూలో శివరాజు సుబ్బలక్ష్మి

**"జ్ఞాపకాలు వేధిస్తాయే గానీ ఆప్యాయంగా పలకరించవు"** అంటాడు ఓ కవి. వేధించే జ్ఞాపకాల్ని తలుచుకుంటూ, స్మరించుకుంటూ బతకడంలో ఆనందాన్ని వెదుక్కుంటారు కొందరు. ఆ కోవకు చెందినవారు శివరాజు సుబ్బలక్ష్మి. ఇంతకీ ఎవరి జ్ఞాపకాలు? బుచ్చిబాబు జ్ఞాపకాలు. ముప్పయి మూడేళ్ళ కిందట ఆయన చనిపోయారు. నవలా రచయిత, కథకుడు బుచ్చిబాబు గురించి ప్రత్యేకించి పరిచయమక్కర్లేదు. చలం నవలల తర్వాత మళ్ళీ మళ్ళీ పునర్ముద్రణ పొందుతూ ప్రతి తరం పాఠకుల్ని చదివిస్తున్న ఆయన ఏకైక నవల 'చివరకు మిగిలేది.' చాలామంది తమ దైనందిన అధ్యయనంలో భాగంగా ఈ నవలలోని కొన్ని పేజీలయినా చదువుతారు. బుచ్చిబాబు కథలెన్నో రాసినా ఈ నవల ద్వారా తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆ బుచ్చిబాబు భార్య శివరాజు సుబ్బలక్ష్మి, డెబ్బయి అయిదేళ్ళు పైబడిన సుబ్బలక్ష్మి గారిని కదిలిస్తే బుచ్చిబాబు గురించిన జ్ఞాపకాల్ని చెప్పుకుపోతారు. ఈ వయసులోనూ బుచ్చిబాబు గారి జ్ఞాపకాల్ని స్మరించుకుంటూ జీవనయానం సాగిస్తున్నారామె. బుచ్చిబాబులానే తనూ సాహిత్య పిపాసి, చిత్రకారిణి.

ఆమె నలభైకి పైగా కథలు రాశారు. ఓ నవల రాశారు. బొమ్మలెన్నో గీశారు. ఇప్పటికీ అప్పుడప్పుడు బొమ్మలు వేస్తుంటారు. ఆమె రాసిన వాటిలో 28 కథల్ని ఎంపిక చేసి ఒక పుస్తకంగా అచ్చువేశారు. ఆ కథలు చదివే క్రమంలో ఆమెతో ముచ్చటించాలనిపించింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆమెను కలుసుకున్నాం. హైదరాబాద్ నగర శివార్లలోని నాచారం దగ్గరనున్న మల్లాపురం వద్ద ఆమె ఇల్లు. ఒకరోజు ఆమె ఇంటికి వెళ్ళాం. దాదాపు రెండు గంటల సేపు సమయం చూస్తుండగానే గడిచిపోయింది. జ్ఞాపకాలు వెల్లువెత్తాయి. ఆ జ్ఞాపకాలే ఆమెకు ఒకింత ఊరడింపు, ఓదార్పు. అందుకే ఇలా ఎవరితోనైనా బుచ్చిబాబు గారి గురించి మాట్లాడిన రోజు తను ఇంకా చురుగ్గా ఆనందంగా ఉంటారని ఆమె తమ్ముని కొడుకు సుబ్బారావు చెప్పారు. బుచ్చిబాబు సుబ్బలక్ష్మి గార్లకు పిల్లలు లేరు. తమ్ముని కొడుకునే తమ కొడుకుగా పెంచుకున్నారు. తన పెళ్ళయ్యాక బుచ్చిబాబుతో కలిసి జీవించింది ముప్పయ్యేళ్ళయితే, ఆయన లేకుండా మరో ముప్పయ్యేళ్ళకు పైగా గడిచిపోయాయి. అయినప్పటికీ నిన్నమొన్ననే ఆయన తనని వదిలి వెళ్ళారన్నట్టుగా చెబుతారు. బుచ్చిబాబుగారి గురించి ప్రస్తావించినప్పుడు, తన కథలు, తన భావాల కన్నా బుచ్చిబాబు గారి గురించే ఆమె ఎక్కువగా మాట్లాడారు. ఆమెతో జరిపిన సంభాషణ సారాంశమిది.

**2001లో సాహితీ స్రవంతి వెలువరించిన *గమనం* సాహిత్య సంచికలో ప్రచురించిన ఇంటర్వ్యూ ఇది. ఫిబ్రవరి 6వ తేదీన కన్నుమూసిన సుబ్బలక్ష్మి గారికి నివాళిగా పునర్ముద్రిస్తున్నాం. – ఎడిటర్**

◆ ◆ ◆

తూర్పు గోదావరి జిల్లాలో ఇప్పనపాడు మా ఊరు. మా తండ్రి గారి ప్రోద్బలంతో చిన్నతనాన సంగీతం, సాహిత్యం నేర్చుకున్నాను. సంస్కృత భాష మీద నాకు ఆసక్తి ఉండేది. మా నాన్నగారి పెద్ద తల్లికి పిల్లలు లేరు. ఆమె మా నాన్నగారిని పెంచి పెద్ద చేసింది. ఆమెకు అరవై ఎకరాల మాగాణి ఉండేది. అది కౌలుకిచ్చి మమ్ములందరినీ రాజమండ్రిలో చదివించింది. ఆమె దానధర్మాలకు పెట్టింది పేరు. అలా ఆమె ఆస్తంతా హరించుకుపోయింది. నేను పెద్దగా చదువుకోలేదు. పెళ్ళి తర్వాత కూడా చదువు సాగించాను. బనారస్ మెట్రిక్

పాసయ్యాను. వీటికన్నా బుచ్చిబాబు గారి వద్ద నేర్చిన చదువే ఎక్కువ. బహుశా అపుడు నాకు పన్నెండేళ్లు. ఓ రోజు సాయం సంధ్య వేళ బుచ్చిబాబు గారు, వాళ్ల అన్న గారు నన్ను చూడటానికి వచ్చారు బుచ్చిబాబు గారు సహజంగా బిడియస్తుడు. కనక తను అప్పుడేం మాట్లాడలేదు. పెళ్ళి తర్వాత బుచ్చిబాబు గారు, నేను కలిసి ఒక కొత్త జీవితంలోకి అడుగు పెట్టాం.

◆ ◆ ◆

బుచ్చిబాబు గారితో కలిసి మద్రాసు, అనంతపురం, విజయవాడ తిరిగాను. తొలి రోజుల్లో ఈ మూడు చోట్ల చాన్నాళ్ళు ఉన్నాం. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చాం. ఆకాశవాణిలో చేరకముందు ఆయన కాలేజీల్లో పాఠాలు చెప్పేవారు. రోజు చదవడం, పాఠాలు చెప్పడం ఆయన దైనందిన వ్యాపకంగా ఉండేది. ఆకాశవాణిలో చేరేవరకు ఆయన ఈ పని చేశారు.

బుచ్చిబాబు గారి సహచర్యంతో నేను కూడా కథలు రాయడం ఆరంభించాను. బహుశా 1955లోనో, తర్వాతనో గానీ మొత్తమ్మీద అరవైల లోపే కథలు రాస్తూ వచ్చాను. నాకు సంస్కృతం తెలిసినంతగా ఇంగ్లీషు తెలియదు. బుచ్చిబాబు గారు అపారమైన ఇంగ్లీషు సాహిత్యాన్ని చదువుతూ పొందే జ్ఞానాన్ని నాకు కొంత పంచేవారు. బుచ్చిబాబు గారి బామ్మ శివరాజు సుబ్బమ్మ భాగవతం లాంటి ఆధ్యాత్మిక గ్రంథాలు చదివి వినిపించటం వల్ల నాకు కొంచెం పౌరాణిక సాహిత్యంపై ఆసక్తి కలిగింది. బుచ్చిబాబు గారు విపరీతంగా చదివేవారు. సాహిత్య మొక్కటే కాదు; ఫిలాసఫీ, సైన్స్, ఆస్ట్రానమీ మొదలైన సబ్జెక్టులన్నీ చదివేవారు. డిటెక్టివ్ నవలల్ని కూడా వదిలి పెట్టేవారు కాదు. అయితే సంస్కృతం విషయానికి వస్తే ఏవైనా పదాల గురించి అడిగేవారు. వాటి అర్థాన్ని నా దగ్గర తెలుసు కునేవారు. ఇంగ్లీషు గురించి నేను ఏదైనా అడిగితే చెప్పేవారు.

◆ ◆ ◆

'మనోవ్యాధికి మందుంది' అచ్చయిన నా మొదటి కథ. ఎప్పుడు అచ్చయిందో సరిగా గుర్తులేదు. ఇది మేం పూనాలో ఉండగా అచ్చయింది. ఓరోజు సాయంత్రం బుచ్చిబాబు గారు వెనక ఏదో దాచుకుని "నీ కోసం ఏం తెచ్చానో చెప్పుకో చూద్దాం" అన్నారు. ఆయన కథ ఓ పేపర్‌లో వచ్చిందేమో అనుకున్నాను. తీరా చూస్తే అది నేను రాసిన కథ. చాలా ఆనందమేసింది. అలా కథలు రాయడం ఆయన సహచర్యంలో మొదలైంది. ఎప్పుడైనా బుచ్చిబాబు గారి మెప్పు కోసం రాశాను తప్ప సమాజం మెప్పు కోసం కాదు. ఎవరు మెచ్చినా మెచ్చుకున్నా ఆయన మెచ్చుకుంటే చాలు అనుకునేదాన్ని. కథ రాశాక ఆయనకు చూపించేదానిని. ఏమైనా మార్పులు అవసర మనిపిస్తే చెప్పేవారు. తాను కూడా ఏమైనా రాస్తే నాకు చదివి వినిపించేవారు. నా అభిప్రాయానికి విలువనిచ్చేవారు. రుక్మిణీనాథ శాస్త్రి (జరూక్ శాస్త్రి) గారు అప్పుడప్పుడు వచ్చేవారు. ఆయన నా కథల్ని బాగా ఇష్టపడేవారు. "నువ్వు రాసే కథల కన్నా సుబ్బలక్ష్మి గారి కథలు నాకు బాగా నచ్చాయి." అని బుచ్చిబాబు గారితో అనేవారు. నేను రాసిన కథల్లో నాకు బాగా నచ్చిన కథ ఏదంటే– "ఒడ్డుకు చేరిన ఒంటరి కెరటం".

కథలు కాకుండా నేను ఒక చిన్న నవల రాశాను. 'తరుణ' అనే పత్రిక వచ్చింది. ఇప్పుడయితే దాని కాపీ కూడా లేదు. అరుదుగా తప్ప ఇప్పుడు కథలు రాయడం లేదు. బుచ్చిబాబు గారు పోయాక ఎక్కువగా రాయలేదు. మాదిరెడ్డి సులోచన ఇంటికి వచ్చి 'మీరు మళ్లీ కథలు రాయాల'ని ప్రోత్సహించేది. ఆమె ప్రోత్సాహంతోనే అప్పుడప్పుడు కొన్ని కథలు రాశాను. వేదగిరి రాంబాబు వాళ్ళు కొన్ని కథల్ని పుస్తకంగా ప్రచురించారు. ఇప్పటికీ అడపాదడపా రాసినా పత్రికలకు పంపడం లేదు. నా రాతలు వీళ్ళకు నచ్చుతాయా? ఎందుకు ఇబ్బంది పెట్టడం అనిపిస్తుంటుంది. నేను రాసిన కథల్లో కొన్ని కన్నడలోకి, తమిళంలోకి అనువాదమయ్యాయి.

◆ ◆ ◆

బుచ్చిబాబు గారు బొమ్మలు గీసేవారు. దామెర్ల రామారావు గారి బొమ్మలంటే బాగా ఇష్టపడేవారు. ఆయన ప్రభావం తన మీద ఉంది. కొనకళ్ళ వెంకటరత్నం గారి వద్ద చిత్రలేఖనం నేర్చుకున్నారు. ఆయన ప్రకృతిని తన చిత్రకళలో అత్యద్భుతంగా పట్టుకోగలిగారు. మా నాన్నగారి ఊరు చుట్టుపక్కల అంతా చక్కటి దృశ్యాలు ఉండేవి. ఈ దఅశ్యాలనే ల్యాండ్ స్కేప్స్‌గా వేసేవారు. ఆయన స్ఫూర్తితో, ప్రోత్సాహంతో నేనూ బొమ్మలు వేయడం నేర్చుకున్నాను.

బుచ్చిబాబు గారు ఎప్పుడూ హుషారుగా ఉండేవారు. గొప్పవాళ్ళను కలుసుకోవడం, మాట్లాడటం, చూడటం ఆయనకు సరదా. ఆయన వల్ల నేను టాగూర్‌ని, నేతాజీని చూసాను. 1938లో సామర్లకోట మీదుగా రవీంద్రనాథ్ టాగోర్ వెళుతున్న సంగతి ఆయనకు తెలిసింది. ఆరోజు నన్ను స్టేషన్‌కు తీసుకెళ్ళారు. మేం ఇద్దరం దూరంగా నిలబడ్డాం. కిటికీ దగ్గర కూర్చున్న టాగోర్‌ను చూపించారు. దూరం నుంచే ఆయన్ని చూశాను. అప్పుడు నా వయసు పదమూడేళ్ళు. ఆ తర్వాత కొన్నాళ్ళకు మా ఊరు వచ్చిన సుభాష్ చంద్రబోస్‌కు నాచేత పూలమాల వేయించారు. దీంతో ఇంట్లో వారు బుచ్చిబాబు

గారిని తిట్టారు. చిన్నపిల్ల చేత ఇలాంటి పనులు చేయిస్తావా అన్నారు. అయితే ఆయన ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. నేతాజీ గొప్పతనం గురించి వాళ్ళకు తెలిసే అవకాశం లేదు మరి! బుచ్చిబాబు గారి సహకారం లేనిదే అలాంటి గొప్పవాళ్ళను నేను చూడలేకపోయేదాన్ని.

విజయవాడలో ఉన్నప్పుడు చలంగారు మా ఇంటికి వచ్చారు. గోపిచంద్, పాలగుమ్మి పద్మరాజు, మొక్కపాటి, విశ్వనాథ లాంటి వారు వచ్చేవారు. వీళ్ళ కబుర్లతో మా ఇంట్లో ఎప్పుడూ ఒక సాహిత్యగోష్ఠి జరుగుతున్నట్లుగా ఉండేది. శ్రీశ్రీ గారు కూడా తరచూ వచ్చేవారు. ఆయన మద్రాసు వెళ్ళిపోయాక మరెన్నడూ కలవలేదు. బుచ్చిబాబు గారు మరణించాక చలం గారిని కలిశాను. "ఆనాటి చలం ఈనాటి చలం వేరు వేరమ్మా" అన్నారు. "నిన్ను ఇలా చూడవల్సి వచ్చినందుకు దిగులు కలుగుతుందమ్మా" అని బాధపడ్డారు. సావిత్రి, పుష్పవల్లి, కృష్ణకుమారి వంటి సినిమా తారలు మా కుటుంబంతో సన్నిహితంగా మెలిగేవారు. సావిత్రి తొలి రోజుల్లో నాటకాల్లో నటించారు. ఆమె పరిపూర్ణమైన నటిగా మారారు.

♦ ♦ ♦

స్త్రీవాదం మంచిదే. కాని పురుషుల్ని ద్వేషించడాన్ని మాత్రం నేను వ్యతిరేకిస్తాను. పురుషులు అణచివేస్తున్నారని, అన్యాయం చేస్తున్నారని మనం గొడవ పడుతున్నాం సరే. కాని మనం మనకు జరుగుతున్న అన్యాయాల్ని ప్రశ్నిస్తున్నామా? వితంతువులు ఎదురయితే ఎందుకు పక్కకు తప్పుకుంటారు? వితంతువుల్ని శుభకార్యాలకు రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు? ఫెమినిస్టులు ఎన్నడయినా వీటి గురించి అడిగారా? ముందుగా ఇలాంటి వాటి గురించి నోరు విప్పాలి. ప్రశ్నించాలి. ఆత్మగౌరవంతో జీవించాలనుకోవడంలో తప్పులేదు. అయితే ద్వేషంతో ఏం సాధించలేమని గుర్తించాలి. పోరాడాలి. అవసరమైనప్పుడు సర్దుకుపోవాలి.

♦ ♦ ♦

ఇలా మా సంభాషణలో ఆత్మీయమైన అనేక విషయాల్ని చెప్పుకుపోయారు. వెళ్ళేముందు అరుదైన తమ ఆల్బమ్ చూపించారు. కృష్ణశాస్త్రి, బాపూ రమణలు, బెజవాడ గోపాలరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావు, నండూరి, దాశరథి, డి.వెంకట్రామయ్య, గోపిచంద్, పుష్పవల్లి, కృష్ణకుమారి మొదలైన వారి అరుదైన ఫొటోలు ఈ ఆల్బమ్‌లో ఉన్నాయి. విభిన్న సందర్భాల్లో బుచ్చిబాబు దిగిన ఫొటోలు ఉన్నాయి. అన్నిటిని చూశాక వీటన్నిటిని కలిపి అందమైన ఆల్బమ్‌గా అచ్చు వేస్తే చిరకాలం గుర్తుండిపోతుంది కదా అనిపించింది.

సంభాషణ : **క్రాంతి**



## ప్రశ్న ఎవరికి?

**- మూని వెంకటా చలపతి**

**73966 08221**

కాలానికి గాలం వేసే మనిషి
తనే ఎరగా మారి పోయి
కాల చక్ర భ్రమణంలో చిక్కుకొని
కన్నీటి సుడిగుండంలో మునకేస్తున్నాడు..!

నమ్మకాన్ని నాలుగు గోడల మధ్య నిలబెట్టి
పుణ్యం కోసం అర్చించి పూజించి
పండగ చేసుకునే మనిషి!
కులాలకు మతాలకు బీజం వేసి
హేయమైన బురద సామ్రాజ్యంలోని
ధవళ పువ్వులను చూసి
గేయాలు రాస్తాడు!!
నేటి నాగరికతకు ప్రతీక అంటాడు..!

విశ్వాసాన్ని వీధి అరుగు పక్కన నిలబెట్టి
కంచంలో మెతుకులను చూపెట్టి
జీవకారుణ్యానికి
చిరునామా నేనే అంటాడు..!

పుస్తకాల్లోని అక్షర విత్తులు
మస్తిష్కంలో మొలకెత్తుతున్నాయి కానీ
మనిషి మనసులో వికసించడం లేదు
విశ్వమానవ ప్రేమకోసం పుష్పించడం లేదు

ఎక్కడ తప్పు మరి ఎక్కడ ఒప్పు
కనుగొనాలి ఇద్దరు మనుషుల్ని కలిపిన బంధాన్ని
రచించాలి మీరు మేము కలిసిన రేఖా వాక్యాన్ని
కావాలి లేత చేతుల స్పర్శ ధరణికి ... ■

# కవితలు

## privatisation@india.com

- బంగార్రాజు
85003 50464

నీదేం పోయింది నోటిమాటేగా
కోటానుకోట్ల ఎలకలకి ప్రాణసంకటం గదో..
నదులు సముద్రాలు అడవులు ఆకాశం
ఇలా ప్రవేటీకరణ పాలసీల చాపకింద నీరు
పోనుపోను ఎక్కడబడితే అక్కడ
సలసలా కాగుతున్న రక్తం చుక్కల
ఫౌంటెన్లై చిమ్ముతున్నాయి!

పుల్లాపుల్లా పేర్చుకున్న పిట్టగూళ్ళు
గాలి దుమారానికి గల్లంతైపోవడం
ఎప్పుడన్నా చూసావా...?!
పిట్టపడే శ్రమా దాని ఆశలూ ఏమైపోతాయి
నీపాటికి నువ్వు
నిర్ణయాల్ని నేలమీద జల్లేసిపోతే
నీటికట్టు కట్టేదెవరు?

ఓటు విలువ తెలిసినోడివైతే
ఓట్లకట్టల తెప్ప మీదనే
ఒడ్డు చేరావని గుర్తులేకపోతే ఎట్టా
దానికీ ప్రాణముందని గ్రహింపు లేకపోతే ఎట్టా
పాలన మరీ అంత భారమైతే చెప్పబ్బా
మోయడానికి వందకోట్లమంది ఉన్నారు!

ఏ కార్పొరేట్ మంత్రగాళ్ళో
నీకు చేతబడి చేసినట్టున్నారు
పిచ్చి పేలాపనలన్నీ పేలుతున్నావ్
రేప్పొద్దున్న అధికార పీఠం అద్దెకిచ్చి
పాలన కూడా ప్రవేటీకరణంటావా ఏంది?
నీపాసుగూల మా లావోడివి దొరికావే
privatisatiin@india.com అని
ఈదేశ మెయిలైడి మార్చేట్టున్నావ్గా!?



- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

## నేను శిథిలమైనప్పుడల్లా...

అన్ని గాయాలు
మలాం రాస్తే మాయంగావు
అనుభవాలై ఇంకిపోతాయి!
ఎన్ని ప్రమాదాలు అధిగమించినా సరే
పరాభవాలు
వేరు పురుగులై లోన తొలుస్తుంటాయి!
ఒదిగి ఒదిగి ఎదిగినా
ఎవరో ఒకరు బలిసిపోయిండంటారు
పావురం కుప్ప కూలిపోతుంది!

కాయలు కాసిన భుజాలకు
కనీస కనికరం దక్కదు
అక్షరమై ఒదిగిపోతే ఒకింత స్వాంతన!
రక్త సంబంధాలకు
రెక్కలు మొలుస్తాయా
గూడును గాలికొదిలేస్తాయి!
బరువులు మోయడం
అలవాటు పడ్డ ప్రాణం
ఇదంతా నీకెందుకంటే ప్రాణం ఊసురుమంటది!

తాపత్రయాలన్నీ
ఒట్టి భ్రమలే
గ్రహించే లోపు దీపం కొండెక్కుతుంది!
చరిత్ర అబద్ధం చెప్పదు
వైభవాలు ఏవైనా ఎల్ల కాలముండవు
శిథిలాలే జ్ఞాపకాలను మోస్తుంటాయి!!

## కవిత

## ప్రశ్నించుకో...!

- సునీత పేరిచర్ల
83094 20900



ఏళ్ళు గడిచిపోతున్నాయి
నీ మనసుకు తగిలిన గాయం మాత్రం మానలేదు
పైకి కఠినంగా కనిపించే నువ్వు
లోలోపల ఇంత సున్నితంగా ఉంటావని
ఆ గాయం వల్లే తెలిసింది!

అయినా సమస్యలపై, జ్ఞాపకాలపై పోరాడకుండా
పారిపోదామనుకుంటున్నది నువ్వేనా అని
ఆశ్చర్యం కలుగుతుంది!
ఆ గాయం మాన్పే మందు కోసం వెతుకుతున్నావేమో
ఆ మందు నీ దగ్గరే ఉంది...

ఇంతకూ నాకో సందేహం...!
నీతో ఆటల్లో కానీ, మాటల్లో కానీ
పోరాడి ఎవరైనా గెలవగలరా...!
మరి ఆ జ్ఞాపకాలకు మాత్రం
నిన్నోడించే అవకాశం ఎలా ఇచ్చావ్..?

బడిలో మాస్టారు ఇచ్చే చిన్న బహుమతి కోసం
పరుగుపందెంలో అంత కష్టపడి
అందర్నీ దాటుకుని పరుగెత్తావ్ ...!
జీవితం ఇచ్చే విలువైన ఆనందాన్ని పొందడం కోసం
ఇంకెంత కష్టపడాలి!

ఇంకెన్ని అడ్డంకులు ఎదుర్కోవాలి?
నిన్ను నువ్వు ఇలా ప్రశ్నించుకో...
అప్పుడు ఆ గాయానికి మందు దొరుకుతుంది...

ఏదో ఒక చోట మన ప్రయాణానికి ఆటంకం కలగొచ్చు
అప్పుడే కదా మనదైన దారిని వెతుక్కోగలం
ఆటంకం వల్ల నీ జీవితాన్ని మలుపుతిప్పుకోవాలి గానీ
అక్కడే ఆపేయకూడదు...

ఈ గాయం నీకో జీవిత పాఠం అనుకో...
అన్నింటికీ ఇప్పటినుంచే సిద్ధపడి ఉండు..
ధైర్యాన్ని, నీపై నీకున్న విశ్వాసాన్ని రగిలిస్తూ ఉండు... ■

---

## చీలిక

కొమ్మ నుంచి ఆకులు రాలిపోయినట్టు
మేఘాల నుంచి నీరు జారిపోయినట్టు
కన్నుల నుంచి చూపులు చెదిరిపోయినట్టు
నా నుంచి మనుషులు విరిగిపోతున్నారు

అప్పుడప్పుడు
పెదాలపై ఎంగిలిని అద్దుకుంటూ
నాలుగు మాటలు చెరుగుతారు
ఆ మాటలన్నీ చితిపై పేర్చిన పిడకలే !

తల్లి కోడి
తన రెక్కలను భూమిపై పరిచి
వివక్షా గీతాలను ఆలపిస్తుంది
సమానత్వం లేని తల్లి ముల్లుల హారమే!
ఆవిరైపోయే కాలం కింద
పువ్వులను తోడుకుంటూ
కొండకు, కొండ కింద అక్షరాల తోటకు
మంట పెట్టావు!

కొమ్మ విరిగిన చప్పుడు
అది, నా మనసే ఏమో!

- జాని తక్కెడశిల
72595 11956

■



# వ్యవస్థ మార్పునకు 'వలస భారతం' పిలుపు

- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
94402 22117

**చప్పట్లు కొట్టి స్వాగతం పలకడం**
**కొవ్వొత్తి వెలిగించి చీకట్లు తరమడం**
**గాంధియన్ సింబాలిజం పట్ల మక్కువ తప్పు**
**మానవాళికి ఒరిగేది ఏముంది?**
**(వలస భారతం : పుట 46)**

ప్రపంచ యుద్ధాల తర్వాత, బోల్షివిక్ విప్లవం తర్వాత ప్రపంచ కవులందరినీ ఏకం చేసిన సందర్భం కరోనా వైరస్ వ్యాప్తి. కోవిడ్-19 పేరున కరోనా వైరస్ ప్రపంచాన్ని గడగడలాడించింది. ఈ ఆందోళనాత్మకమైన సమయంలో ప్రపంచ కవులంతా గత ఏడాది కాలంగా ఈ ఒక్క వస్తువు మీదనే పుంఖానుపుంఖాలుగా కవిత్వం రాస్తున్నారు. అసంఖ్యాకంగా తెలుగు కవులు ఈ కరోనా కవిత్వ రచనోద్యమంలో భాగస్వాములయ్యారు. నానీలు వంటి కురుచ కవితలు, పాటలు, వచన కవితలు, గేయాలు, దీర్ఘ కవితలు కావ్యాలు కరోనా వైరస్ బారినపడిన ప్రజల బాధలను ప్రతిబింబిస్తున్నాయి. ఈ పెద్ద తానులో ఒక పోగుగా వచ్చింది జివి కృష్ణయ్య రచించిన "వలస భారతం" కావ్యం.

గ్రామాల్లో బతకలేక పొట్ట చేతబట్టుకొని మహానగరాలకు వలసపోయిన భారతీయ కూలీలు, లాక్‌డౌన్ ప్రకటించడంతో, బతుకుతెరువు కోల్పోయి రోడ్ల మీదకొచ్చి స్వస్థలాలకు నడచి పోయిన దృశ్యాలు భారతదేశ చరిత్రలో అరుదైనవి. దాదాపు పదహైదు రోజులు ఈ దృశ్యాలు బీభత్స అధ్యాయంగా కొన సాగాయి. ఆకలి ముందు ఆంక్షలన్నీ పటాపంచలయ్యాయి.

జి.వి. కృష్ణయ్య వలస కూలీలు కాలి నడకల్ని ఆధారం చేసుకొని, ఈ మార్క్సిస్టు దృక్పథంతో కూలీల కడగండ్లను కరోనా వైరస్ చుట్టూ ఆవరించిన దోపిడి రాజకీయ ఆర్థిక మూలాలను ఆవిష్కరించారు. మానవతావాది కానివారు మార్క్సిస్టు కాలేరని అన్నారు శ్రీశ్రీ. వలసభారతం నిండా మానవతావాదమే పరుచుకొని కష్టజీవికి ఇరువైపులా నిలిచారు కవి కృష్ణయ్య. నగరాల నుంచి స్వస్థలాలకు కాలినడకన బయలుదేరిన కూలీలు ఎవరో కవి మొదటి రెండు ఖండికల్లో గుర్తించి నిర్వచించారు.

**ఎవరీ పాదచారులు?**
**పట్నమొచ్చిన పల్లె వాసులు! వలస కూలీలు!**
**మట్టి మనుషులు ఈ దేశ వాసులు!**

అని కవి గుర్తించారు. గ్రామాల్లో పని చేయవలసిన వాళు వృత్తి మార్చుకొని "పార పట్టిన చేతుల్లో తాపీ మొలిచింది" అన్నారు. అంతేకాదు, ఆ కూలీలు నగరాల్లో అభివృద్ధిలో చెమట చిందించిన వాళ్లని అన్నారు. "సంపద సృష్టికర్తలు" అని నిర్వచించారు. దేశాభివృద్ధికి కష్టించే కూలీలు/ అభివృద్ధికి దూరంగా ఆకలికి దగ్గరగా / ముడుచుపోయిన కూలీలు కావడం వారు పరాయీకరింపబడ్డారనడానికి నిదర్శనం. సంపద సృష్టికర్తలు ఒకరు, దాని భోక్తలు ఇతరులు కావడం పరాయీకరణ.

కరోనా వైరస్ వ్యాప్తిని నివారించడానికి పాలకులు అత్యవసరంగా లాక్‌డౌన్ ప్రకటించారు. ఆ హఠాత్ ప్రకటన ఎక్కడి వాళ్ళను అక్కడే బంధించేసింది. వలసకూలీలకు పని ఆగిపోయింది. ఆదుకునేవారు లేరు. విధిలేక వాళ్ళు రోడ్డెక్కారు. దాదాపు 15 కోట్ల మంది కూలీలు రోడ్డెక్కినప్పుడే స్వతంత్ర భారతదేశం అసలు రూపం అనుభవంలోకి వచ్చింది.

పాలకులు ఆంక్షలు విధించడం తప్ప ఆదుకున్నది లేదు. ప్రజలు ఆదుకున్నారు. స్వస్థలాలకు వెళ్ళే క్రమంలో వలస కూలీలు పడ్డ బాధలు వర్ణనాతీతం. కృష్ణయ్య ఈ బాధల్ని ఒక దీర్ఘ ఖండికలో ఆవిష్కరించారు.

**"అకస్మాత్తుగా లాక్‌డౌన్**

**వలస బతుకులకు బ్రేక్‌డౌన్"** అంటూ వలస కూలీలు అవస్థలను వివరంగా చిత్రీకరించారు.

**"దారిపొడవునా రక్తపాదముద్రలతో**

**వలసభారత ఆధునిక చిత్రం"** అని వర్ణించారు.

మార్క్సియ కవిగా కృష్ణయ్య పాలకులు సాధించుకున్నట్లు ప్రచారం చేసుకున్న హరిత, నీలి, క్షీర విప్లవాల తర్వాత కూడా ఈ వలస కార్మికులు ఎలా వచ్చారు అని ప్రశ్నించారు.

**మార్కెట్ విప్లవ విఘాత ప్రతిరూపాలా?**

**విఫలమైన పాలక ఔదార్య అవశేషాలా?**

అని దెప్పిపొడిచారు. వ్యవసాయ భూముల్లో పని చేయాల్సిన రైతులు, వృత్తికారులు, కూలీలు అందరూ భూముల్ని వదిలేసి నగరాలకు కూలీలుగా వలసపోవడంలోని రాజకీయాన్ని అధిక్షేపించి,

**ఓ పాలకురాలా! నా ఏలికలారా!**

**'వెలిగిపోతున్న' దేశంలో ఆరిపోతున్న దీపాలు వీరు"**

అని నిర్వచించి నిలదీశారు. ఎన్నికలపుడు రాజకీయ వాదులు ప్రజలమీద కురిపించే కపటప్రేమను కవి ఎండ గట్టాడు. ప్రజలను విస్మరించి వ్యాపార వర్గాలకు మేలు చేసే దుష్టరాజకీయాన్ని నిస్సంకోచంగా ఎత్తిచూపారు. కరోనా కాలంలో పాలకులు ప్రకటించిన ప్యాకేజీలను

**ఆర్థిక ప్యాకేజి ఒక దేవతా వస్త్రం**

**కార్పొరేట్ వర్గాలకు అమృతభాండం** అని విమర్శించారు. కరోనా సమయంలో వైద్యనిపుణులు సూచించిన పౌష్టికాహారాన్ని ప్రస్తావించిన కవి, ఆ ఆహారం పేద ప్రజలకు అందని మాని పండు అని పేర్కొన్నారు. "గంజికే గతిలేని వారికి విందు భోజనం" ఎలా సాధ్యమౌతుందని ప్రశ్నించారు. కరోనా విజృంభించడానికి ఢిల్లీలోని మర్కజ్‌లో ముస్లిములు నిర్వహించిన కార్యక్రమమే కారణమని జరిగిన ప్రచారాన్ని కవి ఆక్షేపించారు.

**అధికార పగ్గాలు చేపట్టడానికీ**
**ప్రత్యర్థుల్ని అడ్డు తొలగించడానికీ**
**ఏమాత్రం అడ్డురాని కరోనా మహమ్మారి**
**మర్కజ్‌తో విజృంభించిందని మతలబులు**
**మతంరంగు పులమాలని ఉన్మాదపు తహతహలు**

కరోనా వైరస్ వ్యాప్తిని నివారించడానికి శారీరక దూరం పాటించమని విజ్ఞులు సూచిస్తే, దానిని ఆసరా చేసుకొని అస్పృశ్యతా సిద్ధాంతాన్ని సమర్థిస్తూ కవితలు రాసిన వారిని కృష్ణయ్య తీవ్రంగా అధిక్షేపించారు. కరోనా వైరస్ వ్యాప్తికి కవి శాస్త్రీయమైన కారణంగా పెట్టుబడిదారీ వ్యవస్థనే పేర్కొన్నారు. పెట్టుబడిదారీ శక్తులు పర్యావరణ విధ్వంసానికి పూనుకోవడం వల్లనే అనేక అనర్థాలు జరిగాయని కవి అభిప్రాయపడ్డారు.

**చెట్టూగుట్టా పుట్టా కొట్టేస్తే**
**మట్టి మౌనంగా చూస్తూ ఊరుకుంటుందా!**
**పగపడుతుంది.. ప్రతీకారం తీర్చుకుంటుంది**

సాంకేతిక విప్లవంతో ఎన్నో ప్రయోజనాలున్నా, కొన్ని నష్టాలు కూడా ఉన్నాయని కవి గుర్తించారు. సెల్‌టవర్ల వల్ల పక్షిజాతి నశించిపోవడాన్ని ప్రస్తావించాడు.

**పిండాకూడు ముట్టడానికి**
**కాకులు కూడా కరువైన కాలమిది**

ప్రపంచీకరణం సాంస్కృతికంగా తీసుకొచ్చిన విచ్చలవిడి జీవన శైలిని కూడా కవి విమర్శించారు. అశాస్త్రీయమైన పారిశ్రామిక విధానం వల్ల పెరిగిపోతున్న కాలుష్యాన్ని కూడా కవి ఎత్తిచూపాడు. కరోనా కాలంలో మనిషి ఆరోగ్యంతో కార్పొరేట్ వ్యాపార వర్గాలు ఎలా ఆడుకున్నాయో కవి గుర్తించాడు.

**కార్పొరేట్ వైద్యం పరుగులు పెడుతుంటే**
**ప్రజారోగ్య వ్యవస్థ మరణశయ్యపై కూలబడుతుంది**

అని ఆక్షేపించాడు. ప్రజారోగ్యాన్ని వ్యాపార విషయంగా రూపాంతరం చెందించిన దుర్మార్గాన్ని కవి కుట్రగా భావించాడు.

**మనిషికోసం మందులు కాదు**
**మందుల కోసం మనిషి జీవిస్తున్నాడు**

అని వైద్యరంగంలోని అపసవ్యకర ధోరణిని కవి ఎత్తిచూపాడు.

కరోనా కాలంలో పాలకులు తాము చేయాలనుకున్న ప్రజా వ్యతిరేక పనులన్నీ సజావుగా చేసేస్తున్నారు. జాగరూకుడైన కవి ఈ అంశాన్ని కూడా గుర్తించాడు.

**కరోనా కత్తి వేలాడే సమయంలో**
**అగ్రజులతో యథావిధిగా వేలకోట్ల ఒప్పందాలు**
**బడా కోటీశ్వరులకే మరిన్ని రాయితీలు**

రాజకీయాల్లో స్వాతంత్ర్యానంతరం వ్యక్తి పూజ ఒక మానసిక రుగ్మతగా మారింది. ఇప్పుడు ఈ రుగ్మత బాగా

విస్తరించి ఢిల్లీనుంచి గల్లీ దాకా పాకింది. కృష్ణయ్య ఈ రాజకీయ రుగ్మతను కూడా ప్రస్తావించాడు.

**నాటి జన రాజకీయం మసకబారిపోయింది**
**వ్యక్తి పూజను నినదించే భజన రాజకీయంగా మారింది**
**నేడు కుదుళ్ళు తెగిన**
**విభజన రాజకీయం కొనసాగుతోంది**

జరుగుతున్న అన్యాయాలను, ప్రశ్నించాల్సిన వ్యవస్థలన్నీ మౌనంగా ఉండిపోవడం పట్ల కవి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆఖరికి మన సమాజానికి ఇప్పుడు చేయవలసింది ఏమిటో చెప్పాడు కవి.

**బుల్లెట్ రైళ్లు, డిజిటల్ ఇండియా**
**బలమైన ఆర్థిక మండళ్ళు**
**స్మార్ట్ సిటీ భవనాలూ**
**ప్రపంచ గురువూ, ఆదర్శ ప్రభువు**
**తారకమంత్రాలూ యోగా తపో భంగిమలు**
**ఇవేవి కాదు**
**సమానావకాశాలు, సమూల మార్పులు**
**సత్వర చర్యలు కావాలిప్పుడు**

కరోనా చుట్టూ ఆవరించిన సమస్త ఆర్థిక సాంఘిక, రాజకీయ సాంస్కృతిక పార్శ్వాలనూ కవి తనదైన రాజకీయ నేత్రంతో దర్శించి కావ్యంగా మలిచాడు. వస్తువు సమస్త ప్రజలకు సంబంధించినది గనుక, ఈ కావ్యాన్ని సమస్త పాఠకులకూ అర్థమయ్యేటట్టుగా రాశారు. బలమైన భావుకతా భారంతో కావ్యాన్ని నింపలేదు. ఇది వస్తు ప్రధానమైన కావ్యం. కవి తెలిసే ఈ పని చేశాడు. ఎవరి బాధలు వస్తువుగా చేసుకొని కావ్యం రాశారో, వాళ్ళకు ఈ కావ్యం అర్థం కావాలి. వాళ్ళకు ఈ వ్యవస్థ అర్థం కావాలి. వాళ్ళలో ఆలోచనలు మొదలవ్వాలి అన్నది కవి ఉద్దేశమై ఉంటుంది.

మార్క్సియ కవిగా, ఈ రుగ్మతలతో కూడిన వ్యవస్థను నిర్మూలించడానికి అందరూ ఐకమత్యంతో ఉద్యమించాలని పిలుపునిచ్చాడు.

**'ప్రపంచీకరణ ఒక పెద్ద మహమ్మారి' అని నిర్వచించి,**
**జననష్టం జగత్తు కష్టం ఆగాలంటే**
**అందరమొకటై కార్యాచరణకు రావాలి**
**వర్గకసిగా రగిలి**
**రాజకీయ పోరాటంగా రూపొంది**
**రాజ్యాధికారాన్ని ప్రశ్నించే ఆలోచనలను**
**చైతన్యం, పరిణామం పరివ్యాప్తం కావాలి** అన్నది కవి పిలుపు. ఈ వ్యవస్థనూ విశ్లేషించడమే కాదు, వ్యవస్థను మార్చాలన్న సంకల్పాన్ని ఈ కవి ప్రతిపాదించాడు. కరోనా మీద వచ్చిన కావ్యాలన్నీ ప్రపంచ కవిత్వంలో భాగాలే. 'వలస భారతం' అలాంటి కావ్యం. ■

## పరాన్నజీవులు

**తా**ను ఆగ్రహిస్తున్నాననీ అనుగ్రహిస్తున్నాననీ
గణికులు గణనీయంగా
గణిస్తుస్తున్నారనీ గుణిస్తున్నారనీ
గ్రహించలేదు గ్రహం


ఆకర్షణను వికర్షించి
నిరాధారంగా నిగడించాడు యూరీ గగారిన్
గోరుముద్దల జాబిల్లికి
మనిషిని రుచిచూపాడు నీల్ ఆర్మ్ స్ట్రాంగ్

విశ్వ రహస్యాల ఛేదనలో
శోధనను శోషించనీయదు మకిలి మతతత్వం
భ్రమణుల చుట్టూ పరిభ్రమించే భ్రమలు
గ్రహణం పట్టిన నరుడేమో కానీ
ఆగ్రహానికి అనుగ్రహానికి
గ్రహానికన్నా గ్రహయోగం ఉందా
స్వేద రహితంగా సేదతీరు కక్కున
మహర్జాతక హస్త సాముద్రికాలూ సాంఖ్యా శాస్త్రమూ
రంగుల నవరత్నాలు పురా బొగ్గుముక్కలు
వాస్తున ఒదుగునా వాస్తవాలు

అర్చనెవరిది అర్పణెవరిది
సజీవ శిల్ప శిలల భుక్త భక్తి
అద్దిన రూపాలకు జన్మ పునర్జన్మలనిచ్చి
లోక రక్షకుడికీ రక్షణనిచ్చే శాస్త్రబద్ధ మూఢత్వాలు
ఊడలు చాస్తోన్న ఉపాధి పథకాలు!

**- బడుగు భాస్కర్ జోగేష్**
**98666 02325**

# కవితలు



## విచికిత్స

**- డాక్టర్ ఎన్ గోపి**

నేనూ నా మానవ సంబంధాలు
తెగిపోయినవెన్ని?
మిగిలినవెన్ని?
వీటికి కారణం నేనేనా?
సిద్ధాంతాల వేలు చూపిస్తూ
సమర్థించుకోజూస్తున్నానా!

పొద్దున
ఉదయకిరణాలతో పాటు
ప్రశ్నలు గుచ్చుకుంటున్నాయి
ఎక్కడ ప్రారంభమైంది జీవితం?
ఏ చరిత్రలో భాగాన్ని నేను
చరిత్ర సృష్టించానా నేను.

లోపలికీ బయటికీ తిరుగుతూ
అలిసిపోతున్నానా?
ఈ దారులు పాతవే
కొత్తగా నేనే కనిపెట్టినట్టు భ్రమ!
పొగరెక్కిన
నా విజయాలు విజయాలేనా?
నేను ప్రపంచాన్ని చూస్తున్నానా
అదే నన్ను వింతగా గమనిస్తుందా?

ఈ చెట్టులోని సహజత్వం
నాలో మాయమైందా?
మూలుగుతున్న గుర్రానికి
కొత్త జీను తగిలిస్తున్నానా?


ఈ పొలాల నిండా
గతం పరుచుకుంది.
మొలుస్తున్న గరికపోచలు
పిలుస్తున్న భవిష్యత్తుకు ప్రతీకలేనా?

భ్రమణాన్నే గమనంగా
భ్రమిస్తున్నానా
ఏమో!
నేనూ నా మానవసంబంధాలు,
తెగిపోయినవెన్ని?
మిగిలినవెన్ని?

## ఒక్కోసారి

**ఈ** జ్ఞాపకాల భారాన్ని మోయలేక
జ్ఞాపకశక్తిని కోల్పోయే వరం లభిస్తే బాగున్ననిపిస్తుంది
కానీ చిరపరిచితమైన వ్యక్తులు
పూర్తిగా అపరిచితమైపోరూ ...
ఇలాంటి చెత్త ఆలోచన ఇంకెప్పుడూ రానివ్వకని
నన్ను నేనే తిట్టుకుని
మరోసారి ఇష్టంగానే జ్ఞాపకాల అల్మారాని తెరిచి
అన్నింటిని అపురూపంగా చూసుకుని
భద్రంగా తాళం వేసుకుంటాను ..!

**- సునీత పేరిచర్ల**
83094 20900



# కవులు ప్రజలవైపే ఉండాలి!



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న గోళ్ల నారాయణ రావు

**తె**లుగువారి పోరాట పటిమకు, త్యాగాలకు ప్రతీకయిన విశాఖ ఉక్కును ప్రయివేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించటంపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. అలాగే మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల పోరాటం సాగుతోంది. వీరికి సంఘీభావంగా ఫిబ్రవరి 18న విజయవాడ లోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జాషువా సాంస్కృతిక వేదిక, సాహితీ స్రవంతి, అరసం సంయుక్తంగా నిర్వహించాయి. సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యరంజన్ ఆహ్వానం పలుకుతూ... 'మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మూకస్వామ్యం, అసహన ధోరణులు పెరిగిపోతుంటే మొదట వ్యతిరేకంగా గళం విప్పింది రచయితలు, కవులు, కళాకారులేనని అన్నారు. ఇప్పుడు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ, రైతు వ్యతిరేక చట్టాలు వంటి ప్రజా వ్యతిరేక చర్యలపై కవులు, రచయితలు మరింతగా స్పందించి, ప్రజల్ని చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు గుండు నారాయణ మాట్లాడుతూ, మధ్యస్థం అంటూ లేదని, ప్రజలవైపే నికరంగా నిలబడాలని అన్నారు. విరసం రాష్ట్ర కార్యదర్శి అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ.. ఇప్పుడు ఒక కవిత రాస్తే.. ఒక ప్రశ్న వేస్తే.. 'దేశద్రోహి' అని ముద్ర వేయడానికి సిద్ధంగా ఉంది ప్రభుత్వం. ఈ మహా విధ్వంసాన్ని ఎదుర్కోవడానికి మనం సిద్ధపడితేనే భవిష్యత్తు భారతదేశానికి న్యాయం చేసినవారమవుతాం అని అన్నారు. అరసం నాయకులు కొండపల్లి మాధవరావు శ్రీకృష్ణ రాయబారం పద్యం వినిపించి, మనకెందుకులే అన్నట్టు ఉండకూడదని, చెడును సహించకూడదని అన్నారు. కవులు కలాల ద్వారా, కళాకారులు గళాల ద్వారా వినిపించడం అవసరమని అన్నారు. సాహితీ స్రవంతి శాంతిశ్రీ మాట్లాడుతూ.. పాలకుల కుట్రలను కవులు, కళాకారులు బట్టబయలు చేయాలని అన్నారు. కవి అనిల్ డానీ మాట్లాడుతూ 'ఆందోళనలు చేసే వారి ముఖాలు చాలా భయంకరంగా ఉంటాయి' అని దిశా రవిని ఉద్దేశిస్తూ ఒకరు పోస్టు పెడితే.. ప్రముఖ రచయితగా పేరొందిన యండమూరి దానిపై స్పందిస్తూ.. 'మంచి పరిశీలన' అని కామెంట్ పెట్టడం దారుణమని విమర్శించారు. ఇంకా గోళ్ల నారాయణరావు, ప్రోగ్రెస్ ఫోరం నాయకులు జమిందారు మాట్లాడుతూ ... ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారిపోయే ప్రమాదం ఉందని అన్నారు.

పలువురు కవులు తమ కవితలను వినిపించారు. మొదటగా శాంతిశ్రీ 'మనందరి హక్కు!' అనే కవితలో ఉక్కు సంకల్పమే సాధనకు మూలం../ భూములిచ్చిన గుండెలు మండుతున్నాయి. కారుచౌకగా అమ్మేస్తానంటే రగులుతున్నాయి.. నిత్యం చెమట చిందే నేలలో విచ్చుకుంది ఉక్కు ఉద్యమ పువ్వు/ ఉత్తేజపు పరిమళాలు హత్తుకునేందుకు / మనమందరం ఒక్కటై కదులుదాం..' అని వినిపించారు. శిఖా ఆకాష్ 'అమ్మకం పేరు ప్రజాస్వామ్యం' అనే కవితలో /జాతి మొత్తాన్నీ తాకట్టు పెడుతున్న వైనం!/ ఒక దళారీ పాలన ఆటంకాల కాలాన్ని రచిస్తున్న దృశ్యం!/ వాడు సముద్రాన్ని పూడ్చడానికి మొదలయ్యాడు/ ప్రజల ఉక్కు సంకల్పంతో వాడి కోటగోడల్ని కూల్చేయడానికి ఒక యుద్ధ సునామీగా మొదలవుదాం రండి!/ అంటూ పిలుపునిచ్చారు. సాంబశివరావు గారు రైతు బాధలపై పద్యం పాడారు. వినీల్ 'సినిమా చూపిస్తా మామా!' అంటూ సినిమా పేర్లతో వినూత్నమైన కవితను వినిపించారు. వడ్లమూడి పద్మావతి తన కవితలో /వాళ్ల కండలు కరిగితే కొండలాంటి నిక్షేపాలు ఉబికి వచ్చాయి/ ఆ ఉక్కుతోనే కదా నీ సౌధాలు నిర్మించుకున్నావ్/ ఇప్పుడిక ఆ పిడికిళ్లు బిగిశాయి.. నీ పునాదులు జాగ్రత్త!/ అంటూ హెచ్చరించారు. అరసవిల్లి కృష్ణ కవిత 'దీపశకలం' అనే కవిత వినిపించారు. ప్రసాదమూర్తి రాసిన 'రైతు రెండో రాకడ' కవితను రాజు చదివి వినిపించారు. ఏలూరు నుంచి వచ్చిన శ్రీహరికోట 'రైతే రాజు' అంటూ పద్యం పాడారు. బంగార్రాజు 'ఆకుపచ్చని సూరీడు' అంటూ రైతు గురించి తన కవితను వినిపించారు. బూరుగుపల్లి ప్రభావతి పంపిన కవితను కొండపల్లి మాధవరావు చదివి వినిపించారు. చివరిగా అనీల్ డానీ 'కిటికీలు మూయండి!' అనే కవితను వినిపించారు. ■

## కర్షక సాహిత్యంపై సదస్సు



సదస్సులో పాల్గొన్న కవులు, రచయితలు

**14-2-2021** ఆదివారం సాయంత్రం కాకినాడలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన "తెలుగు సాహిత్యంలో కర్షకుడు" అనే అంశంపై సాహితీ సదస్సు జరిగింది. సదస్సుకు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించగా, శ్రీమార్ని జానకిరామ్ చౌదరి వక్తలను పరిచయం చేశారు. ముఖ్యవక్తగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్, పూర్వ రిజిస్ట్రార్ అయిన ఆచార్య టి.గౌరీశంకర్ పాల్గొన్నారు. నన్నయ తిక్కన శ్రీనాధాది ప్రాచీనకవుల నుంచి కర్షక కవిత్రయంగా పేరుపొందిన దువ్వూరి రామిరెడ్డి, ఏటుకూరి లక్ష్మీనరసయ్య, తుమ్మల సీతారామ్మూర్తి చౌదరి వంటి ఆధునిక కవుల వరకు రైతు గురించి రాసిన కవిత్వాన్ని విశ్లేషించారు. మరొక ఉపన్యాసకునిగా ప్రముఖ కవి అద్దేపల్లి ప్రభు మాట్లాడారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో గనారా, డాక్టర్ వియ్యపు హనుమంతరావు, మార్ని జానకిరామ్ చౌదరి, బొల్లోజు బాబా, గిడుగు చలపతి, అవధానుల మణిబాబు, పసుమర్తి పద్మజావాణి, ప్రిస్కిల్లా, పద్మావతి, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## తగుళ్ళ గోపాల్‌కు అవార్డు ప్రదానం



తగుళ్ల గోపాల్‌కు సన్మానం చేస్తున్న దృశ్యం

తెలుగు సాహిత్యరంగంలో మంచి కృషి చేస్తున్న కవులకు గత పదేళ్లుగా ఇస్తున్న పాలమూరు సాహితి పురస్కారాన్ని 2019 సంవత్సరానికి గాను 'దండకడియం' కవి తగుళ్ళ గోపాల్‌కు అందజేశారు. ఫిబ్రవరి 14న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పురస్కారంతో పాటు రూ. 5,116 నగదు, శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ముఖ్య అతిథి ప్రముఖ న్యాయవాది బుర్రి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ, పాలమూరు సాహితి కవులకు పురస్కారాలను అందజేయడం అభినందించదగ్గ విషయమని అన్నారు. డాక్టర్ బోగ కోదండపాణి మాట్లాడుతూ, కవిత్వం సమాజాన్ని సంస్కరించే విధంగా ఉండాలని అన్నారు. సభాధ్యక్షులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, తగుళ్ళ గోపాల్ కవిత్వం పాలమూరు మట్టిని, పల్లె సౌందర్యాన్ని పట్టి చూపుతుందన్నారు. పురస్కార వ్యవస్థాపకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ, మంచి కవిత్వం రాస్తున్న కవులందరికీ పాలమూరు సాహితి ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా యువకవి వేముల కోటయ్య రచించిన 'నవరత్నాలు' కవితాసంపుటిని బుర్రి వెంకట్రామారెడ్డి ఆవిష్కరించారు.



**వైజాగ్ స్టీల్‌ప్లాంటు ప్రయివేటీకరణ ప్రయత్నాలను నిరసిస్తూ విశాఖనగరంలోని కంచరపాలెం బిఎన్ఆర్ ఫౌండేషన్, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13వ తేదీన కవిసమ్మేళనం జరిగింది. పలువురు కవులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఉక్కును అమ్మేస్తే ఊరుకోమని హెచ్చరించారు. తమ పదునైన కవితాస్త్రాలను సంధించారు. ఈ కార్యక్రమానికి పెంటకోట రామారావు, కొసరాజు స్వతంత్ర కుమార్ ఆధ్వర్యం వహించారు.**


# స్వీకారం



## కామోత్సవ్

**రచన : గుంటూరు శేషేంద్ర శర్మ**
**వెల : రూ.200 పేజీలు : 200**
**ప్రతులకు : 94410 70985**

**ఈ** నవల 1987లో ఆంధ్రజ్యోతి వార పత్రికలో సీరియల్‌గా వచ్చి, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో అశ్లీల కేసును ఎదుర్కొంది. ఆయా కోర్టుల అనుకూల తీర్పును పొందింది. “మనం అపవిత్రం అనుకున్నవి ఉన్నతవర్గాలను ఏమాత్రం బాధించవు. వాళ్ల ఎంజాయ్‌మెంట్స్ ప్లెషర్స్ అన్నీ శరీరానికి సంబంధించి ఉంటాయి. అలాంటి వాళ్లను గురించి వ్యంగ్య ప్రధానంగా రాసిన నవల ఇది” అని శేషేంద్ర ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ నవలను ఆయన కుమారుడు సాత్యకి ఇటీవల పునర్ముద్రించారు.



## యానాంలో ఒకరోజు కథలు

**రచన : అంపశయ్య నవీన్**
**వెల : 200 పేజీలు: 142**
**ప్రతులకు : 99891 91299**

ఇది నేను ప్రచురించిన 8వ కథా సంకలనం. కరోనా పుణ్యమాని బోల్డు తీరిక దొరికింది. ఎప్పట్నించో రాయాలనుకుంటున్న కథల్ని ఇప్పుడు రాసే వెసులుబాటు దొరికింది. ఈ సంకలనంలో 3 కథలు తప్ప మిగతావన్నీ కరోనా పీరియడ్‌లో రాసినవే! ఈ కథలన్నిటికీ ఒక నేపథ్యం ఉంది. నేను పొందిన అనుభవాలే ఆ నేపథ్యం.

**- అంపశయ్య నవీన్**




## విశాలాక్షి కథలు

**బహుమతి కథల సంకలనం**
**వెల : 200 పేజీలు: 278**
**ప్రతులకు : 94405 29785**

**వి**శాలాక్షి మాసపత్రిక 11 ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా వెలువడుతూ ఏటా కథల పోటీ నిర్వహిస్తోంది. ఈ ఏడాది అలా ఎంపికైన బహుమతి కథలతో ఈ సంకలనాన్ని వెలువరించాం. ఈ కథల్లో ఎన్నో జీవితాలు దర్శనమిస్తాయి. ఎన్నో సంగతులను వినిపిస్తాయి. ఈ కథలు మనం మాట్లాడుకున్నంత సులువుగా, తేలిగ్గా ఉంటాయి. తెలుగు కథా సాహిత్య సుసంపన్నతకు దోహదం చేసే చిన్ని ప్రయత్నమే మా విశాలాక్షి కథల పందిరి.

**- కోసూరు రత్నం, ఈతకోట సుబ్బారావు**



## యాలై పూద్చింది (కవిత్వం)

**రచన : పల్లిపట్టు నాగరాజు**
**వెల : 150 పేజీలు: 136**
**ప్రతులకు : 99894 00881**

**త**న వాక్యాన్ని తాను నిర్మించుకునే ఏ కవన్నా నాకు ఇష్టం. పల్లిపట్టు నాగరాజు పట్ల నా ఇష్టానికి కారణమిదే! ఈ కవి రాయలసీమతనంతో కవిత్వ వ్యక్తీకరణకు ప్రాణం పోస్తున్నాడు. బేషుగ్గా ఇతడు రాజకీయ కవి. పాలక రాజకీయాల్ని ఎప్పటికప్పుడు టార్గెట్ చేస్తూ రాస్తున్న కవి. బతుకులోని బహు మూలాల్ని అశ్రద్ధ చేయకపోవడం మరో ప్లస్ పాయింట్. ఈ సంపుటిలోని ‘కుశాల’, ‘పిచ్చుక వాలిన కిటికి’, ‘బువ్వ ముందు కూర్చున్నప్పుడు … ’ లాంటి కవితల్ని చదివి చూడండి.

**- జి లక్ష్మీ నరసయ్య**



## అచ్చు
కవిత్వం

**రచన : డాక్టర్ సిద్దెంకి యాదగిరి**
**వెల : 100 పేజీలు : 112**
**ప్రతులకు : 81211 44773**

**సి**ద్దెంకి యాదగిరి .. తెలంగాణా పజ్జొన్న కంకి. తీరొక్క పువ్వులాగా ఉంటుంది ఇతడి కవిత్వం. ఎవరికి వాళ్లు ఆస్వాదించి, అనుభవించి, ఆ అనుభూతి పొందాలి గానీ విమర్శకుల మీదో, ముందుమాటల మీదో ఆధారపడకూడదు. మంచి కవితా సంపుటి ‘అచ్చు’లోకి తెచ్చినందుకు అభినంది స్తున్నాను. ఇతడి ‘అచ్చు’ పదిమంది మెచ్చుకోవాలని ఆశిస్తున్నాను. కడపటి తరంలోంచి పుట్టిన మొదటితరం కవి దోషాలను, లోపాలను, మీ లోపలి కోపాలను పక్కన పెట్టి సిద్దెంకితో కరచాలనం చేయండి.

**- ఎండ్లూరి సుధాకర్**



## రామచిలుక పిల్లల కథలు

**రచన : చెన్నూరి సుదర్శన్**
**వెల : 80 పేజీలు: 116**
**ప్రతులకు : 94405 58748**

**పి**ల్లల కథలు రాయటంలో చెన్నూరి సుదర్శన్ గారు సిద్ధహస్తులు. ఈ రామ చిలుక పుస్తకంలో 19 కథలు ఉన్నాయి. పిల్లలకే కాక పెద్దలనూ ఆలోచింపచేసే విధంగా ఉన్నాయి. వేటికవే కొత్త కొత్త అర్థాలతో మనల్ని అలరింపచేస్తాయి. ‘ప్రకృతి మాత’ ఈ రచయిత మొదటి పిల్లల కథల సంపుటి. ఇది రెండోవది. ప్రతి కథా పూర్తయిన తరువాత దానికి సంబంధించిన చక్కని సుభాషితాలు అందించారు. అవి పిల్లలకు, పెద్దలకు ఉపయోగకరంగా ఉంటాయి.

**- యు.విజయశేఖర రెడ్డి**

# స్వీకారం



## సల్లోసల్ల

**రచన : ఆర్‌సి కృష్ణస్వామి రాజు**
**వెల : 120 పేజీలు : 240**
**ప్రతులకు : 93936 62821**

**ఈ** కథలు పల్లె బతుకులపై పరిశోధనా పత్రాలు, మానవీయ జీవన చిత్రాలు. కండ గల వాక్యాల సమాహారమే కథను పుష్టికరంగా తీర్చి దిద్దుతుంది. ఇలాంటి శిల్పమే రాజు గారి ప్రధాన బలం. ప్రాంతీ య యాస అదనపు ఆభరణం. ఈ కథల్లో పాత్రలు అలవోకగా పుట్టుకొస్తాయి. అట్టే వివరణ ఉండదు. అయినా పూర్వ పరిచయ గాఢత కనిపిస్తుంది. అది ఈ రచయితకు సాధనతో సమకూరిన విద్య.

**- ఎమ్వీ రామిరెడ్డి**



## ప్రచ్ఛన్న వస్తు శిల్పాలు సాహిత్య వ్యాసాలు

**రచన : సాగర్ శ్రీరామకవచం**
**వెల : 200 పేజీలు : 136**
**ప్రతులకు : 91216 83515**

**'వ**స్తువు అనే విత్తనం చెట్టులా ఎదిగే క్రమమే శిల్ప విన్యాసం' అంటూ వస్తు శిల్పాన్ని నిర్వచిస్తూ ... వీటికితోడు 'ప్రచ్ఛన్న వస్తుశిల్పాలు' ఉన్నాయనే ఓ వినూత్న ప్రతిపాదనతో ఈ పుస్తకం వెలువడింది. 'ఒక వస్తువును అనుసరించి మరో వస్తువు, దానిని అనుసరించి సాగే శిల్పంతో సమాశ్రయంగా మరో ప్రచ్ఛన్న శిల్పం ఉంటుందనేది సాగర్ గారి ప్రతిపాదన. ఒక వస్తువుకి నీడ ఉన్నట్టే శిల్పానికి ఓ ఛాయ ఉంటుందనేది వారి అభిప్రాయం. ఇందులో ప్రచ్ఛన్న వస్తు శిల్పాలపై వ్యాసాలతో పాటు విమర్శ మీద, పోస్టు మోడర్నిజం మీద, భాష మీద, ఇతర విషయాల మీదా వ్యాసాలు ఉన్నాయి.

**- సలీం**



## సందర్భ (వ్యాస సంపుటి)

**రచన : సుధామ**
**వెల : 300 పేజీలు: 408**
**ప్రతులకు : 98482 76927**

ఇది 76 సాహిత్య వ్యాసాల బృహత్ గ్రంథం. ఇక్కడ బృహత్ అనే పదం రాశికి మాత్రమే కాక వాసికీ అన్వయించేది. ఇందులో కొన్ని పరిచయ స్పర్శలూ, కొన్ని పరామర్శహాసాలూ, కొన్ని సమీక్షా సంభాషణలూ, కొన్ని విమర్శా విశ్లేషణల పాఠాలూ, ఇంకా కొన్ని మన:పూర్వక నివాళులూ ఉన్నాయి. సందర్భలోని కొన్ని వ్యాసాలు అపూర్వమైనవీ, అపురూపమైనవీ. వీటిని చదవడం ఉత్తమాభిరుచి గల సాహితీపరులు కొత్త వెలుగు వెంట పయనించటమే!

**- విహారి**



## సరికొత్త ఆవు పులి కథలు

బాల సాహిత్యం

**రచన : గరిపెల్లి అశోక్**
**వెల : 156 పేజీలు : 58**
**ప్రతులకు : 98496 49101**

**ఈ** రచయిత ఉపాధ్యాయుడిగా రిటైరయ్యారు. తన మనవరాళ్లు శ్రద్ధ, శ్రేయలకు ఆయన రోజూ చెప్పే కథల్లోని కొన్నింటి సంపుటి ఇది. తరతరాలుగా మనం వింటున్న ఆవు పులి మూలకథ ఆధారంగా మన ముందుకు 12 కథలు తెచ్చారు. ఈ కథలు మారుతున్న విలువలకు ప్రతిబింబాలుగా ఉన్నాయి. ప్రతి కథలో ఆవూ పులీ ఉంటాయి. ప్రతి కథలో మారుతున్న నేపథ్యాలను, స్వభావాలను, నీతిసూత్రాలను వివిధ కోణాల్లో చిత్రించారు.

**- మణికొండ వేదకుమార్**



## నెల్లూరు సంగతులు చరిత్ర

**రచన : ఈతకోట సుబ్బారావు**
**వెల : 280 పేజీలు : 304**
**ప్రతులకు : 94405 29785**

ఇది నెల్లూరు చరిత్రను చెప్పే పుస్తకం. వేలాది సంవత్సరాల చరిత్ర, సంస్కృతి కలిగిన సింహపురి సీమ ప్రాభవం గురించి ఎంత చెప్పినా మరెంతో మిగిలే ఉంటుంది. కానీ, నా ప్రయత్నం మాత్రం వివిధ రంగాలకు చెందిన చరిత్ర నేపథ్యం కలిగి, ఆసక్తి కలిగించే సంక్షిప్త సంగతులను చెప్పటం. ఎందరో ఆదర్శ మూర్తులకు, పోరాట యోధులకు, త్యాగమూర్తులకు, లబ్ధప్రతిష్టులకు పేరుగాంచిన సీమ నెల్లూరు. అలాంటి ఎన్నో సంగతులు ఈ పుస్తకంలో వివరించాను.

**- రచయిత**



## విజయవాడ సందర్శనం

**సంపాదకుడు : చలపాక ప్రకాశ్**
**వెల : 200 పేజీలు : 224**
**ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, విజయవాడ**

**ఈ** రచయిత ఇంతకముందు ఎన్నో గ్రంథాలు రచించారు. విజయవాడ అంటే ఈయనకు ఎనలేని అభిమానం. ఈ నగరం గురించి గతంలో ఒక కవితా సంకలనం కూడా వెలువరించారు. ఇప్పుడు విజయవాడకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒక చోట చేర్చి, ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఈ పుస్తకం చదువుతుంటే విజయవాడలోని ఆయా ప్రాంతాలను దర్శించిన అనుభూతి కలుగుతుంది.

**- డా.గుమ్మా సాంబశివరావు**

# సాహితీ సమాచారం

## స్త్రీవాద కవితలకు ఆహ్వానం

నెచ్చెలి, జె.డి.పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్త్రీవాద కవితాసంకలనం కోసం స్త్రీవాద కవితలను ఆహ్వానిస్తున్నారు. 2010 నుంచి ఇప్పటివరకు స్త్రీల సమస్యలపై కవయిత్రులు రాసిన కవితలను మాత్రమే పంపాలి. ఎప్పుడు రాసినది, ఏ పత్రికలో ప్రచురించబడింది తదితర వివరాలు కవిత చివర రాయాలి. కవితతో పాటు విధిగా ఒక ఫొటో, ఊరు, వృత్తి, రచనలు, చిరునామా, ఫోన్, ఈ-మెయిల్ వంటివి జత చేయాలి. ఒకరు ఒక కవిత మాత్రమే పంపాలి. సహకార పద్ధతిలో పేజీకి రూ.300 చొప్పున చెల్లించాలి. 9989198943కి డబ్బు చెల్లించి, రిసీప్టు కవితకు జతచేయాలి. కవిత తప్పనిసరిగా యూనికోడ్‌లో ఉండాలి. ఎంపిక చేసినకవితలు 'నెచ్చెలి అంతర్జాల మాసపత్రిక'లో కూడా ప్రచురింపబడతాయి. కవితలు పంపడానికి చివరి తేదీ: మార్చి 10, 2021. ఈ కవితా సంకలనం నెచ్చెలి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జూలై 10, 2021న ఆవిష్కరింపబడుతుంది. ఈ-మెయిలు మీద "జెడి, నెచ్చెలి స్త్రీవాద కవితా సంకలనం-2021కి" అని రాసి editor.neccheli@gmail.com, jdpublicationsjwalitha@gmail.com పంపాలి.

**– నిర్వాహకులు,** 99891 98943

## పాలమూరు సాహితి అవార్డుకు కవితా సంపుటాల ఆహ్వానం

తెలుగు సాహిత్యంలో ఉత్తమ వచన కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు పాలమూరు సాహితి అవార్డును దశాబ్దకాలంగా ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా 2020లో ముద్రితమైన కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నాం. మూడేసి ప్రతులను మార్చి 30లోపు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఇం.నెం. 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్-509001 చిరునామాకు పంపాలి. బహుమతి పొందిన కవితాసంపుటికి రూ.5,116 నగదు, జ్ఞాపికను అందజేస్తారు.

**– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, 90328 44017**

## తెలుగు కథ, కవిత సంకలనాలకు రచనల ఆహ్వానం

వివిధ దేశాల్లో స్థిరపడిన తెలుగు వారి రచనలతో డయాస్పోరా కథా సంకలనం, కవితా సంకలనం ప్రచురిద్దామని వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, నెచ్చెలి అంతర్జాల మాసపత్రిక సంకల్పించాయి. ఇందుకోసం కథలూ, కవితలూ ఆహ్వానిస్తున్నాం. ఒక్కొక్కరు ఒక కథ, ఒక కవిత మాత్రమే పంపాలి. కథల నిడివి యూనికోడ్‌లో 10 పేజీలకు, కవితలు 30 లైన్లకు మించరాదు. **చివరి తేదీ : ఏప్రిల్ 30, 2021.** రచనలు పంపించాల్సిన ఈ-మెయిల్ చిరునామాలు : **vangurifoundation@gmail.com, editor.neccheli@gmail.com, sairacha@gmail.com**

**– వంగూరి చిట్టెన్ రాజు**


**FORM IV**

(Rule 8)

UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867
STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT MONTHLY -SHAITYA PRASTHANAM

| | |
|---|---|
| 1. Place of Publication | : Hyderabad |
| 2. Periodicity of its Publication | : Monthly |
| 3. Printer's Name | : V. Krishnaiah |
| 1 (a) Whether a citizen of India | : YES |
| (b) If a foreigner, the country of origin | : - |
| Address | : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 4. Publisher's Name | : V. Krishnaiah |
| 1 (a) Whether a citizen of India | : YES |
| (b) If a foreigner, the country of origin | : - |
| Address | : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 5. Editor's Name | : T. RAVI |
| Nationality | : INDIAN |
| 1(a) Whether a citizen of India | : YES |
| (b) If a foreigner, the country of origin | : - |
| Address | : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 6. Name and addresses of owner | : V. Krishnaiah |
| 1(a) Whether a citizen of India | : YES |
| (b) If a foreigner, the country of origin | : - |
| Address | : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |

**I, V. KRISHNAIAH, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

Sd/
V. KRISHNAIAH
Publisher

Date: 01.03.2021

# మాక్సిం గోర్కీ

(28-3-1868 — 18-6-1936)



[illegible]

